మంగళవారం
19-07-2022
విజయవాడ ప్రచురణ
సంపుటి : 71, సంచిక : 28
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952

విశాలాంధ్ర

VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

రాష్ట్రపతి ఎన్నికల్లో 99.18 శాతం పోలింగ్

- 10 రాష్ట్రాలు... ఒక కేంద్ర పాలిత ప్రాంతంలో 100 శాతం
- అనేక రాష్ట్రాల్లో క్రాస్ ఓటింగ్
- బ్యాలెట్ బాక్సులు పార్లమెంట్ భవనంలోని స్ట్రాంగ్ రూమ్‌కి తరలింపు
- 21న ఓట్ల లెక్కింపు

న్యూఢిల్లీ: భారతదేశ 15వ రాష్ట్రపతిని ఎన్నుకునేందుకు దేశవ్యాప్తంగా ఉన్న ఎంపీలు, ఎమ్మెల్యేలు సోమవారం ఓటు వేశారు. రాష్ట్రపతి భవన్‌కు జరిగే పోరులో విజయం సాధించడానికి ప్రతిపక్షాల ఉమ్మడి అభ్యర్థి యశ్వంత్ సిన్హా, ఎన్‌డీఏ అభ్యర్థి ద్రౌపది ముర్ము మధ్య ఎన్నిక జరిగింది. పార్లమెంట్

- మిగతా 2 లో

కోవిడ్ నిధులు మళ్లించేస్తారా?

జగన్ సర్కార్‌పై సుప్రీం ఆగ్రహం

రెండు వారాల్లో ఎస్డీఆర్ఎఫ్ ఖాతాలో జమ చేయాలని ఆదేశం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో కోవిడ్ నిధులు పక్కదారి పట్టించిన వ్యవహారంపై సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. ఈ కేసుకు సంబంధించి సుప్రీంకోర్టులో ఏపీ ప్రభుత్వానికి మరోసారి చుక్కెదురైంది. పీడీ ఖాతాలకు మళ్లించిన కోవిడ్ నిధులను తిరిగి రెండు వారాల్లో ఎస్డీఆర్ఎఫ్ ఖాతాలో జమ చేయాలని ఏపీ ప్రభుత్వాన్ని జస్టిస్ ఎంఆర్ షా ధర్మాసనం ఆదేశించింది. పీడీ ఖాతాల్లోకి మళ్లించిన రూ.1100 కోట్లను ఎస్‌డీఆర్ఎఫ్ ఖాతాలోకి జమ చేయాలని స్పష్టంచేసింది. కరోనా పరిహారం అందలేదని ఎవరైనా ఫిర్యాదు చేస్తే నాలుగు వారాల్లో దానిని పరిష్కరించాలని సూచించింది. ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న రాష్ట్ర ప్రభుత్వం వివిధ శాఖలకు చెందిన నిధుల తరహాలోనే ఎస్డీఆర్ఎఫ్ నిధులను మళ్లించిన సంగతి తెలిసిందే. కోవిడ్‌తో మృతిచెందిన కుటుంబాలకు పరిహారంగా ఇవ్వడానికి మాత్రమే ఈ నిధులు ఉపయోగించాల్సి ఉంటుంది. కేంద్రం వీటిని విడుదల చేస్తుంది. అయితే రాష్ట్ర ప్రభుత్వాలు తమ వ్యక్తిగత అవసరాలకు వీటిని వాడకూడదు. కానీ ఏపీ ప్రభుత్వం పీడీ ఖాతాలకు ఈ నగదును మళ్లించడంతో కోవిడ్ వల్ల మరణించిన బాధిత కుటుంబ సభ్యులు కొందరు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. తాజాగా జస్టిస్ ఎంఆర్ షా ధర్మాసనం రెండు వారాల్లోగా ఎస్డీఆర్ఎఫ్ ఖాతాకు మళ్లించాలని ఆదేశించింది.

మానవత్వం లేని జగన్ పాలనకు నిదర్శనం: చంద్రబాబు

నిబంధనలకు విరుద్ధంగా ఏపీ ప్రభుత్వం రూ.1100 కోట్ల కోవిడ్ విపత్తు నిధులను దారి మళ్లించడం మానవత్వం లేని జగన్ పాలనకు నిదర్శనమని ప్రతిపక్ష నేత చంద్రబాబు విమర్శించారు. సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలు జగన్‌రెడ్డి ఇష్టానుసార పాలనకు చెంపపెట్టులాంటిదని పేర్కొన్నారు.

ఇంకా వరద గుప్పిట్లోనే...

లంక గ్రామాలకు అందని ప్రభుత్వ సాయం

కూడు, గూడు లేక అలమటిస్తున్న బాధితులు

సర్వం కోల్పోయిన రైతులు

విశాలాంధ్ర-కాకినాడ: మహోగ్ర రూపం దాల్చిన గోదావరి శాంతించింది. విరుచుకుపడిన వరద ఉధ్ధృతి తగ్గినప్పటికీ తీరం వెంబడి ప్రజలు ఇంకా వరద గుప్పిట్లోనే మగ్గుతున్నారు. లంక గ్రామాలు, విలీన మండలాల్లోని ప్రజల పరిస్థితి అత్యంత దయనీయంగానే ఉంది. ఉండటానికి గూడు లేక, తినడానికి తిండిలేక తీవ్ర అవస్థలు పడుతున్నారు. చిన్నారులకు పాలు కూడా అందించలేని దుస్థితి నెలకొంది. అధికారులు అందించే అరకొర సాయం చాలక పెద్దలు, పిల్లలు ఆకలితో అలమటిస్తున్నామని వాపోతున్నారు. తూర్పుగోదావరి జిల్లా, కాకినాడ జిల్లా, అంబేద్కర్ కోనసీమ జిల్లాలను గోదావరి వరదలు ఊహించని విధంగా దెబ్బతీశాయి. మూడు జిల్లాల్లోని 200 గ్రామాల వరకు ముంపుబారిన పడ్డాయి. కోనసీమ జిల్లాలోని 22 మండలాల్లో 75 గ్రామాలు

- మిగతా 2 లో

శ్రీశైలం ప్రాజెక్టుకు పెరుగుతున్న వరద

విశాలాంధ్ర బ్యూరో-కర్నూలు: కృష్ణా పరీవాహక ప్రాంతంలో కురుస్తున్న భారీ వర్షాల వల్ల శ్రీశైలం ప్రాజెక్టుకు వరద కొనసాగుతోంది. శ్రీశైలం ప్రాజెక్టుకు ఎగువ నుంచి 3,37,254 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. జూరాల నుంచి 1,37,477 క్యూసెక్కులు, సుంకేసుల నుంచి 1,65,122 క్యూసెక్కులు, జూరాల విద్యుత్ ప్రాజెక్టు ద్వారా 34,655 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుండగా, ప్రాజెక్టు నుంచి తెలంగాణా విద్యుత్ ఉత్పత్తికి 31,784 క్యూసెక్కులు, మహాత్మాగాంధీ కల్వకుర్తి ఎత్తిపోతల పథకానికి 2400 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. శ్రీశైలం ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం 215 టీఎంసీలు కాగా ప్రస్తుతం 131.8508 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ప్రాజెక్టు పూర్తి నీటినిల్వ సామర్థ్యం 885 అడుగులు కాగా ప్రస్తుతం ప్రాజెక్టులో 867.50 అడుగుల ఎత్తున నీటి నిల్వ ఉంది.

భజన కళాకారులూ కార్మికులే

- వారి సేవలు గుర్తిస్తేనే టీటీడీకి ఔన్నత్యం
- సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ

తిరుమల తిరుపతి దేవస్థానంలో భజన కళాకారులను కార్మికులుగా గుర్తించాలని, వారి సేవలను కొనసాగించాలని సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ డిమాండ్ చేశారు.

2లో

వాయిదాలతో సరి

- ధరల పెరుగుదల, అగ్నిపథ్‌పై విపక్షాల నిలదీత
- లోక్‌సభ, రాజ్యసభ నేటికి వాయిదా

న్యూఢిల్లీ: పార్లమెంటు ఉభయసభలు ప్రారంభమైన మొదటిరోజే దద్దరిల్లాయి. ధరల పెరుగుదల నుంచి అగ్నిపథ్ పథకం వరకు అనేక అంశాలపై చర్చించాలని ప్రతిపక్షాలు పెద్దఎత్తున డిమాండ్ చేశాయి. ప్రత్యేకించి అన్ని అంశాలను పక్కనపెట్టి యువత జీవితాన్ని ఇబ్బందుల్లోకి నెట్టిన అగ్నిపథ్‌పై తక్షణమే చర్చించాలని పట్టుబట్టాయి. దీంతో ఉభయసభలు పదేపదే వాయిదా పడ్డాయి. సభ నిర్వహణకు సహకరించాల్సిందిగా లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, రాజ్యసభ చైర్మన్ ఎం.వెంకయ్యనాయుడు ఎన్నిసార్లు విన్నవించినా విపక్షాలు శాంతించలేదు. పార్లమెంటు వర్షాకాల సమావేశాలు సోమవారం ప్రారంభమయ్యాయి. ప్రతిపక్షాలు కొన్ని సమస్యలను లేవనెత్తడానికి ప్రయత్నించినప్పటికీ రాష్ట్రపతి ఎన్నికల్లో ఓటేయడానికి సభ్యులకు అవకాశం కల్పిస్తూ లోక్‌సభ ఉదయం కార్యకలాపాలను స్పీకర్ వాయిదా వేశారు. చైర్మన్ వెంకయ్యనాయుడు అధ్యక్ష స్థానంలో కూర్చోగానే కాంగ్రెస్ సభ్యులు వెల్‌లోకి దూసుకెళ్లి ప్రభుత్వానికి వ్యతిరేకంగా

- మిగతా 2 లో



శ్రీలంకలో మళ్లీ ఎమర్జెన్సీ

కొలంబో : శ్రీలంక తాత్కాలిక అధ్యక్షుడు రణిల్ విక్రమసింఘే దేశంలో అత్యవసర పరిస్థితిని ప్రకటించారు. దేశ ప్రజలకు భద్రత కల్పించటం, ప్రజా రవాణా, నిత్యావసరాల వస్తువులు, సేవల నిర్వహణ ప్రయోజనాల దృష్ట్యా అత్యవసర పరిస్థితిని విధిస్తున్నట్లు విక్రమ సింఘే తెలిపారు. 1959లోని 8వ చట్ట సవరణ, ప్రజా భద్రత ఆర్డినెన్స్(చాప్టర్ 40)లోని సెక్షన్ ప్రకారం తనకు అందిన అధికారల మేరకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. దేశవ్యాప్తంగా జులై 18 నుంచి ఎమర్జెన్సీ అమలులోకి వస్తుందని స్పష్టం చేశారు. శ్రీలంకలో కొనసాగుతున్న ఆర్థిక సంక్షోభం నేపథ్యంలో ఈ నెల 19న కేంద్రం అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేసింది. వివిధ రాజకీయ పార్టీల ఆందోళనలను పరిష్కరించేందుకు ప్రభుత్వమే ఈ సమావేశాన్ని ఏర్పాటు చేసింది. ఈ సందర్భంగా లంకలో నెలకొన్న పరిస్థితులపై విపక్షాలతో చర్చిస్తుంది. 225 మంది సభ్యులున్న పార్లమెంట్ ఈ నెల 20న ఓటింగ్ ద్వారా కొత్త అధ్యక్షుడిని ఎన్నుకోనుంది. శ్రీలంక ప్రస్తుతం ఇంధనం, ఇతర నిత్యావసర సామగ్రి కొరతను తీవ్రంగా ఎదుర్కొంటున్న నేపథ్యంలో ఇంధనం సరఫరా లేక పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలను మూసివేయాల్సిన దుస్థితి నెలకొంది. పార్లమెంటు సభ్యులచే కొత్త అధ్యక్షుడిని ఎన్నుకునే షెడ్యూల్‌ను పార్లమెంట్ స్పీకర్ మహింద యాపా అబేవర్ధనా ప్రకటించిన తర్వాత విక్రమసింఘే దేశవ్యాప్తంగా కర్ఫ్యూ ప్రకటించారు. భారత్, అమెరికాల సహా అనేక దేశాలు కొత్త నాయకత్వాన్ని ఎన్నుకోవడంలో ప్రస్తుత నిబంధనలను అనుసరించాలని శ్రీలంకకు పిలుపునిచ్చాయి. వాస్తవానికి, కొలంబోలోని భారత హైకమిషనర్ గోపాల్ బాగ్లే గత వారం స్పీకర్‌ను కలుసుకున్నారు. శాంతియుత, ప్రజాస్వామ్య నాయకత్వ ఆవశ్యకతను నొక్కి చెప్పారు.

నెల్సన్ మండేలాకు ఐరాస ఘన నివాళి

ఐక్యరాజ్యసమితి: వర్ణవివక్ష వ్యతిరేక పోరాట యోధుడు నెల్సన్ మండేలా వారసత్వాన్ని సోమవారం ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ గుర్తు చేసుకుంది. దక్షిణాఫ్రికా నాయకుడు నెల్సన్ మండేలాకు ఘన నివాళు లర్పించింది. ప్రతి సంవత్సరం జూలై 18న జరుపుకునే నెల్సన్ మండేలా అంతర్జాతీయ దినోత్సవం సందర్భంగా ఈ సమావేశం జరుగుతుంది. ఈ తేదీన, ఐరాస ప్రతి ఒక్కరినీ వారి కమ్యూనిటీల నుండి చిన్న చిన్న చర్యలతో సహకరించమని ఆహ్వానిస్తుంది. ప్రతి వ్యక్తి మెరుగైన ప్రపంచానికి సహకరించాల్సిన బాధ్యత ఉందన్న మండేలా వ్యాఖ్యలకు గుర్తుచేస్తుంది. నెల్సన్ మండేలా (1918-2013) తన జీవితంలో ఎక్కువ భాగాన్ని వివక్ష, జాత్యహంకారం, అసమానతలకు వ్యతిరేకంగా పోరాడేందుకు అంకితం చేశారు. 72 సంవత్సరాల వయస్సులో వర్ణవివక్ష వ్యతిరేకంగా 27 సంవత్సరాల జైలు శిక్ష అనుభవించారు. తదనంతరం దక్షిణాఫ్రికా అధ్యక్షుడిగా ఎన్నికయ్యాడు. అంతర్జాతీయంగా శాంతి, సహనం, స్వేచ్ఛ సంస్కృతిని ప్రోత్సహించారు. నవంబర్ 2009లో ఐరాస జనరల్ అసెంబ్లీ జూలై 18ని, నెల్సన్ మండేలా అంతర్జాతీయ దినోత్సవంగా ఆయన సేవలకు గుర్తింపుగా ప్రకటించింది.

క్యూబా విప్లవవీరుడు బాలగుయ మృతి

హవానా : క్యూబా విప్లవకారుడు జోస్ రామన్ బాలగుయ (90) మరణించారు. ఆయన కమ్యూనిస్టు పార్టీ భావజాలానికి ఆకర్షితుడై వివిధ పోరాటాలు చేపట్టారు. బాలగుర్ మృతిపై క్యూబా అధ్యక్షుడు డియాజ్-కానెల్ తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. బటిస్టా ప్రభుత్వానికి వ్యతిరేకంగా వివిధ పోరాటాలు చేశారు. 2019 వరకు సైనిక, దౌత్య, పార్టీ, ప్రభుత్వ శాఖలలో పనిచేశారు. 2004 నుంచి 2010 వరకు ఆరోగ్య శాఖ మంత్రిగా బాలగుర్ పని చేశారు. బాలగుయ పర్యవేక్షణలో వేలాది మంది క్యూబా వైద్యులను వెనిజులా, ఇతర దేశాలకు పంపారు. బాలగుయ మృతికి ఆయన కుటుంబ సభ్యులకు, స్నేహితులకు సానుభూతి వ్యక్తంచేస్తూ కానెల్ ట్విట్టర్‌లో స్పందించారు.

విశాలాంధ్ర ప్రపంచం

గ్వాంటనామో నగరంలో1932లో జన్మించిన బాలగుయ 1952లో బటిస్టా ప్రభుత్వ విధానాలను తీవ్రంగా నిరసించారు. ఈ నేపథ్యంలో ఆయన ఖైదు చేయబడ్డాడు. 1958లో రెబెల్ ఆర్మీలో పోరాట యోధుడిగా, 2వ ఫ్రాంక్ పైస్ ఈస్టర్న్ ఫ్రంట్‌లో వైద్యుడిగా చేరాడు. విప్లవం విజయం కావడంతో క్యూబన్ కమ్యూనిస్ట్ పార్టీ (పీసీసీ)లో సెంట్రల్ కమిటీ, సెక్రటేరియట్, పొలిటికల్ బ్యూరోలో సభ్యుడుగా ఉన్నారు. ఆయన సోవియట్ యూనియన్‌లో క్యూబా రాయబారిగా కూడా పనిచేశాడు, తరువాత రష్యన్ ఫెడరేషన్, నేషనల్ పీపుల్స్ పవర్ అసెంబ్లీలో డిప్యూటీ, పబ్లిక్ హెల్త్ మంత్రిగా కొనసాగారు. కౌన్సిల్ ఆఫ్ స్టేట్ మంజూరు చేసిన అనేక అవార్డులను బాలగుయ అందుకున్నాడు.

భజన కళాకారులూ కార్మికులే

విశాలాంధ్ర బ్యూరో-తిరుపతి: తిరుమల తిరుపతి దేవస్థానంలో భజన కళాకారులను కార్మికులుగా గుర్తించాలని, వారి సేవలను కొనసాగించాలని సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ డిమాండ్ చేశారు. తిరుపతిలోని టీటీడీ ఏడీ భవనం ఎదుట జానపద కళాకారుల సంఘం అధ్వర్యంలో భజన సమ్మేళన అభినందన సభ పులిమామిడి యాదగిరి అధ్యక్షతన సోమవారం ఉదయం జరిగింది. సభలో నారాయణ మాట్లాడుతూ కళాకారులు సమాజ ప్రగతిలో భాగస్వాములని చెప్పారు. భజనలు చేసే కళాకారులను సైతం కార్మికులుగానే తాము భావిస్తామని స్పష్టం చేశారు. దేవస్థానంలో పనిచేస్తున్న వేలాదిమంది శాశ్వత ఉద్యోగుల మాదిరిగానే అంకితభావంతో కళా కార్మికులు సేవలందిస్తారని నారాయణ చెప్పారు. శాశ్వత ఉద్యోగుల మాదిరిగా కళాకారులను మానవత్వంతో చూడాలని కోరారు. శాశ్వత ఉద్యోగుల మాదిరిగా వేతనాలు పెంచాలని, బోనస్ ఇవ్వాలని కళాకారులు డిమాండు చేయడం లేదన్నారు. భక్తి విశ్వాసాలు ప్రదర్శించే అవకాశంతో పాటు కొంచెం ఆర్థిక సహకారం అందించాలని టీటీడీ యాజమాన్యానికి సూచించారు. టీటీడీ యాజమాన్యం, ఈఓ. ధర్మారెడ్డి, చైర్మన్ సుబ్బారెడ్డి నాయకత్వాన కళాకారులకి మంచి అవకాశాలు అందాలని ఆకాంక్షించారు. కళాకారుల సేవలు కొనసాగిస్తామని యాజమాన్యం ప్రకటించడంపై హర్షం వ్యక్తం చేస్తూ అభినందించారు. తాము కమ్యూనిస్టులమే అయినా సమాజంలో భాగమేనని, శ్రమశక్తికి తాము అండగా ఉంటామని, అది కర్మాగారంలో పనిచేసిన కార్మికులయినా, రైతాంగమైనా...కళా కార్మికులు అయినా ఒక్కటేనని స్పష్టం చేశారు. టీటీడీ కార్మికులకు అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. జానపద వృత్తి కళాకారుల సంఘం అధ్వర్యంలో దాదాపు 40 వేలమంది భజన కళాకారులు పాల్గొన్నారు. దీనికి నాయకత్వం వహించి సంస్థను బలోపేతంగా నడిపిస్తున్న పులిమామిడి యాదగిరిని నారాయణ అభినందించారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గసభ్యులు ఎ.రామానాయుడు, ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిన్నం పెంచలయ్య, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కె.కుమార్‌రెడ్డి, కె.రాధాకృష్ణ, సీపీఐ నగర కార్యదర్శి జె.విశ్వనాథ్, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.శివారెడ్డి, మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు వి.జయలక్ష్మి, జిల్లా కార్యదర్శి బి.నదియ, ఉదయ్ కుమార్, ఎం.రామకృష్ణ, దళిత డప్పు కళాకారుల సంఘం రాష్ట్ర కార్యదర్శి మారెళ్ల శ్రీనివాసులు, శ్రీరాములు, కేవై రాజా, డి.సుబ్రమణ్యం, ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి జె.నాగరాజు, డప్పు సూరి, ఫ్లూట్ సుబ్బు, హరిత, ప్రమీల, అఖిల, విజయ తదితరులు పాల్గొన్నారు.

వాయిదాలతో సరి

(మొదటిపేజీ తరువాయి)

నినాదాలు చేశారు. 'సభా కార్యకలాపాలు జరగనీయవద్దన్న కృతనిశ్చయంతో కొంతమంది సభ్యులు వచ్చినట్లున్నారు. సభ్యులంతా వెళ్లి రాష్ట్రపతి ఎన్నికల్లో ఓటేసిరండి. సభను రేపటికి వాయిదా వేస్తున్నాను' అని వెంకయ్యనాయుడు అన్నారు. లోక్‌సభలో ముందుగా కొత్తగా ఎన్నికైన ముగ్గురు సభ్యులు-తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ శతృఘ్నసిన్హా, బీజేపీ సభ్యులు దినేశ్ లాల్ యాదవ్, ఘనశ్యామ్ సింగ్ లోధితో స్పీకర్ ప్రమాణ స్వీకారం చేయించారు. ప్రతిపక్ష సభ్యులు నినాదాలు చేస్తుండటంపై స్పీకర్ స్పందిస్తూ దేశంలో ఎన్నికలు పండుగ వాతావరణంలో జరుగుతున్నాయని, సభ్యులు రాష్ట్రపతి ఎన్నికల్లో పాల్గొనాలని, అందుకోసం మధ్యాహ్నం 2 గంటల వరకు సభను వాయిదా వేస్తున్నానని ప్రకటించారు. ప్రధాని నరేంద్రమోదీ, రక్షణమంత్రి రాజ్‌నాథ్‌సింగ్, హోంమంత్రి అమిత్‌షా, కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియాగాంధీ సభలో ఉన్నారు. లోక్‌సభ మధ్యాహ్నం రెండు గంటలకు తిరిగి ప్రారంభమైన వెంటనే వామపక్ష పార్టీల సభ్యులు వెల్‌లోకి దూసుకెళ్లి ధరల పెరుగుదలకు వ్యతిరేకంగా ప్లకార్డులు ప్రదర్శించారు. కాంగ్రెస్ నాయకుడు అధిర్ రంజన్ చౌదరి కొన్ని అంశాలు ప్రస్తావించడానికి ప్రయత్నించారు. ధరల పెరుగుదల, అగ్నిపథ్ పథకం వంటి అనేక అంశాలపై చర్చించాలని ప్రతిపక్షాలు కోరుకుంటున్నాయని, కానీ రాష్ట్రపతి ఎన్నికల కోసం సభను వాయిదా వేశారని చౌదరి అన్నారు. అదేసమయంలో న్యాయశాఖమంత్రి కిరెన్ రిజిజు లేచి కుటుంబ కోర్టులు(సవరణ) బిల్లును ప్రవేశపెట్టారు. ప్రతిపక్ష సభ్యులు ఆందోళన కొనసాగిస్తుండటంతో స్పీకర్ స్థానంలో ఉన్న బీజేపీ సభ్యుడు రాజేంద్ర అగర్వాల్ సభను మంగళవారానికి వాయిదా వేశారు.

అంతకుముందు జపాన్ మాజీ ప్రధాని షింజో అబె, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ మాజీ అధ్యక్షుడు అబుదాబి పాలకుడు షేక్ ఖలీఫా బిన్ జాయేద్ అల్ నయాన్, కెన్యా మూడో అధ్యక్షుడు ఎంవాయి కిబకీలకు లోక్‌సభ, రాజ్యసభ సంతాపం ప్రకటించింది.

వారితో పాటు ఇటీవల మృతిచెందిన మాజీ ఎంపీలు రవీందర్ కుమార్ రాణా, టి.బషీర్, నావల్ కిషోర్ రాయ్, సుఖ్‌రామ్, హుస్సేన్ దల్వాయ్, శివాజీ పట్నాయక్, చక్రధారి సింగ్, హరివంశ్ సహాయ్‌లకు లోక్‌సభ సంతాపం తెలిపింది. రాజ్యసభలో కిషోర్‌కుమార్ మహంతి, రాబర్ట్ ఖర్షియాంగ్, కేకే వీరప్పన్, శివకుమార్ శర్మలకు వెంకయ్యనాయుడు సంతాపం ప్రకటించారు. పార్లమెంటు వర్షాకాల సమావేశాలు ఆగస్టు 12వ తేదీ వరకు కొనసాగుతాయి.

99.18 శాతం పోలింగ్

(మొదటిపేజీ తరువాయి)

భవనంలో, దేశవ్యాప్తంగా ఉన్న 30 రాష్ట్రాల శాసనసభల కేంద్రాలలో ఎన్నికలు స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా, పారదర్శకంగా, విజయవంతంగా ముగిశాయి. మొత్తం 4,796 మంది ఓటర్లలో 99.18 శాతం మంది రాష్ట్రపతి ఎన్నికల్లో తమ ఓటు హక్కు వినియోగించుకోగా, 10 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతమైన పుదుచ్చేరిలో 100 శాతం పోలింగ్ నమోదయినట్లు కేంద్ర ఎన్నికల సంఘం వెల్లడించింది. ఢిల్లీ, పుదుచ్చేరి సహా దేశవ్యాప్తంగా రాష్ట్ర అసెంబ్లీల్లోని 30 కేంద్రాలు, పార్లమెంట్ భవనంలో ఈ ఎన్నికలు జరిగాయని తెలిపింది. 'అందుకున్న నివేదికల ప్రకారం, మొత్తం 771 మంది పార్లమెంటు సభ్యులలో ఓటు హక్కు (5 ఖాళీలు), అదేవిధంగా మొత్తం 4,025 మంది శాసనసభ సభ్యులలో (ఆరు ఖాళీ, ఇద్దరు అనర్హులు) ఓటు హక్కు కలిగి ఉన్నారు. 99.18 శాతం ప్రజాప్రతినిధులు ఈ రోజు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు' అని ఒక ప్రకటన పేర్కొంది. ఛత్తీస్‌గఢ్, గోవా, గుజరాత్, హిమాచల్ ప్రదేశ్, కేరళ, కర్ణాటక, మధ్యప్రదేశ్, మణిపూర్, సిక్కిం, తమిళనాడు, పుదుచ్చేరిలలో 100 శాతం ఎమ్మెల్యేలు ఓటింగ్ చేశారని వివరించింది. రాష్ట్ర ప్రధాన కేంద్రాల్లో 44 మంది ఎంపీలు, పార్లమెంట్ భవనంలో తొమ్మిది మంది ఎమ్మెల్యేలు, ఇతర రాష్ట్రాల ప్రధాన కేంద్రాల్లో ఇద్దరు ఎమ్మెల్యేలు ఓటు వేసేందుకు అనుమతించారు. బ్యాలెట్ బాక్సులు అన్ని రాష్ట్రాల నుంచి సోమవారమే వాయు, రోడ్డు మార్గాల్లో చేరుకుంటాయని ప్రధాన ఎన్నికల అధికారి పేర్కొన్నారు. కాగా పార్లమెంట్‌లో ఓటు వేసేందుకు ఎన్నికల సంఘం 736 మందికి (727 మంది ఎంపీలు, 9 మంది ఎమ్మెల్యేలు)కు అనుమతి ఇవ్వగా, 730 మంది (721 మంది ఎంపీలు, 9 మంది ఎమ్మెల్యేలు) ఓటు వేశారని వెల్లడించారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ ప్రక్రియ కొనసాగింది. తొలుత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, అనేక మంది కేంద్ర మంత్రులు, కాంగ్రెస్ అగ్ర నేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, పార్లమెంట్ భవనంలోని హాలు నంబర్ 63లో ఏర్పాటు చేసిన ఆరు పోలింగ్ కేంద్రాల్లో ఓటు హక్కు వినియోగించుకున్నారు. మాజీ ప్రధాన మంత్రి మన్మోహన్ సింగ్ వీల్‌చైర్‌లో వచ్చిన తన సంరక్షకుల సాయంతో నిలబడి ఓటు వేశారు. అనేక రాష్ట్రాల్లో ముఖ్యమంత్రులు తొలి ఓటు వేశారు. ఉత్తర ప్రదేశ్‌లో యోగి ఆదిత్యనాథ్ తొలి ఓటు వేయగా, గుజరాత్, మధ్య ప్రదేశ్, తమిళనాడు, ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రులతోపాటు తెలంగాణలో మంత్రి కేటీఆర్ తొలి ఓటు వేశారు. అయితే ఈ ఎన్నికల్లో ఏ ఒక్క పార్టీ కూడా విప్ జారీ చేసే అవకాశం లేకపోవడంతో తమకు ఇష్టం వచ్చిన అభ్యర్థికి కొందరు ఓటు వేశారు. అయితే చాలా చోట్ల క్రాస్ ఓటింగ్ జరిగినట్లు వార్తలు వచ్చాయి. బ్యాలెట్ బాక్సులన్నీ పార్లమెంట్ భవనంలోని స్ట్రాంగ్ రూమ్‌కు తరలిస్తారు. కొందరు ఎంపీలు బయటి రాష్ట్రాల్లో ఓటు వేయడం, కొందరు ఎమ్మెల్యేలు పార్లమెంట్ ఆవరణలో ఓటు వేయడంతో రాష్ట్రాల వారీగా బ్యాలెట్లను వేరు చేసి లెక్కింపు చేపట్టనున్నారు. ఈ నెల 21న ఉదయం 10.30 గంటల తర్వాత ఓట్ల లెక్కింపు మొదలుకానుంది. అంతకుముందు, ప్రతిపక్ష పార్టీల ఉమ్మడి అభ్యర్థి యశ్వంత్ సిన్హా ఎంపీలు, శాసనసభ్యులు తనకు మద్దతు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. 'ఈ ఎన్నికలు చాలా ముఖ్యమైనవని నేను పదేపదే చెబుతున్నాను. ఎందుకంటే భారతదేశంలో ప్రజాస్వామ్యం కొనసాగుతుందా లేదా నెమ్మదిగా ముగుస్తుందా అనే దిశను ఇది నిర్ణయిస్తుంది' అని సిన్హా విలేకరులతో అన్నారు. 'పార్టీ విప్ లేదు. ఇది రహస్య బ్యాలెట్. ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు ఎంపీలు, ఎమ్మెల్యేలందరూ తమ విచక్షణాధికారాన్ని ఉపయోగించాలని, నన్ను ఎన్నుకోవాలని నేను విజ్ఞప్తి చేస్తున్నాను' అని ఆయన తెలిపారు. కాగా జీ20 ఆర్థిక మంత్రుల సమావేశంలో పాల్గొన్న ఇండోనేషియాలోని బాలి నుంచి తిరిగి వచ్చిన తర్వాత ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ కోవిడ్-19 ఇన్ఫెక్షన్‌తో బాధపడుతున్నారు. ఆదివారం బాలి నుంచి తిరిగి వచ్చిన సీతారామన్ పూర్తి పీపీఈ కిట్ ధరించి రాష్ట్రపతి ఎన్నికల్లో సోమవారం ఓటు వేశారు.

అనేక రాష్ట్రాల్లో క్రాస్ ఓటింగ్

రాష్ట్రపతి ఎన్నికల్లో క్రాస్ ఓటింగ్ జరిగింది. అనేక రాష్ట్రాల్లో విపక్షాలకు చెందిన ఎమ్మెల్యేలు ఎన్‌డీఏ రాష్ట్రపతి అభ్యర్థి ద్రౌపది ముర్ముకు ఓటేశారు. ఒడిశాలోని కటక్ కాంగ్రెస్ ఎమ్మెల్యే మహ్మద్ ముకీమ్ ముర్ముకు ఓటేసినట్లు వెల్లడించారు. మరోవైపు ఉత్తరప్రదేశ్‌లోనూ క్రాస్ ఓటింగ్ జరిగింది. సమాజ్‌వాదీ ఎమ్మెల్యేల్లో కొందరు ముర్ముకు ఓటేశారు. సమాజ్‌వాదీ పార్టీతో పొత్తున్న సుహేల్‌దేవ్ భారతీయ సమాజ్ పార్టీ అధినేత ఓంప్రకాశ్ రాజ్‌భర్ కూడా తన ఎమ్మెల్యేలతో కలిసి ముర్ముకు ఓటేశారు.

ఇంకా వరద గుప్పిట్లోనే...

(మొదటిపేజీ తరువాయి)

ఇంకా జలదిగ్బంధంలోనే ఉన్నాయి. పి.గన్నవరం మండలంలోని రాజోలు, మామిడికుదురు, సఖినేటిపల్లి లంకల్లో ఇళ్లపైనే బాధితులు తలదాచుకుంటున్నారు. ముమ్మిడివరం, తాళ్లరేవు, కాట్రేనికోన మండలంలోని లంక గ్రామాల ప్రజలు కనీస అవసరాల కోసం అనేక కష్టాలు పడుతున్నారు. పొట్టిలంక, అయినవిల్లి లంక, కేదార్లంక, నారాయణలంకల్లో నీట మునిగిన పంటల్ని చూసి రైతుల కన్నీరు పెట్టుకున్నారు. ప్రభుత్వ పరంగా తమకు ఎలాంటి సహాయం అందలేదని కోనసీమ జిల్లా లంకల గన్నవరం వరద బాధితులు జాయింట్ కలెక్టర్ ధ్యానచంద్రకు మొరపెట్టుకున్నారు. అందరికి నిత్యావసరాలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని జాయింట్ కలెక్టర్ తెలిపారు. బడుగు వాణి లంకలో బాధితులకు ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి ఆహార పొట్లాలు అందించారు. సున్నవారిబాడవ, తాటిపాక మఠంలోని వరద బాధితులను మాజీమంత్రి గొల్లపల్లి సూర్యారావు, టీడీపీ శ్రేణులతో కలిసి పరామర్శించారు. గోదారి ఉధృతికి అతలాకుతలమైన వేలేరుపాడు ఇంకా వరద ముంపులోనే మగ్గుతోంది. అధికారులు గ్రామంలోని వారందరినీ సురక్షిత ప్రాంతానికి చేర్చారు. వరద ముంపులో చిక్కుకున్న లంకవాసుల్ని మత్స్యకారులు పడవల్లో క్షేమంగా తరలిస్తున్నారు. అయితే ప్రాణాల్ని పణంగా పెట్టి ప్రజల్ని కాపాడుతున్న తమకు రెండేళ్ల కిందటి డబ్బులే ఇంకా చెల్లించలేదని వాపోతున్నారు. మంత్రులు గుడివాడ అమర్‌నాథ్, వేణుగోపాల కృష్ణ, అల్లూరి జిల్లాలో వరద బాధిత ప్రాంతాల్లో ఏరియల్ సర్వే నిర్వహించారు. బాధితులకు సహాయచర్యలు అందించాలని అధికారుల్ని ఆదేశించారు. ప్రభుత్వం సహాయంగా వరద బాధిత కుటుంబాలకు రూ.2వేల చొప్పున అందిస్తున్నట్లు మంత్రులు, ఎమ్మెల్యేలు ప్రకటనలు చేస్తుండగా అది చాలా మందికి అందడంలేదన్న విమర్శలొస్తున్నాయి. లంక గ్రామాల్లో పశువుల దాణా సైతం నీట మునిగిపోయింది. గడ్డివాములు గోదావరిలో కొట్టుకుపోవడంతో పశువులకు మేత అందని పరిస్థితి నెలకొంది. లక్షలాది ఎకరాల్లో అరటి, పసుపు, కంద పొగాకు, కూరగాయలు తదితర పంటలు, పూలతోటలు సర్వనాశనం కావడంతో లంక గ్రామాల రైతులు లబోదిబోమంటూ ప్రభుత్వ సహాయం కోసం ఎదురుచూస్తున్నారు. మరోవైపు వరద ముంపు గ్రామాలను అంటు వ్యాధుల భయం వెంటాడుతోంది. గోదావరిలో చనిపోయిన అనేక క్రిమి కీటకాలు, కుళ్లిపోయిన జంతువుల కళేబరాలు గ్రామాల్లోకి రావడంతో దుర్వాసన నెలకొంది. వరద తగ్గిన వెంటనే ప్రభుత్వం పెద్ద ఎత్తున పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టకపోతే అంటూ రోగాలతో తీరని నష్టం జరుగుతుందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వర్షాలకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా రోడ్లు మొత్తం పూర్తిగా గోతుల మయం కావడంతో ప్రయాణికులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వం మొక్కుబడిగా కాకుండా చిత్తశుద్ధితో లంక గ్రామాల ప్రజలను, నష్టపోయిన రైతులను వ్యాపారులను ఆదుకోవాలని, పాడైపోయిన రోడ్లకు తక్షణం మరమ్మతులు చేయాలని కోరుకుంటున్నారు.

ధవళేశ్వరం వద్ద నిలకడగా గోదావరి

ధవళేశ్వరం వద్ద గోదావరి వరద ప్రవాహం నిలకడగా కొనసాగుతోంది. బ్యారేజీ వద్ద ఇన్‌ఫ్లో, ఔట్‌ఫ్లో 23.3 లక్షల క్యూసెక్కులుగా ఉంది. స్టేట్ కంట్రోల్ రూమ్ నుంచి ఎప్పటికప్పుడు వరద ప్రవాహాన్ని ఉన్నతాధికారులు పర్యవేక్షిస్తున్నారు. ఆరు జిల్లాల్లోని 62 మండలాల్లో 385 గ్రామాలపై వరద ప్రభావం పడినట్లు అధికారులు తెలిపారు. మరో 241 గ్రామల్లోకి వరద నీరు చేరినట్లు వెల్లడించారు. ఇప్పటివరకు 97 వేల 205 మందిని ఖాళీ చేయించి సురక్షిత ప్రాంతాలకు తరలించామన్నారు. 84 వేల 734మందిని 191 పునరావాస కేంద్రాలకు పంపినట్లు తెలిపారు. 256 మెడికల్ క్యాంప్స్ పెట్టినట్లు చెప్పారు.

సహాయ చర్యల్లో మొత్తం 10 ఎన్డీఆర్ఎఫ్, 10 ఎస్డీఆర్ఎఫ్ బృందాలు పాల్గొంటున్నట్లు వివరించారు. పూర్తిగా వరద తగ్గేవరకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. వరద ప్రాంతాల్లో 256 వైద్యశిబిరాలు, 1,25,015 ఆహార ప్యాకెట్లు పంపిణీ చేశారు.

కలిసి కష్టపడదాం

- ప్రతి సచివాలయానికి రూ.20 లక్షలు
- నెల రోజుల్లో 7 సచివాలయాల సందర్శన
- 175 స్థానాల్లో గెలుపే లక్ష్యం
- 'గడపగడపకూ మన ప్రభుత్వం' సదస్సులో సీఎం జగన్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: నేను చేయాల్సిందంతా చేస్తున్నాను... ఎమ్మెల్యేలూ కష్టపడాలి...ప్రతి ఒక్కరికీ మంచి చేయడాన్ని నా ధర్మంగా కర్తవ్యాన్ని నిర్వర్తిస్తున్నానని సీఎం జగన్ అన్నారు. అందరం కలిసికట్టుగా సాగితేనే మంచి ఫలితాలు సాధించగలుగుతామని వైసీపీ ఎమ్మెల్యేలకు దిశానిర్దేశం చేశారు. గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంపై క్యాంపు కార్యాలయంలో సోమవారం సదస్సు నిర్వహించారు. ప్రాంతీయ, నియోజకవర్గ సమన్వయకర్తలు, ఎమ్మెల్యేలు హాజరైన ఈ సదస్సులో సీఎం జగన్ మాట్లాడుతూ... ఎలాంటి వివక్ష, అవినీతికి తావు లేకుండా అన్ని వర్గాలకు సంక్షేమ కార్యక్రమాలను అందరికీ అందిస్తున్నామని, మీటనొక్కి నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకే నిధులను పంపుతున్నామన్నారు. ప్రతినెలా ప్రణాళిక ఇచ్చి.. ఎలాంటి పరిస్థితులు ఉన్నా పథకాలు అమలు చేస్తున్నామని పునరుద్ఘాటించారు. ఆ ఫలితాలను ముందుకు తీసుకెళ్లడమే ఎమ్మెల్యేల బాధ్యతని, ఆ దిశగా ప్రయత్నాలు చేస్తేనే ఫలితాలు సాధిస్తామని సూచించారు. గడపగడపకూ మన ప్రభుత్వంలో నాణ్యత చాలా ముఖ్యమని, జీవితంలో ఏ కార్యక్రమమైనా చిత్తశుద్ధితో చేస్తేనే నిలదొక్కుకుంటామని స్పష్టం చేశారు. పరిపాలనలో చాలా సంస్కరణలు తీసుకు వచ్చామని, ప్రజల జీవనప్రమాణాలు పెంచడానికి చర్యలు తీసుకున్నామని వివరించారు. చాలా పథకాలు, అభివృద్ధి పనులు చేపట్టామని, రాష్ట్రంలో లక్షలాది కుటుంబాలు మనపై ఆధారపడి ఉన్నాయని పేర్కొన్నారు. వారికి న్యాయం జరగాలంటే, మనం అధికారంలోకి తిరిగి రావాలని సూచించారు. అధికారంలోకి మామూలుగా రావడంకాదు, మునుపటికన్నా మెరుగైన ఫలితాలతో రావాలని ఆదేశించారు. కుప్పంలో పంచాయతీ, మున్సిపల్ ఎన్నికల్లో అద్భుత ఫలితాలు సాధించామని, అలాంటప్పుడు మనం అనుకున్న ఫలితాలు ఎందుకు సాధించలేమని ప్రశ్నించారు. 87 శాతం కుటుంబాలకు పథకాలు అందించామని, వారి మద్దతు తీసుకుంటే 175 కి 175 స్థానాలో ఎందుకు గెలవలేవమని పేర్కొన్నారు. ఒక్కో సచివాలయానికి రూ.20 లక్షలు కేటాయిస్తున్నామని, గడపగడపకూ వెళ్లినప్పుడు ప్రజలనుంచి వినతుల పరిష్కారం కోసం ఈ డబ్బు ఖర్చు చేస్తున్నామని పేర్కొన్నారు. ఒక నెలలో ఎమ్మెల్యేలు తిరిగే సచివాలయాల్లో పనులకు సంబంధించి ముందుగానే కలెక్టర్లకు డబ్బు ఇవ్వనున్నామని, తర్వాత వెంటనే పనులు ప్రారంభమయ్యేలా కార్యాచరణ చేపడతామని వెల్లడించారు. ఎమ్మెల్యేలకు రూ.2 కోట్లు చొప్పున కేటాయిస్తూ గతంలో ఇచ్చిన ఆదేశాల మేరకు ఇవాళ ఉత్తర్వులు ఇచ్చామన్నారు. ముఖ్యమంత్రి అభివృద్ధి నిధి (సీఎండీఎఫ్) నుంచి నియోజకవర్గ అభివృద్ధి నిధుల కింద ఎమ్మెల్యేలకు కేటాయింపులు చేపట్టామని చెప్పారు. సచివాలయాల నిధులకు ఇది అదనమని చెప్పారు. చేయాల్సిందల్లా గడపగడపకూ ప్రభుత్వం కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించడమేనని చెప్పారు. ప్రతి ఎమ్మెల్యే వారంలో ఏడు సచివాలయాలను సందర్శించాలని, వచ్చే నెల రోజుల్లో కనీసంగా 16 రోజులు, గరిష్టంగా 21రోజులు గడపగడపకూ కార్యక్రమంలో పాల్గొనాలని ఆదేశించారు. గడప, గడపకూ కార్యక్రమాన్ని సమీక్ష కోసం 175 నియోజకవర్గాలకు పరిశీలకులను నియమించాలని సీఎం ఆదేశించారు.

ఎన్‌డీఏ అభ్యర్థి ధన్కర్ నామినేషన్

న్యూఢిల్లీ: ఎన్‌డీఏ ఉపరాష్ట్రపతి అభ్యర్థి జగ్‌దీప్ ధన్కర్ సోమవారం నామినేషన్ దాఖలు చేశారు. ఆయన వెంట ప్రధాని నరేంద్రమోదీ, బీజేపీ సీనియర్ నాయకులు, ఆయనకు మద్దతిస్తున్న మిత్రపక్షాల నేతలు ఉన్నారు. నామినేషన్ అనంతరం ధన్కర్ విలేకరులతో మాట్లాడుతూ ఓ సాధారణ రైతు కుటుంబంలో జన్మించిన తనకు ఇంతటి చారిత్రక అవకాశం లభిస్తుందని కలలో కూడా అనుకోలేదని భావోద్వేగంతో చెప్పారు. ప్రజాస్వామిక విలువలు పెంచడానికి తాను ప్రయత్నిస్తానని తెలిపారు. ధన్కర్ వెంట మోదీతోపాటు కేంద్రమంత్రులు అమిత్‌షా, రాజ్‌నాథ్‌సింగ్, నితిన్ గడ్కరీ, బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డా, జేడీయూ అధ్యక్షుడు లలన్‌సింగ్, బీజేడీ నేత పినాకి మిశ్రా ఇతర ఎంపీలు ఉన్నారు. నామినేషన్‌కు ముందు ధన్కర్ తనకు మద్దతిస్తున్న పార్టీల ఎంపీలతో సమావేశమయ్యారు. ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో విపక్షాల అభ్యర్థిగా మార్గరెట్ ఆల్వా పోటీ చేస్తున్న విషయం విదితమే. ఈ అవకాశం కల్పించినందుకు తనకు మాటలు రావడం లేదని ధన్కర్ అన్నారు. రాజ్యాంగ నిర్మాతలకు, భారతదేశ గొప్ప ప్రజాస్వామిక విలువలకు, పౌర సమాజం పటిష్టతకు సెల్యూట్ చేస్తున్నానన్నారు. రైతు కుటుంబం నుంచి వచ్చిన తనను ఉపరాష్ట్రపతి పదవికి ఎంపిక చేసినందుకు ప్రధాని మోదీ, ఇతర నేతలకు ధన్యవాదాలు తెలిపారు.

ఘోర రోడ్డు ప్రమాదం

ఐదుగురి దుర్మరణం

విశాలాంధ్ర-కామారెడ్డి : కామారెడ్డి జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. లారీ-ఆటో ఢీకొట్టుకున్న ఘటనలో ఐదుగురు వ్యక్తులు అక్కడికక్కడే దుర్మరణం చెందారు. ఈ ఘటన 161వ జాతీయ రహదారి మద్నూరు మండలం మెనూరు వద్ద సోమవారం చోటు చేసుకున్నది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం కంటైనర్ లారీ హైదరాబాద్ నుంచి గుజరాత్ వెళ్తోంది. ఆటో మద్నూర్ నుంచి బిచ్కుంద వైపు రాంగ్‌రూట్‌లో వస్తోంది. ఈ క్రమంలో అదుపుతప్పిన ఆటో ఎదురుగా వస్తున్న కంటైనర్ లారీ కిందకు దూసుకెళ్లింది. రెండు వాహనాలు వేగంగా ఉండడంతో ఆటో నుజ్జునుజ్జు అయ్యింది. లారీ ముందుభాగంలోకి ఆటో చొచ్చుకువెళ్లింది.

48 గంటల్లో అందరికీ సాయం

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: గోదావరి వరద బాధితులకు వచ్చే 48 గంటల్లో సాయం అందించాలని ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ప్రతి బాధితుడికీ రూ.2వేల రూపాయల ఆర్థిక సహాయంతో పాటు 25 కేజీల బియ్యం, కేజీ కందిపప్పు, కేజీ బంగాళాదుంపలు, కేజీ ఉల్లిపాయలు, కేజీ పామాయిల్ అందాలని స్పష్టం చేశారు. కలెక్టర్లు, సీనియర్ అధికారులు దీన్ని సవాల్‌గా తీసుకోవాలన్నారు. రాష్ట్రంలో వరదలు, సహాయక చర్యలపై ముఖ్యమంత్రి జగన్ వరద ప్రభావిత ఆరు జిల్లాల కలెక్టర్లు, అధికారులతో సోమవారం ఉదయం సమీక్షించారు. సీఎం మాట్లాడుతూ 'వరద నీరు క్రమంగా తగ్గుముఖం పడుతోంది. సహాయ కార్యక్రమాలను ముమ్మరం చేయాలి. ఈ బాధ్యత సీనియర్ అధికారులు, కలెక్టర్ల భుజాలపై ఉంది. గతంలో రెండు జిల్లాలకు ఇద్దరు కలెక్టర్లు, ఇద్దరు జాయింట్ కలెక్టర్లు, ఇద్దరు ఎస్పీలు మాత్రమే ఉండేవారు. ప్రస్తుతం కాకినాడతో కలుపుకుని ఆరుగురు కలెక్టర్లు, ఆరుగురు జేసీలు, ఆరుగురు ఎస్పీలు ఉన్నారు. గ్రామ, వార్డు సచివాలయాల వ్యవస్థ మీకు అందుబాటులో ఉంది. ప్రతీ సచివాలయంలో 10 మంది ఉద్యోగులు ఉన్నారు. ప్రతి 50 ఇళ్లకూ ఒక వలంటీర్ ఉన్నారు. కాబట్టి బాధితులకు నాణ్యమైన సేవలు అందించాలి. సరుకుల పంపిణీని ముమ్మరం చేయాలి' అని దిశానిర్దేశం చేశారు. 'మీకు ఏం కావాలన్నా..ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నాం. నిధుల సమస్య లేనే లేదు. మీరు సానుకూల దృక్పథంతో ముందుకు వెళ్లండి. ఎలాంటి సమస్య ఉన్నా.. పరిష్కరించడానికి ఫోన్‌కాల్ చేస్తే చాలు. వచ్చే 48 గంటల్లో వరద బాధిత కుటుంబాలకు రేషన్, రూ.2వేల రూపాయలు అందించాలి. బాధిత కుటుంబాలతో మానవతా దృక్పథంతో వ్యవహరించాలి' అని ఉద్బోధించారు. ఎక్కడ అవసరం ఉంటే.. అక్కడ శిబిరాలు కొనసాగించాలన్నారు. 10 రోజుల్లో పంట, ఆస్తి నష్టాలపై అంచనాలు పూర్తిచేయాలి. వరదల కారణంగా అంటువ్యాధులు ప్రబలే అవకాశాలు ఉంటాయి. అలాంటివి లేకుండా జాగ్రత్తగా చూసుకోవాలని సూచించారు. పక్కజిల్లాల నుంచి వరద బాధిత ప్రాంతాలకు పారిశుధ్య సిబ్బందిని తరలించాలని ఆదేశించారు.

10రోజుల్లో పంట, ఆస్తి నష్టం అంచనా వేయండి: సీఎం జగన్ ఆదేశం

ఇతర జిల్లాలకు తరలించేటప్పుడు సిబ్బందికి వసతి, భోజన సదుపాయాలు లోటు రాకుండా చూసుకోవాలని, పంచాయతీరాజ్, మున్సిపల్‌శాఖ విభాగాధిపతులు దీనిపై దృష్టిసారించాలన్నారు. గోదావరి కట్టలు బలహీనంగా ఉన్న చోట్ల ప్రత్యేక దృష్టిపెట్టాలన్నారు. పెట్రోలింగ్ నిరంతరం కొనసాగాలన్నారు. గట్లు, కాల్వలకు ఎక్కడ గండ్లుపడ్డా వెంటనే వాటిని పూడ్చివేయాలని, పశు వులకు పశుగ్రాసం, దాణా అందేలా చూడాలన్నారు. పశు సంపదకు సంబంధించిన నష్టాన్ని అంచనా వేయాలన్నారు. వరద బాధిత ప్రాంతాల్లో విద్యుత్ పునరుద్ధరణ, మరమ్మతు పనులకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, ఇవన్నీ యుద్ధప్రాతిపదికన పరిష్కారం కావాలని సీఎం ఆదేశించారు. సమావేశంలో హోం మంత్రి తానేటి వనిత, సీఎస్ సమీర్ శర్మ, డీజీపీ కేవీ రాజేంద్రనాథ్ రెడ్డి, విపత్తు నిర్వహణ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ జి.సాయిప్రసాద్, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

దేవాలయాల నిధుల మళ్లింపు అవాస్తవం

మంత్రి కొట్టు సత్యనారాయణ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: హిందూ దేవాలయాల నిధుల మళ్లింపు జరిగినట్టు ఒక జాతీయ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు చేస్తున్న ఆరోపణలు అవాస్తవమని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. సోమవారం వెలగపూడి సచివాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆ ఆరోపణల్ని త్రోసిపుచ్చారు. ఐదు లక్షల ఆదాయం, పైబడి ఉన్న ప్రతి దేవాలయం తమ ఆదాయం నుంచి సాధారణ మంచి నిధుల(సీజీఎఫ్) కింద తొమ్మిది శాతం మేర నిధులను దేవాదాయ శాఖకు జమచేసేలా చట్ట నిబంధనలున్నాయని చెప్పారు. తమ ప్రభుత్వ హయాంలో 20 లక్షల మేర ఆదాయం ఉన్న దేవాలయాల నుంచి నిర్దేశిత మొత్తం సీజీఎఫ్ కింద దేవాదాయ శాఖకు చెల్లించే ఏర్పాటు చేశామన్నారు. ఈ వాస్తవం తెలుసుకోకుండా, ప్రభుత్వంపై విమర్శలు చేయడం దురదృష్టకరమన్నారు. ఎనిమిది ప్రధాన ఆలయాలు సహా మరో 32 ఆలయాల అభివృద్ధి కోసం సమర్థవంతమైన ప్రణాళిక తయారు చేయిస్తున్నట్లు ఆయన తెలిపారు. సీఎం తమ శాఖ అధికారులతో క్రమం తప్పకుండా సమీక్షలు నిర్వహిస్తున్నారని తెలిపారు.

పునరావాసం కల్పించాలి

- పోలవరం నిర్వాసితులకు ఆర్అండ్ఆర్ ప్యాకేజీ అమలు చేయాలి
- సీఎంకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ లేఖ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఏటా వరదల కారణంగా తీవ్ర ఇబ్బందులెదుర్కొంటున్న పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు పునరావాసం కల్పించి, ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ అమలు చేసేందుకు ప్రభుత్వం తక్షణమే చర్యలు చేపట్టాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ డిమాండ్ చేశారు. ఈ మేరకు సీఎం జగన్‌కు సోమవారం ఆయన లేఖ రాశారు. ఏటా జులై, ఆగస్టు మాసాల్లో గోదావరి నదికి వరదలు పోటెత్తి, పోలవరం పరిసర ప్రాంతాలు ముంపునకు గురవుతున్నాయన్నారు. 100 ఏళ్లలో ఎన్నడూ లేనంత ఈ ఏడాది పోలవరానికి వరద నీరు రావడంతో పోలవరం నిర్వాసితుల పరిస్థితి మరింత దయనీయంగా మారిందని, సుమారు 70 వేల మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారంటే వరద తీవ్రత ఏ మేరకు ఉందో తెలుస్తోందని పేర్కొన్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం కారణంగా దిగువ ప్రాంతాలన్నీ పదేపదే ముంపునకు గురవుతున్నాయని తెలిపారు. ఏళ్లు గడుస్తున్నా పోలవరం ప్రాజెక్టు నిర్మాణం పూర్తికాలేదన్నారు. పోలవరం ముంపు ప్రాంత గ్రామాల నిర్వాసితులకు ప్రభుత్వం అందజేయాల్సిన ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ ఇవ్వకుండా, పునరావాసంగా ఇళ్లు నిర్మించి ఇవ్వకపోవడంతో నిర్వాసితులు ఏటా ఇబ్బందులెదుర్కొంటున్నారని వివరించారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి సహకరించి, భూములు, ఇళ్లు ఇచ్చి సర్వస్వం త్యాగం చేసిన నిర్వాసితులకు ప్రభుత్వం చేస్తున్న న్యాయం ఇదేనా?, నిర్వాసితులకు శాశ్వత పరిష్కారం చూపరా? అని ప్రశ్నించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇప్పటికైనా పూర్తి బాధ్యత వహించి నిర్వాసితులకు తగు న్యాయం చేయాల్సిన అవసరమెంతో ఉందన్నారు. పోలవరం ప్రాజెక్టుకు నిధులు సాధించి నిర్వాసితులకు పునరావాస ప్యాకేజీ ఇవ్వడం రాష్ట్ర ప్రభుత్వానికి సాధ్యం కాకపోతే, జాతీయ ప్రాజెక్టు కాబట్టి మొత్తం పోలవరం నిర్మాణ బాధ్యతను కేంద్ర ప్రభుత్వానికే అప్పగించాలన్నారు. జాతీయ ప్రాజెక్టు అంటేనే నిర్మాణ వ్యయంతో పాటు నిర్వాసితుల ప్యాకేజీ, పునరావాసం అంతర్భాగంగా ఉంటాయని పేర్కొన్నారు. కేంద్రం నిధులు సమగ్రంగా కేటాయించకుండా, నిర్వాసితులకు పరిహారం చెల్లించి, పునరావాసం కల్పించకుండా ప్రాజెక్టు పూర్తి చేయడం అసాధ్యమని, కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే చేసిన నమ్మకద్రోహం వల్ల పోలవరం నిర్మాణం మరింత జాప్యమవ్వడంతోపాటు, అంచనాలు కూడా భారీగా పెరుగుతాయని పేర్కొన్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణ పరిపూర్తికి సమగ్ర కేంద్ర నిధులు సాధించేందుకు, నిర్వాసితులకు పునరావాసంతోపాటు మౌలిక సదుపాయాలు కల్పించి, ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ ఇచ్చేందుకు కేంద్ర ప్రభుత్వంపై రాజకీయాలకు అతీతంగా మనమంతా సమిష్టిగా ఒత్తిడి తీసుకువస్తే తగిన ఫలితముంటుందని సూచించారు. సీఎంగా ఇప్పటికైనా స్పందించి పోలవరం నిర్వాసితుల సమస్యను పరిష్కరించేందుకు చొరవ చూపాలని ఆ లేఖలో రామకృష్ణ డిమాండ్ చేశారు.

గోదావరి వరదలపై అప్రమత్తం

సకాలంలో బాధితులకు సహాయ, పునరావాసం: మంత్రి అంబటి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: గతంలో ఎన్నడూ లేనంతగా వరద బాధితులకు ప్రభుత్వం సహాయక చర్యలు చేపట్టిందని జలవనరులశాఖ మంత్రి అంబటి రాంబాబు స్పష్టం చేశారు. జలవనరుల శాఖ క్యాంపు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మంత్రి మాట్లాడుతూ, గోదావరి వరదలపై ప్రభుత్వం పూర్తి అప్రమత్తతో ఉండి సహాయ, పునరావాస కార్యక్రమాలు సకాలంలో చేపట్టి ఎలాంటి ప్రాణ నష్టం జరగకుండా చూడగలిగిందన్నారు. సీఎం జగన్ ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులతో సమీక్షలు నిర్వహించి సకాలంలో ప్రజలకు సహాయక చర్యలు అందేలా ఆదేశాలను జారీచేశారన్నారు. బాధితులకు తక్షణ సాయంగా రూ.2వేల ఆర్థిక సహాయం అందిస్తున్నామని చెప్పారు. పోలవరం కాఫర్ డ్యామ్ 28 లక్షల క్యూసెక్కుల నీటి పరిమాణాన్ని మాత్రమే తట్టుకోగలదని, 28, 29లక్షల క్యూసెక్కుల నీరు వస్తే కొట్టుకుని పోయేదని ఆవేదన వ్యక్తం చేశారు. అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

చిన్న పారిశ్రామికవేత్తలకు ఊరట

తక్షణ రుణ సదుపాయంపై యూబీతో ఏపీఐఐసీ ఎంఓయూ

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మార్గనిర్దేశంలో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పారిశ్రామికవేత్తలకు పెద్ద మేలుచేసే దిశగా ఏపీఐఐసీ మరో కీలక ఒప్పందం చేసుకుందని వీసీ, ఎండీ సుబ్రమణ్యం జవ్వాది వెల్లడించారు. ఎమ్ఎస్ఎమ్ఈ పరిశ్రమలకు రుణ సదుపాయంలో ఎదురయ్యే ఇబ్బందులను తొలగించేందుకు యూనియన్ బ్యాంకుతో ఏపీఐఐసీ అవగాహనా ఒప్పందం (ఎంఓయూ) కుదుర్చుకున్నట్లు ఆయన తెలిపారు. ఒప్పంద పత్రాలపై ఏపీఐఐసీ ఎండీ సుబ్రమణ్యం జవ్వాది, యూనియన్ బ్యాంకు/ఎస్ఎల్ బీసీ లీడ్ బ్యాంక్ చీఫ్ జనరల్ మేనేజర్, బ్రహ్మానందరెడ్డి సంతకాలు చేసి ఎంఓయూలని పరస్పరం ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు. ఏపీఐఐసీ మంగళగిరి కార్యాలయంలో సోమవారం జరిగిన ఎంఓయూ సందర్భంగా ఎండీ సుబ్రమణ్యం జవ్వాది మాట్లాడుతూ ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో అగ్రస్థానంలో నిలిచిన రాష్ట్ర ప్రభుత్వం ఈజ్ ఆఫ్ స్టార్టింగ్ బిజినెస్‌పై కూడా ప్రత్యేక శ్రద్ధ వహించినట్లు తెలిపారు. తొలి దశలో ఏపీఐఐసీ గుర్తించిన 39 ఇండస్ట్రియల్ పార్కులలోని ఎమ్ఎస్ఎమ్ఈలకు, వాటిని ప్రారంభించడంలో అవసరమైన రుణ సదుపాయం కల్పించడంలో యూనియన్ బ్యాంకు కీలక భాగస్వామ్యం కానుందని పేర్కొన్నారు. అంతకు ముందు పత్రాల వెరిఫికేషన్, నియమ నిబంధనలు వంటి కారణాలతో రుణాల మంజూరులో జాప్యం జరిగేది. ఇక ఆ ఇబ్బందులు లేకుండా దరఖాస్తు చేసుకున్న 10 రోజులలో రుణం పొందేలా ఒప్పందం చేసుకున్నట్లు చెప్పారు. అందుకు సంబంధించి జిల్లాకు ఒకరు చొప్పున 26 జిల్లాలలో యూనియన్ బ్యాంకు నుంచి 26 మంది నోడల్ ఆఫీసర్లని, ఏపీఐఐసీ నుంచి కూడా కొంతమంది అధికారులతో టీమ్‌ని ఏర్పాటు చేయనున్నట్లు ఎండీ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం, ఏపీఐఐసీతో అవగాహనా ఒప్పందం కుదుర్చుకోవడం మాకు గొప్ప అవకాశమని ఆ బ్యాంకు సీజీఎం బ్రహ్మానందరెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఐఐసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు సుదర్శన్ బాబు, రాజేంద్రప్రసాద్, ఓఎస్డీ ల్యాండ్స్ సాధన, సీజీఎం సుబ్బారెడ్డి (ఫైనాన్స్), సీజీఎం జ్యోతిబసు (పర్సనల్, అడ్మిన్) తదితరులు పాల్గొన్నారు.

కార్మిక సమస్యలపై

అలుపెరగని ఉద్యమం

- భవిష్యత్‌లో మిలిటెంట్ పోరాటాలు
- ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు రవీంద్రనాథ్
- జాతీయ కార్యవర్గ సమావేశాల్లో ప్రసంగం

విశాలాంధ్ర బ్యూరో-ఢిల్లీ/అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో నెలలుగా కార్మిక సమస్యల పరిష్కారం కోసం ఆందోళన నిర్వహిస్తున్న సంఘాలపై పోలీసులు పాశవిక దాడులు, ముందస్తు, హౌస్ అరెస్టులతో భయభ్రాంతులు చేస్తున్న చర్యల్ని ఎదురించి, అలుపెరగని పోరాటాలు నిర్వహిస్తున్నామని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు రావులపల్లి రవీంద్రనాథ్ వెల్లడించారు. ఈనెల 17,18 తేదీలలో న్యూఢిల్లీ ఏఐటీయూసీ రాష్ట్ర కార్యాలయంలో జాతీయసమితి అధ్యక్షులు రామేంద్రకుమార్ అధ్యక్షతన జాతీయ కార్యవర్గ సమావేశాలు ప్రారంభమయ్యాయి. సోమవారం ఏఐటీయూసీ జాతీయ ప్రధాన కార్యదర్శి అమర్‌జిత్ కౌర్ ప్రవేశపెట్టిన నివేదికపై జరిగిన చర్చల్లో ఆంధ్రప్రదేశ్ తరపున రవీంద్రనాథ్ రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాలపై ప్రసంగించారు. జాతీయసమితి పిలుపులో భాగంగా మార్చి 28,29 తేదీల్లో చేపట్టిన సమ్మెలో ఐదు లక్షల మంది పాల్గొన్నారన్నారని వివరించారు. స్కీమ్ వర్కర్లు, వివిధ రంగాల్లో పనిచేస్తున్న అసంఘటిత కార్మిక సంఘాలు పోలీసుల అరాచకాలను ఎదుర్కొని ఉద్యమించామన్నారు. ఈనెల 11నుంచి 14 వరకు నిరవధిక సమ్మె చేసి మున్సిపల్ కార్మిక వేతనాలు 21 వేల రూపాయలకు పెంచుకున్నామన్నారు. వివిధ రంగాలలో నెలలు తరబడి నిలిచిన వేతనాలు ఇప్పించామని వివరించారు. విశాఖ ఉక్కు పరిరక్షణ కోసం నిరంతరం ఉద్యమాలు విశాఖతోపాటు అన్ని జిల్లాల్లో సంఘీభావ ఉద్యమాలు నిర్వహించామన్నారు. విశాఖ ఉక్కు పరిశ్రమలో జరిగిన గుర్తింపు ఎన్నికల్లో ఏఐటీయూసీ ఘన విజయం సాధించిందని సభ్యుల హర్షధ్వానాల మధ్య ప్రకటించారన్నారు. భవిష్యత్‌లో మరిన్ని మిలిటెంట్ పోరాటాలు నిర్వహిస్తామని అన్నారు. కేరళలో జరగనున్న ఏఐటీయూసీ జాతీయ మహాసభల కర్తవ్యాల నిర్వహణలో రాష్ట్ర ఏఐటీయూసీ ముందుందని, 2020 అనుబంధ సంఘాల గుర్తింపు పూర్తి చేశామన్నారు. 2021 అనుబంధ సంఘాలపై దృష్టి పెట్టామని, సకాలంలో పూర్తిచేసి కేంద్రానికి పంపుతామని రవీంద్రనాథ్ హామీ ఇచ్చారు. భవననిర్మాణ రంగ సంఘం జాతీయ మహాసభలు రాష్ట్రంలో నిర్వహించాలని కేంద్ర కమిటీ చేసిన ప్రతిపాదనను ఏఐటీయూసీ ఏపీ రాష్ట్ర సమితి అంగీకరించిందన్నారు. జాతీయ సమితి ప్రధాన కార్యదర్శి అమర్‌జిత్ కౌర్ పెట్టిన రాజకీయ నివేదికను జాతీయ మహాసభల ప్రణాళిక, వివిధ రకాల ప్రతిపాదలను చర్చల అనంతరం కార్యవర్గం ఏకగ్రీవంగా ఆమోదించింది. ఈ సమావేశాల్లో ఆంధ్రప్రదేశ్ నుంచి జాతీయ సమితి ఉపాధ్యక్షులు డీ.ఆదినారాయణ, రాష్ట్ర ఏఐటీయూసీ వర్కింగ్ ప్రెసిడెంట్ చలసాని వెంకట రామారావు పాల్గొన్నారు.

దేశమంతా ఒకే కమీషన్ విధానం ఉండాలి

- ఏపీ రేషన్ డీలర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మండాది
- 26 జిల్లాల సంఘ ప్రతినిధులతో మహాధర్నా

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్): 'వన్ నేషన్ వన్ రేషన్ కార్డు' స్లోగన్‌తో దేశం అంతా ఒకే విధానం అని ప్రచారం చేసుకుంటున్న కేంద్ర ప్రభుత్వం, రాష్ట్రానికోరకంగా ఉన్న కమీషన్ విధానాన్ని రద్దుచేసి దేశం అంతా ఒకే కమీషన్ విధానాన్ని తీసుకురావాలని ఏపీ రేషన్ డీలర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మండాది వెంకట్రావు డిమాండ్ చేశారు. జాతీయ ఫెడరేషన్ పిలుపు మేరకు 26 జిల్లాల డీలర్ సంఘ ప్రతినిధులతో సోమవారం గాంధీనగర్ ధర్నాచౌక్ వద్ద మహాధర్నా నిర్వహించారు. ఎన్టీఆర్ జిల్లా రేషన్ డీలర్స్ అసోసియేషన్ అధ్వర్యంలో నిర్వహించిన ఈ ధర్నాలో మండాది మాట్లాడుతూ, డీలర్లతో దశాబ్దాల తరబడి కమీషన్ విధానంపై పనిచేయించుకుంటున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు క్షేత్ర స్థాయిలో సమస్యలను పరిష్కరించడంలో మొండి వైఖరి అవలంభించడం దారుణమన్నారు. జాతీయ ఆహార భద్రతా చట్టం అన్ని రాష్ట్రాలలో అమలు జరుగుతుందా లేదా అని చూడాల్సిన కేంద్రం ఆ పని చేయక పోవడంతో ఏపీలో రేషన్ పంపిణీ భాధ్యతల నుంచి డీలర్‌లను పక్కన పెట్టి ఎండీయూ ఆపరేటర్లను తీసుకొచ్చారని విమర్శించారు. గోడౌన్‌లో బల్క్ కాటా ఇస్తారని, ఎండీయూ ఆపరేటర్‌కు ఒక్కొక్క బస్తా కాటా ఇవ్వమని నిబంధనలు ఉన్నాయని వాస్తవానికి ఎంఎల్ఎస్ పాయింట్‌లో డీలర్లకు కాటా ఇవ్వరని దీని వల్ల నెలకు రెండు నుంచి మూడు క్వింటాళ్ల బియ్యం నష్టపోతున్నారన్నారు. ఎండీయూ ఆపరేటర్లకు జీతంతో పాటు ఖర్చులు ఇస్తున్న ప్రభుత్వం డీలర్లకు మాత్రం కమీషన్ నుంచే ఖర్చులు భరించాలనే పద్దతి అమలు చేయడం దారుణం అన్నారు. ఆగస్టు 2న ఢిల్లీలో 5.5 లక్షల మంది డీలర్లతో భారీ నిరసన కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు.

రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పద్మనాభం చిట్టిరాజు మాట్లాడుతూ, ప్రభుత్వాలు సంస్కరణల పేరుతో డీలర్ల పొట్టకొడుతున్నాయన్నారు. రాష్ట్ర గౌరవాధ్యక్షులు బుగతా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, చట్ట ప్రకారం డిపోకు వచ్చే సరుకును ఉచితంగా దిగుమతి చేయాలని, కాని ప్రస్తుత ప్రభుత్వం ఆ భారం డీలర్‌పై వేస్తోందన్నారు. ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు, రాష్ట్ర ఉపాధ్యక్షులు ముత్యాల శేషు మాట్లాడుతూ, ప్రధాన మంత్రి గరీబ్ కళ్యాణ్ యోజన బియ్యం ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ వరకు ప్రజలకు ఇవ్వాలని కేంద్రం ఆదేశాలు ఇచ్చినా ఇవ్వడం లేదన్నారు. కార్యనిర్వాహక అధ్యక్షుడు సుంకరి సూర్యారావు, సలహాదారులు టీఏవీవీఎల్ నరసింహమూర్తి, కోశాధికారి సుదర్శన రమేష్, అదనపు ప్రధాన కార్యదర్శి శివప్రసాద్, ఉపాధ్యక్షుడు ప్రవీణ్, విజయవాడ కోశాధికారి పూర్ణ, వర్కింగ్ ప్రసిడెంట్ ఐతా కృష్ణకిషోర్ పాల్గొన్నారు.

పోలవరం కాఫర్ డ్యామ్

మరో మీటరు పెంపు

- రెండు రోజుల్లో రెండున్నర కిలోమీటర్ల పూర్తి
- 30 లక్షల క్యూసెక్కుల నీరు వచ్చినా ఇబ్బంది లేదు: 'మేఘా' సీజీఎం

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: గోదావరికి భారీ వరద పోటెత్తడంతో ఎగువ కాఫర్ డ్యామ్ ఎత్తు ఒక మీటరు మేర రెండు మీటర్ల వెడల్పున పెంచాలని ఏపీ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయగా, కేవలం రెండు రోజుల్లోనే రెండున్నర కిలోమీటర్ల పొడవున్న కాఫర్ డ్యామ్‌ను మీటరు మేర మేఘా ఇంజనీరింగ్ సంస్థ శరవేగంగా పూర్తి చేసి రికార్డు సృష్టించింది. గతంలో ఎగువ కాఫర్ డ్యామ్ 28 లక్షల క్యూసెక్కుల సామర్థ్యాన్ని తట్టుకునేలా నిర్మించారు. దీనికి మించి వరద నీరు వస్తే డ్యామ్ పై నుంచి ప్రవహించే ప్రమాదం ఉంది. దీన్ని దృష్టిలో పెట్టుకొని ఒక మీటరు మేర ఎగువ కాఫర్ డ్యామ్ పొడవునా 2 మీటర్ల వెడల్పుతో ఎత్తు పెంచేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. ఆమేరకు ఒక మీటరు ఎత్తు, 2 మీటర్ల వెడల్పుతో ఎత్తు పెంచే పనులు ఈ నెల 15న ప్రారంభమయ్యాయి. 17 నాటికి పూర్తి చేశారు. కాఫర్ డ్యామ్ ఎగువ భాగం మొత్తం 9 మీటర్ల వెడల్పు ఉంటుంది. ఆ మొత్తం కాకుండా 2 మీటర్ల వెడల్పుతోనే ఎత్తు పెంచారు. నీరు ఎగువ కాఫర్ డ్యామ్ దాటి రాకుండా అడ్డుకునే ప్రయత్నంలో భాగంగానే ఈ పనులు చేపట్టారు. 12 వేల క్యూబిక్ మీటర్ల రాక్ ఫిల్లింగ్ చేసి ఎత్తు పెంచారు. ప్రస్తుతం ఎగువ కాఫర్ డ్యామ్ ఎత్తు 44 మీటర్లకు పెంచామని మేఘా ఇంజనీరింగ్ సంస్థ సీజీఎం ఎం.ముద్దుకృష్ణ తెలిపారు. దీనివల్ల 30లక్షల క్యూసెక్కుల పైచిలుకు వరద వచ్చినా ఇబ్బంది ఉండదని చెప్పారు.

చోడవరం పరిసరాల్లో పులి సంచారం

హడలెత్తిస్తున్న బెంగాల్ టైగర్

విశాలాంధ్ర-చోడవరం: గడిచిన రెండు నెలలుగా ఉత్తరాంధ్ర ప్రజలకు కంటినిండా కునుకులేకుండా చేస్తున్న బెంగాల్ టైగర్ ఇప్పుడు చోడవరం చేరుకుంది. పులిని స్వయంగా చూసినట్లు శేమునాపల్లి గ్రామస్తులు చెబుతుండటంతో పోలీసులు, అధికారులు అప్రమత్తమయ్యారు. ప్రజలు జాగరూకతతో ఉండాలని పోలీసులు సోమవారం గ్రామాల్లో మైకు ప్రచారం చేశారు. శేమునాపల్లి మెయిన్‌రోడ్డు రావాలమ్మ గుడి వద్ద ఉదయం 9.30 సమయంలో పులి నడుచుకుంటూ వెళ్లడాన్ని కళ్లారా చూసినట్లు కె.కోటపాడు మండలం గుల్లిపల్లికి చెందిన కె.రమణ అధికారులకు తెలిపాడు. ఇతడు కూలి పనులు కోసం రాయపురాజుపేట వెళ్తుండగా పులి కంట పడినట్లు చెబుతున్నాడు. గత సోమవారం రాత్రి గంధవరం లో గేదె పెయ్యను చంపిన పులి అక్కడి నుంచి సబ్బవరం, కె.కోటపాడు మండలాల్లో సంచరించి తిరిగి చోడవరంలో ప్రత్యక్షం అయిందంటున్నారు.

రాష్ట్రపతి ఎన్నికలకు ఓటు హక్కు వినియోగించుకున్న

173 మంది ఎమ్మెల్యేలు

- వీరిలో ఒకరు తెలంగాణలో...
- విదేశాల్లో బాలకృష్ణ, బుచ్చయ్య చౌదరి

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: భారత రాష్ట్రపతి ఎన్నికలు రాష్ట్రంలో ప్రశాంత వాతావరణంలో జరిగాయి. వెలగపూడిలోని శాసన సభా భవనంలో సోమవారం ఉదయం 10.00 గంటలకు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి తొలి ఓటుతో ప్రారంభమైన ఎన్నికలు సాయంత్రం 5.00 గంటల వరకూ కొనసాగాయి. శాసన సభా స్పీకర్ తమ్మినేని సీతారాం, మంత్రులు బుగ్గన రాజేంద్రనాథ్, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, కారుమూరి వెంకట నాగేశ్వరరావు, మేరుగు నాగార్జున, తానేటి వనిత, ఆర్.కె.రోజా, కె.వి.ఉష శ్రీ చరణ్ తదితరులు వరుసగా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మిగిలిన మంత్రులు, ఎమ్మెల్యేలు ఓటింగ్ ప్రక్రియలో పాల్గొన్నారు. ప్రతిపక్ష నేత చంద్రబాబు, టీడీపీ ఎమ్మెల్యేలంతా ఒకేసారి విచ్చేసి ఓటు హక్కు వినియోగించుకున్నారు. అధికార, ప్రతిపక్ష పార్టీలకు చెందిన 175 మంది శాసన సభ్యుల్లో 173 మంది తమ ఓటు హక్కు వినియోగించు కున్నారు. వీరిలో 172 మంది ఏపీలోను, ఒకరు తెలంగాణలో ఓటుహక్కును వినియోగించుకున్నారు. టీడీపీ శాసనసభ్యులు నందమూరి బాలకృష్ణ, గోరంట్ల బుచ్చయ్యచౌదరి విదేశాల్లో ఉండడంతో ఓటు హక్కు వినియోగించుకోలేపోయారు.

ఏపీ ఎస్ఆర్ఎం 'ఎంబసీ కనెక్ట్'

విశాలాంధ్ర-విజయవాడ: న్యూఢిల్లీ కేంద్రంగా ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీ 'ఎంబసీ కనెక్ట్' (రాయబారుల సమావేశం) కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించింది. యూనివర్సిటీ ఇంటర్నేషనల్ రిలేషన్స్ అండ్ హయ్యర్ స్టడీస్ అసోసియేట్ డైరెక్టర్ పసుపులేటి నాగశ్వేత అధ్వర్యంలో నిర్వహించిన ఈ సమావేశానికి 14 దేశాలకు చెందిన రాయబారులు, విద్యా, సాంస్కృతిక రంగాల నిపుణులు, విదేశాంగ మంత్రిత్వశాఖ నుంచి వివిధ ప్రాంతాల డెప్యూటీ సెక్రెటరీలు పాల్గొన్నారు. అత్యున్నత ప్రమాణాలతో కూడిన ఉన్నత విద్యకు విస్తృత ప్రచారం కల్పించడం, ఉన్నత విద్యా కార్యక్రమాలను మెరుగుపర్చడమే లక్ష్యంగా ఈ సమావేశం నిర్వహించారు. అంతర్జాతీయ ప్రమాణాలతో బోధన, పరిశోధనలు కొనసాగిస్తున్న ఏపీ ఎస్ఆర్ఎం వర్సిటీ పనితీరును వివిధ దేశాల రాయబారులు, విద్యాసంబంధ నిపుణులు ప్రశంసించారు. విద్యాభివృద్ధికి, విద్యార్థుల ప్రయోజనాలకు సంబంధించిన వివిధ అంశాలపై పరస్పరం చర్చించుకున్నారు. ఈ సమావేశంలో ఫిజీ, భూటాన్, ఉజ్బెకిస్తాన్, యెమన్, ఇండోనేషియా, అఫ్గానిస్తాన్, లిబియా, సొమాలియా తదితర 14 దేశాల రాయబారులు పాల్గొన్నారు.

దేశభక్తిని చాటిన

'మహాసంగ్రామర్ మహానాయక్' నాటక ప్రదర్శన

- కళా పోషణకు భాషతో పనిలేదని నిరూపించిన బెజవాడ వాసులు
- జాతిని జాగృతం చేసేలా గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ రచన

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: భాషను మించి భావం అందించే మధురానుభూతిని విజయవాడ నగర ప్రజలు ఆస్వాదించారు. రాష్ట్ర గవర్నర్ విశ్వ భూషణ్ హరిచందన్ విరచిత మహా సంగ్రామర్ మహా నాయక్ ఒడియా నాటక ప్రదర్శనకు బెజవాడ ప్రజలు బ్రహ్మరథం పట్టారు. కళాపోషణకు భాషతో పనిలేదని నిరూపించారు. రాష్ట్ర పర్యాటక భాషా సాంస్కృతిక శాఖ, విజయవాడ నగర పాలక సంస్థ, అభినయ థియేటర్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో నగరంలోని తుమ్మలపల్లి వారి కళాక్షేత్రంలో ఆదివారం రాత్రి సాగిన ఒడియా నాటక ప్రదర్శన అలనాటి స్వాతంత్ర్య సంగ్రామ ఘట్టాలను మరోసారి ఆవిష్కరించింది. బ్రిటీషర్లు భారతీయులపై సాగించిన దమనకాండకు వ్యతిరేకంగా ఒడిస్సాకు చెందిన స్వాతంత్ర్య సంగ్రామ వీరుడు బక్సీ జగబంధు బిద్యధర్ మోహపాత్ర భ్రమరాబర్ రే సాగించిన పోరాటాన్ని విశ్వభూషణ్ తన రచనా పాటవంతో కళ్లకు కట్టినట్టు చూపించారు. ప్రతి కళాకారుడు తమదైన శైలిలో హావభావాలను పలికిస్తూ ప్రేక్షకులు నాటక వీక్షణలో తన్మయత్వం చెందేలా రక్తి కట్టించారు. ఒడిస్సాకే చెందిన ధీర మాలిక్ దర్శకత్వం వహించగా దాదాపు 35 మంది కళాకారులు భువనేశ్వర్ నుండి వచ్చి ప్రదర్శనలో పాల్గొన్నారు. నాటకం యావత్తు ప్రతి అంకంలోనూ దర్శక ప్రతిభ తొణికిసలాడింది. నాటక ప్రదర్శన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర రెవిన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాద రావు మాట్లాడుతూ నాటకాలతో జాతీయోద్యమ చరిత్రకు జీవం పోయవచ్చాన్నారు. నేటి తరానికి నాటి చరిత్రను తెలియ చెప్పటంలో నాటకాలు సోపానాలుగా నిలుస్తాయన్నారు. జాతిని జాగృతం చేసేలా గవర్నర్ రచించిన మహాసంగ్రామర్ మహానాయక్ నాటి చరిత్రకు నిలువెత్తు నిదర్శనమన్నారు. మంచి నాటకాన్ని విజయవాడ ప్రజలకు పరిచయం చేయటంతో కీలక పాత్రను పోషించిన అభినయ థియేటర్ ట్రస్ట్ నిర్వాహకుడు శ్రీనివాస్‌ను ఈ సందర్భంగా మంత్రి అభినందించారు. కార్యక్రమానికి స్థానిక శాసన సభ్యుడు మల్లాది విష్ణు అధ్యక్షత వహించగా, గవర్నర్ వారి ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్ పి సిసోడియా, కేంద్ర కార్మిక సంక్షేమ బోర్డు ఛైర్మన్ జయప్రకాష్ నారాయణ, ఆంధ్రప్రదేశ్ నాటక అకాడమీ ఛైర్మన్ హరిత, కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీత విజయ భాస్కర్, రెడ్‌క్రాస్ ఆంధ్రప్రదేశ్ శాఖ ఛైర్మన్ డాక్టర్ శ్రీధర్ రెడ్డి, వైద్య నిపుణులు బూసి నరేంద్ర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంపాదకీయం

ఉచితాలపై అనుచిత సూక్తులు

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మంచి మాటకారి. జనాకర్షణ విద్య బాగా తెలిసిన వ్యక్తి. అసలు సమస్యల గురించి, సంఘ్ పరివార్ చిమ్ముతున్న విద్వేష రాజకీయాల గురించి, మూక దాడులు, హత్యలు, ముస్లిం వ్యతిరేక విషవమనం గురించి అయితే ఆయన పెదవి విప్పరు. కానీ సమస్యల నుంచి ప్రజల దృష్టి మళ్లించడానికి సూక్తి ముక్తావళి వినిపించడంలో మాత్రం దిట్ట. జనానికి ఉచితంగా అదో ఇదో అందజేసి ఓట్లు లాక్కోవాలనుకోవడం చాలా ప్రమాదకరమైన ధోరణి అని ఆయన హెచ్చరిక జారీ చేశారు. శనివారం ఉత్తర ప్రదేశ్‌లోని కథేరీ జిల్లాలో 296 కిలో మీటర్ల పొడవైన నాలుగు వరసల బుందేల్ ఖండ్ ఎక్స్‌ప్రెస్ వే (రహదారి) ని ప్రారంభించిన సందర్భంలో మోదీ ఉచితాల అనుచితాన్ని గురించి ప్రస్తావించారు. ఈ హెచ్చరిక సిద్ధాంత రీత్యా సబబైందే. కానీ ఈ నియమాన్ని ఆయన ఏ మేరకు పాటించారు లేదా పాటిస్తారు అన్నది సమాధానం దొరకని ప్రశ్న. యువత ఇలాంటి ఉచితాలకు లొంగిపోకూడదని కూడా మోదీ ఉచిత సలహా పారేశారు. ఈ ఉచితాల సంస్కృతిని ప్రోత్సహించే వారికి రహదార్లు, విమానాశ్రయాలు, రక్షణ వ్యవస్థలు నిర్మించడం మీద శ్రద్ధ ఉండదని మునుపటి ప్రభుత్వాలకు చురక కూడా అంటించారు. అసలు రాజకీయాలలో ఈ ఉచితాల సంస్కృతికి తావివ్వకూడదని హితవు పలికారు. కేంద్రంలోనూ, రాష్ట్రాలలోనూ బీజేపీ ప్రభుత్వాలే ఉండాలన్నది మోదీ అంతిమ లక్ష్యం. ఆయన ఉద్దేశం కేవలం కాంగ్రెస్ ముక్త్ భారత్ కాదు. ప్రతిపక్షాలు లేని భారత్ కోసమే ఆయన కలగంటున్నారు. కేంద్రంలోనూ, రాష్ట్రాలలోనూ బీజేపీ ప్రభుత్వాలే ఉండడాన్నీ ఆయన డబుల్ ఇంజిన్ సర్కార్ అంటుంటారు. పనిలో పనిగా ఉత్తరప్రదేశ్‌లో యోగీ ఆదిత్యనాథ్ ప్రభుత్వం చేపడ్తున్న అభివృద్ధి పథకాలను, శాంతి భద్రతల పరిరక్షణకు పాటుబడ్తున్న తీరును వేనోళ్ల పొగిడారు. ఉత్తర ప్రదేశ్‌లో శాంతి భద్రతల పరిరక్షణ, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని భావిస్తున్న వారికి వ్యతిరేకంగా యోగీ సర్కారు బుల్డోజర్ రాజ్యాన్ని నడుపుతున్న తీరు, తద్వారా మౌలిక మానవ హక్కులకు కలుగు తున్న విఘాతం మాత్రం ప్రధానమంత్రికి కనిపించదు. గత ఎనిమిదేళ్లుగా కేంద్ర ప్రభుత్వంతో పాటు బీజేపీ అధికారంలో ఉన్న చోట చిన్న చిన్న ఊళ్లకు కూడా రహదార్ల సదుపాయం ఎలా కల్పిస్తున్నామో మోదీ పూసగుచ్చినట్టు వివరించారు. ఈ రహదార్లవల్ల ఆ చిన్న గ్రామాలకు ఒరిగేదేమిటో జనం అనుభవంలోకి రాదు. ఆ రహదార్ల మీద సామాన్యుడు వినియోగించే చిన్న వాహనాలకు ప్రవేశం శూన్యం, పైగా అడుగడుగునా టోల్ గేట్ పేర బోలెడు రుసుము చెల్లించవలసి వస్తుందన్న వాస్తవాన్ని కూడా మోదీ వాటంగా దాచేస్తారు. యువత కలలను సాకారం చేయడమే తమ ప్రభుత్వాల లక్ష్యమని ఆయన చెప్పారు. పేదలకు ఇళ్లు, మరుగుదొడ్లు, ఆధునిక సదుపాయాలు మొదలైనవి కల్పించడం ద్వారా సామాజిక న్యాయం జరుగుతోందని నమ్మబలకడానికి ప్రయత్నిస్తారు. ఈ సామాజిక న్యాయం అన్న మాట ప్రభుత్వం చేపడ్తున్న సంక్షేమ పథకాల ప్రయోజనం ముస్లింలకు కూడా దక్కుతోంది కదా అని చెప్పడం ఆయన అసలు ఉద్దేశం. కానీ ఏ ఎన్నికలలోనూ బీజేపీ ఒక్క ముస్లింకైనా టిక్కెట్ ఇవ్వడం మానేసి ఎన్నేళ్లయిందో ఆయన చెప్పరు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వంలో ఒక్క ముస్లిం మంత్రి కూడా లేకపోవడం ఏ రకంగా సామాజిక న్యాయలక్ష్యాలు సాధిస్తుందో ఎవరికీ అంతు పట్టదు.

ఒక్క మోదీ ప్రభుత్వమే కాదు ఇతర పార్టీలు కూడా జనాకర్షక పథకాల చేంతాడంత జాబితాను ప్రతి ఎన్నికల సందర్భంలోనూ వల్లె వేయడం ఎవరికి తెలియని రహస్యం గనక. కానీ జనాకర్షక పథకాలకూ ఓట్లు సంపాదించి పెట్టడంలో ఓ పరిమితి ఉంటుందని, ఆ తరవాత అవి వికటిస్తాయని మోదీతో సహా అన్ని పార్టీలకు తెలుసు. అనేకానేక ఉచితాలు ప్రకటించిన పార్టీలు కూడా ఎన్నికలలో బోల్తా పడిన సందర్భాలు లెక్కలేనన్ని ఉన్నాయి. 2019 బడ్జెట్‌లో మోదీ సర్కారు ప్రకటించిన జనాకర్షక పథకాల జాబితా చాలా పొడవైందే. ప్రభుత్వం ప్రకటిస్తున్న సంక్షేమ పథకాల వల్ల ఎన్.డి.ఎ. 2019 ఎన్నికలలో 400 కన్నా ఎక్కువ సీట్లు సంపాదిస్తుందని అప్పటి కేంద్ర మంత్రులు జయంత్ సిన్హా, రాం విలాస్ పాశ్వాన్ ఆశాభావం వ్యక్తం చేశారు అనడం కన్నా అత్యాశ పడ్డారు అని చెప్పడమే ఉచితంగా ఉంటుంది. ఆ ఎన్నికల్లో కేంద్రంలో బీజేపీ 2014లో కన్నా ఎక్కువ సీట్లు సంపాదించిన మాట వాస్తవమే. కానీ ఈ ఉచితాలు సాధించి పెట్టే విజయాలకూ పరిమితి ఉంటుందని రుజువైందిగా. మొన్నటికి మొన్న ఉత్తర ప్రదేశ్‌లో ఎన్నికలు జరిగినప్పుడు బీజేపీ హయాంలో అందించిన ఉచితాల గురించి బాకాలూదిన మాట నిజం కాదా! కరోనా కష్ట కాలంలో ఇచ్చిన అయిదు కిలోల ఉచిత ధాన్య సరఫరాను ఇప్పటికీ కొనసాగిస్తున్న మాట కళ్లకు కనిపిస్తున్న సత్యమేగా! 2022 కల్లా రైతుల ఆదాయం రెట్టింపు అవుతుందని మోదీ గొప్పగా ప్రకటించిన అంశం ఆచరణలో కుదేలైందిగా! ఇది సాధ్యం కాదని తెలుసుగనకే రైతులకు ఏడాదికి రూ. ఆరు వేలు అందించడం ఉచితాల జాబితాలోకి రాదని మోదీ ఎవరిని నమ్మించాలనుకుంటున్నారు? అనేక రాష్ట్రాలలో ఇలాంటి పథకాలు అమలవుతూనే ఉన్నాయిగా! 2006, 2011లో తమిళనాడు, పుదుచ్చేరి ఎన్నికల సందర్భంగా డి.ఎం.కె. అనేక ఉచితాలు ప్రకటించింది. కానీ 2011లో డి.ఎం.కె.కు పరాజయమే ఎదురైంది. 55 లక్షల మందికి పింఛన్లు, 15 లక్షల మందికి లాప్ టాప్‌లు, రెండున్నర కోట్ల మందికి స్మార్ట్ ఫోన్లు ఇస్తామన్నా అఖిలేశ్ యాదవ్‌కు పరాజయమే ఎదురైంది. ఉచితాల మంత్రం అన్ని వేళలా పారకపోవడానికి నిర్దిష్టమైన కారణాలు ఉన్నాయి. పేదవాడి బతుకు మౌలికంగా మారనంత కాలం అతడి జేబులో నాలుగు రూపాయలు పెట్టినంత మాత్రాన నమ్మేంత అమాయకులు పేదవారిలోనూ ఉండరు. అన్నింటికీ మించి ఎన్నికల సమయంలో రాజకీయ పార్టీలు చేసే వాగ్దానాలకు, అవి ప్రజలకు అందడానికి మధ్య అపారమైన వ్యత్యాసం ఉంటుంది. ఈ విషయాన్ని గ్రహించనంత అమాయకత్వం ఓటర్లకు ఉండదు. ఈ ఉచితాలవల్ల తమ జీవితాల్లో గుణాత్మక మార్పు ఏమీ లేదని జనానికి తెలుస్తూనే ఉంది. ఎన్నికల సమయంలో ఏ పార్టీ డబ్బు పంచినా అవి జేబులో పెట్టుకుని తాము గెలిపించదలచుకున్న వారినే గెలిపించడం అనేక సార్లు ఎదురైన అనుభవమే. ఇప్పటికీ ప్రభుత్వ పంపిణీ విధానం అమలులో అవకతవకలవల్ల ఏటా రూ. 40,000 కోట్లు నష్టం కలుగుతూనే ఉంది. విధానం ఎంత గొప్పదైనా అమలే అసలైన గీటు రాయిగా ఉంటుంది. ప్రభుత్వం ఎంతమందికి ఎన్ని ఉచితాలు ఇచ్చినా కార్పొరేట్ సంస్థలకు దోచిపెడ్తున్న మొత్తం, బడా వ్యాపారులు బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాలను ఎగవేస్తున్న మొత్తం అంతకన్నా అనేక రెట్లు ఎక్కువ. అన్నింటికన్నా మించి ఉచితాలు చేటు తెస్తాయని చెప్తున్న మోదీ సర్కారే ఉచితాల మీద ఆధారపడడం అన్నింటికన్నా ఎక్కువ ప్రమాదం. దీర్ఘకాలికంగా ప్రజల జీవన స్థితిగతులను మార్చడానికి ఈ విధానాలు ఏ రకంగానూ దోహదం చేయవు.

దివ్యాంగులకు ప్రాతినిధ్యమేదీ?

ఐ.ప్రసాదరావు

మన భారతదేశంలో సుమారు 2 కోట్ల 68 లక్షల మంది వివిధ రకాల శారీరక మానసిక వైకల్యాలతో బాధపడుతున్నారు అని నివేదికలు చెబుతున్నాయి. అనగా భారత జనాభాలో 2.1% శాతం జనాభా దివ్యాంగులుగా ఉన్నారు. వీరి పట్ల స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి నేటి వరకూ రాజకీయ నాయకులు, పార్టీలు పలు సంక్షేమ పథకాలు ప్రకటిస్తున్నారు కానీ రాజకీయాలలో పాల్గొనడానికి మాత్రం సీట్లు ఇవ్వడం లేదు. దివ్యాంగులు ప్రజాప్రతినిధులుగా ఎన్నికల్లో పోటీ చేసేందుకు అవకాశం ఇవ్వడం లేదు అనేది వాస్తవం. స్థానిక సంస్థల ఎన్నికల నుంచి రాష్ట్ర శాసనసభకు, కేంద్ర పార్లమెంట్ స్థాయి వరకూ ఇదే ధోరణి కనపడుతోంది. ఇప్పటి వరకూ ఉన్న దివ్యాంగులకు సంబంధించిన 2006, 2016 చట్టాలను మార్పు చేయదలచి, ముసాయిదాను సిద్ధం చేస్తున్నారు. పూర్వపు చట్టాల్లో కేవలం 7 వైకల్యాలు మాత్రమే పరిగణనలోకి తీసుకున్నారు. ప్రస్తుతం 21 రకాల వైకల్యాలు గుర్తించారు. దీనికి అనుగుణంగా కొత్త చట్టం తయారు చేసి, 2030 నాటికి ఐక్యరాజ్యసమితి నిర్దేశించిన సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు (యస్.డి.జి) సాధించాలి. ముఖ్యంగా మన ఆసియా, పసిఫిక్ దేశాల్లో ఉన్న దివ్యాంగుల అభివృద్ధికి 10 లక్ష్యాలు నిర్ధారించారు. వీటిని సాధించాలి, సాధికారత సాకారం కావాలి. విద్యతోపాటు ఉపాధి, నైపుణ్యాలు, సామాజిక రక్షణ, రాజకీయ ప్రాధాన్యత, భాగస్వామ్యం వంటివి వీరికి కలిగించాలి.

ముఖ్యంగా వైకల్యతను వ్యక్తిగతంగా చూడటం మానాలి. సమాజ అభివృద్ధికి వైకల్యత అడ్డు కాదు అనే దృక్పథం పెంచాలి. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత మొట్టమొదటిసారిగా అంధ పార్లమెంటేరియన్‌గా ఎన్నికైన "సాధన్ గుప్తా" అనేక అంశాలు ప్రస్తావన చేసారు. ఆర్టికల్ 29 కన్వెన్షన్ ఆన్ రైట్స్ ఆఫ్ పర్సన్స్ విత్ డిజబిలిటీస్" ప్రకారం సమాజంలో ఇతరులు వలే వీరికి రాజకీయ భాగస్వామ్యం (ప్రజాప్రతినిధులుగా అయ్యే) అవకాశం ఉంది. ఆర్టికల్ 11 ప్రకారం పోలింగ్ కేంద్రాల వద్ద వీరికి అన్ని సౌకర్యాలూ కల్పించాలి. వీల్ చైర్, బ్రెయిలీ లిపి, ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు తదితర సదుపాయాలు పెంపొందించాలి. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలు పూర్తి అవుతున్నా, అనేక పర్యాయాలు ఎన్నికలు జరిగినా దివ్యాంగులకు అందవలసిన సౌకర్యాలు అన్ని చోట్లా అందటం లేదు. కేంద్ర, రాష్ట్ర ఎన్నికల సంఘం వారు కూడా సరైన సమాచారం సౌకర్యాలు సమకూర్చుకోవాలి. కొన్ని సందర్భాల్లో వీరికి సంబంధించిన డేటా కూడా పూర్తిగా లేకపోవడం గమనార్హం.

దివ్యాంగులకు రాజకీయ ప్రాతినిధ్యం పెంచే నిర్ణయాలు తీసుకోవడంలో "ఛత్తీస్‌ఘఢ్" రాష్ట్రం దేశంలో ఆదర్శంగా ఉంది. పంచాయతీ వార్డు సభ్యుడిగా దివ్యాంగులలో ఒకరిని ఎన్నుకోవాలి. ఏ కారణం చేతనైనా అలా జరగకపోతే, ఒక దివ్యాంగుడిని నామినేట్ చేయాలి. అవసరమైతే అక్కడ చట్టాలను సవరణ చేయాల్సిందే. ఆ విధంగా దేశంలో వివిధ రాష్ట్రాలు వీరికి రాజకీయ భాగస్వామ్యం, ప్రజాప్రతినిధులుగా అయ్యే అవకాశం కల్పించాలి. ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం రోజున కొన్ని పథకాలు ప్రకటనలు చేయడం, కొన్ని రకాల వస్తువులను బహుకరించడం వలన వీరి అవసరాలు, అభివృద్ధి సంపూర్ణం కాదు అని గ్రహించాలి. ముఖ్యంగా చదువు, వైద్య సదు పాయాలు, ఉపాధి అవకాశాలు, రాజకీయ అవకాశాలు, సామాజిక భద్రత అందించడం, బడ్జెట్లో కేటాయింపులు పెంచడం, సరైన డేటా సేకరణ, భవిష్యత్తు ప్రణాళికలు రూపొందించి వీరి అభివృద్ధికి కృషిని ఈ 75 సంవత్స రాల స్వాతంత్ర్య సంబరాలు ఆజాద్ కా అమృతోత్సవం వేళ చేపట్టాలని కోరుకుందాం.

వ్యాస రచయిత సెల్ 6305682733

ఎర్రజెండా కవి ఏటుకూరి ప్రసాద్

ఆచార్య ఎస్వీ సత్యనారాయణ

'ఎర్రజెండేరో తమ్ముడ
ఎర్రజెండేరో మనదీ
ఎర్రజెండేరో తమ్ముడ
ఎర్రజెండేరా'
'ఎర్రజెండరా - త్యాగాల కందరా'

అభ్యుదయ సాహిత్యోద్యమంలోకి, ప్రజానాట్యమండలి సాంస్కృతికోద్యమంలోకి అప్పుడప్పుడే ప్రవేశిస్తున్న మా తరాన్ని అపారంగా ప్రభావితం చేసిన ఉద్యమ గీతాలలో ఇదొకటి. ఈ పాట రచించిన ఉద్యమ కవి ఏటుకూరి ప్రసాద్. ఎర్రజెండా నీడలో ఎర్రపాటలు పాడుతూ, ఎర్రబాటపై నడుస్తున్న ఉద్యమబాటసారి ఏటుకూరి ప్రసాద్. కేవలం కవి మాత్రమే కాదు- ఆధునిక తెలుగు సాహిత్యంలో నిర్విరామ కృషిని కొనసాగిస్తున్న మౌనకృషీవలుడు డా॥ఏటుకూరి ప్రసాద్. పరిచయమైన ప్రతి వ్యక్తినీ ప్రభావితం చేసే స్నేహశీలి. అనేకమంది యువ పరిశోధకులకు అప్రకటిత మార్గదర్శకుడు. తమ ఇంటి గ్రంథాలయం నుండి విలువైన, అరుదైన గ్రంథాలను పరిశోధకులకు ఇవ్వడమే కాక, తగిన సూచనలు, సలహాలనిస్తూ ఉత్సాహపరిచే సౌజన్యశీలి డా॥ఏటుకూరి ప్రసాద్.

1970 దశకంలో హైదరాబాద్ నగరంలో ఒకవైపు 'యువ భారతి' నెల నెలా కార్యక్రమాలతో యువ సాహితీవేత్తల్ని సంప్రదాయ సాహిత్యం వైపు ఆకర్షిస్తూ వుండేది. మరోవైపు విప్లవ సాహిత్య ఉధృతి యువతరంపై బలమైన ప్రభావం వేస్తూ ఉండేది. అలాంటి పూర్వరంగంలో అభ్యుదయ సాహిత్యోద్యమ వారసత్వాన్ని కొనసాగిస్తూ, ఇటువైపున రచయితల్ని ఆకర్షించి నిలపడం, ముందుకు నడిపించడం కత్తిమీద సాము. ఈ బాధ్యత నిర్వహించిన రథసారథులు రాంభట్ల, తుమ్మల, గజ్జెల మల్లారెడ్డిలు కాగా అందులో ఏటుకూరి ప్రసాద్ పాత్ర విశిష్టమైనది. అభ్యుదయ సాహిత్యోద్యమ విస్తృతికి ఉపయోగపడింది.

జాతీయ స్థాయిలో అభ్యుదయ రచయితల సంఘం ఏర్పడిన 1936వ సంవత్సరం జూలై19న గుంటూరులోని అరండల్‌పేటలో శ్రీమతి వజ్రమ్మ, ఏటుకూరి కోటయ్య దంపతులకు పుట్టిన రెండవ సంతానం ప్రసాదరావు. గుంటూరులోని మాజేటి గురవయ్య హైస్కూల్‌లో ప్రాథమిక విద్య పూర్తయింది. దేశభక్తి కుటుంబంలో పుట్టడం, ఇంట్లో కాంగ్రెస్ రాజకీయ సమావేశాలు జరగడంతో బాల్యం నుండే ప్రసాద్‌కి రాజకీయాల పట్ల అవగాహన ఏర్పడసాగింది. పెదనాన్న ఏటుకూరి సీతారామయ్య ప్రభావం, వారి కుమారులు బలరామమూర్తి, కృష్ణమూర్తిలసాహచర్యం ప్రసాద్‌ని కమ్యూనిస్టు భావాలవైపు ఆకర్షించింది.

1951లో గుంటూరులోని హిందూ కాలేజీలో ఇంటర్ మొదటి సంవత్సరంలో చేరగానే అఖిల భారత విద్యార్థి సమాఖ్య సభ్యులయ్యారు. అదే సంవత్సరం గుంటూరులో జరిగిన శాంతి సంఘం మహాసభలకు శ్రీశ్రీ మొదలైన సాహితీవేత్తలెందరో హాజరయ్యారు. విద్యార్థి సమాఖ్య పక్షాన శ్రీశ్రీకి ప్రసాద్ వలంటీర్‌గా ఉండి, శ్రీశ్రీ పాటలు విని ఉత్తేజితులయ్యారు. తరవాత కాలంలో హిందూ కాలేజీ తెలుగు అసోసియేషన్ కార్యదర్శిగా ప్రసాద్ ఎన్నికయ్యారు.

'గుంటూరు వాణి' పత్రికలో ప్రూఫ్ రీడర్‌గా చేరి, ఆ పత్రికకు కొన్ని వ్యాసాలు రాశారు. వట్టికొండ విశాలాక్షి నడిపిన 'ప్రజావాణి' పత్రిక ఇయర్స్‌కు ప్రసాద్ కవితలు రాశారు. 1955లో ఆయన హిందూ కాలేజీలోనే బి.ఎ. కోర్సులో చేరారు. అప్పటి ఆంగ్ల అధ్యాపకులు అమరేంద్ర (చతుర్వేదుల నరసింహ శాస్త్రి) ప్రతిరోజూ క్లాసు ముగిసేలోపు శ్రీశ్రీ కవితలు వినిపించేవారు. అమరేంద్ర ప్రోద్బలంతోనే ప్రసాద్ 1955లో అభ్యుదయ రచయితల సంఘం సభ్యత్వం స్వీకరించారు. 1957లోనే విశాఖలో తమ సీనియర్లయిన కె.జి.సత్యమూర్తి, సహవిద్యార్థులైన వకుళాభరణం రామకృష్ణ, ఆర్వీయార్‌లతో కలిసి 'ప్రగతి' అనే రాత పత్రికను వెలువరించారు.



1960లో బి.ఎ.ఆనర్స్ పూర్తిచేసిన ప్రసాద్ గుంటూరు ఎ.సి. కళాశాలలో తెలుగు ట్యూటర్‌గా పనిచేస్తూనే ఎ.ఐ.వై.ఎఫ్., ఎ.ఐ.యస్.ఎఫ్. వారి 'యువజన' పత్రిక సంపాదక బాధ్యతలు స్వీకరించి తర్వాత పార్టీ నిర్ణయం మేరకు హైదరాబాద్‌కు మకాం మార్చారు. తాపీ ధర్మారావు వంటి సాహితీ ప్రముఖుల సాహచర్యం లభించింది. పత్రిక బాధ్యతలు నిర్వర్తిస్తూనే 1961వ సంవత్సరంలో హైదరాబాద్ పాత నగరంలోని 'అగర్‌వాల్ శిక్షా సమితి' వారి మల్టీపర్పస్ హైస్కూల్‌లో తెలుగు ఉపాధ్యాయులుగా చేరారు. 1970లో జూనియర్ లెక్చరర్‌గానూ, 1980లో డిగ్రీ అధ్యాపకులుగాను పదోన్నతిని పొందిన ఏటుకూరి ప్రసాద్ 1994 జులై 31న ఎస్.డి.ఎస్.డిగ్రీ & పి.జి. కళాశాలలో రీడర్‌గా పదవీ విరమణ పొందారు.

1970-73 మధ్య కాలంలో అభ్యుదయ రచయితల సంఘం పునర్నిర్మాణ ప్రయత్నాల్లో ప్రసాద్ చురుగ్గా పాల్గొన్నారు. హైదరాబాద్ నగర అభ్యుదయ రచయితల సంఘ నిర్మాణంలోను, రాష్ట్ర 'అరసం' పునర్నిర్మాణంలోను ప్రముఖమైన పాత్రను నిర్వహించిన ఏటుకూరి ప్రసాద్, 1973లో గుంటూరులో జరిగిన ఆం.ప్ర. 'అరసం' రాష్ట్ర మహాసభల్లో కార్యదర్శిగా ఎన్నికయ్యారు. 1979లో కాకినాడలో జరిగిన రాష్ట్ర 'అరసం' మహాసభల్లో ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయి, దాదాపు దశాబ్దకాలానికిపైగా సంస్థ విస్తృతికి విరామమెరుగక కృషి చేశారు.

1982 డిసెంబర్‌లో జయపూర్ (రాజస్థాన్)లోనూ, 1986 ఏప్రిల్‌లో లక్నో (ఉత్తరప్రదేశ్)లోనూ జరిగిన 'అఖిల భారత అభ్యుదయ రచయితల సమాఖ్య' జాతీయ మహాసభల్లో డా॥ ఏటుకూరి ప్రసాద్ సమాఖ్య జాతీయ కార్యదర్శిగా ఎన్నికయ్యారు.

'తాపీ ధర్మారావు జీవితం-రచనలు' అన్న అంశంపై ప్రామాణికమైన పరిశోధన చేసిన ప్రసాద్‌కి 1983లో ఉస్మానియా విశ్వవిద్యాలయం డాక్టరేట్ డిగ్రీని ప్రదానం చేసింది. 1980-92 మధ్య కాలంలో 'అభ్యుదయ' మాస పత్రికకు సంపాదక బాధ్యతలు వహించిన ప్రసాద్ నవల, వాడుక భాష, విమర్శ, కవిత్వంపై విశేష సంచికలు వెలువరించారు.

1983లో శ్రీశ్రీ మరణానంతరం శ్రీశ్రీ స్మారక సంస్థను నెలకొల్పి, అరసం సహకారంతో ప్రసాద్- 'మాచిరాజు దేవీప్రసాద్ పారడీలు', 'సాహిత్యాభ్యుదయం', 'కొంపెల్ల జనార్దనరావు జీవితం-సాహిత్యం', 'శిష్ట్లా ఉమామహేశ్వరరావు కవిత్వం-సమాలోచన', 'తుమ్మల వెంకట్రామయ్య జీవితం-సాహిత్యం', వై. విజయకుమార్ 'సాహిత్యం-వాస్తవికత' మొదలైన అరుదైన గ్రంథాలను వెలువరించారు.

కవిగా, విమర్శకులుగా, పరిశోధకులుగా, ఉత్తమ గ్రంథాలకు సంపాదకులుగా బహుముఖీయమైన కృషిని కొనసాగిస్తున్న ప్రసాద్ 'విశాలాంధ్ర ప్రచురణాలయం' సంపాదకులుగా అనేక అరుదైన, విలువైన గ్రంథాల ముద్రణకు, పునర్ముద్రణకు కృషి చేశారు. రాష్ట్ర విభజనానంతరం ఏర్పడిన నవచేతన ప్రచురణాలయం సంపాదకులుగా ప్రస్తుతం బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

ప్రసాద్ నిర్విరామకృషికి గుర్తింపుగా 'విజయలక్ష్మి స్మారక పురస్కారం', 'తెలుగు విశ్వవిద్యాలయ పురస్కారం', 'అమరజీవి పులుపుల శివయ్య సాహితీ సత్కారం', 'తుమ్మల సాహితీ పురస్కారం', 'తాపీ ధర్మారావు సాహితీ పురస్కారం', 'శ్రీశ్రీ సాహితీ పురస్కారం', 'విశాలాంధ్ర ప్రచురణాలయం వారి సత్కారం' మొదలైన ఎన్నో పురస్కారాలు, సన్మాన సత్కారాలు లభించాయి.

ప్రసాద్ రచించిన 'అరనిజ్వాల', 'శివాలయ్య' నృత్యరూపకాలను ఆం.ప్ర.ప్రజానాట్యమండలివారు అనేక వేదికలపై ప్రదర్శించారు. గత అర్ధ శతాబ్ద కాలంగా అంతర్జాతీయ, జాతీయ, స్థానిక పరిణామాల పట్ల ఎప్పటికప్పుడు స్పందిస్తూ నిరంతరం ఉద్యమ గీతాలను రచిస్తున్న కవి డాక్టర్ ఏటుకూరి ప్రసాద్. వారి 86వ జన్మదినోత్సవం సందర్భంగా నవచేతన, అభ్యుదయ రచయితల సంఘం, ప్రజానాట్యమండలి శుభాకాంక్షలు తెలియజేస్తున్నది.

(నేడు డాక్టర్ ఏటుకూరి 86వ జన్మదినోత్సవం)
వ్యాస రచయిత పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం పూర్వ ఉపకులపతి

వి-మెయిల్

తెలంగాణ రాష్ట్ర గీతమేది?

తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడి ఎనిమిదేళ్ళు గడిచినా తెలంగాణ రాష్ట్ర గీతం ప్రకటించలేదు. త్వరలో భర్తీ చేయనున్న ఉద్యోగ, ఉపాధ్యాయుల పోస్టుల కోసం జరిగే పోటీ పరీక్షలలో రాష్ట్ర గీతం ఏది అని అడిగే అవకాశం ఉన్నా రాష్ట్ర గీతం ప్రకటించకపోవడంలో ఆంతర్యమేమిటో అర్థం కావడం లేదు. సమైక్య ఆంధ్రప్రదేశ్‌కు రాష్ట్ర గీతంగా మా తెలుగు తల్లికి మల్లెపూదండ మా కన్న తల్లికి మంగళారతులు అనే రాష్ట్ర గీతం ఉండేది. ఇప్పటికీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గీతంగా అదే ఉంది. ప్రత్యేక రాష్ట్రంగా తెలంగాణ ఏర్పడిన తర్వాత రాష్ట్ర గీతంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం దేనిని ప్రకటించలేదు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఒకటి నుంచి డిగ్రీ, యూనివర్సిటీ పాఠ్య పుస్తకాలను మార్చివేసి తెలంగాణ కవులకు, రచయితలకు, తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చారు. పాఠ్యపుస్తకాలలో జాతీయ గీతం, ప్రతిజ్ఞ వరుస క్రమంలో ఉంటాయి. కాని 2004 తర్వాత వచ్చిన పాఠ్య పుస్తకాలలో జాతీయ గీతం, ప్రతిజ్ఞ మాత్రమే ఉన్నాయి. రాష్ట్ర గీతం లేదు. డాక్టర్. అందెశ్రీ రాసిన "జయ జయయే తెలంగాణ జననీ జయకేతనం" అనే గీతం తెలంగాణలోని అన్ని ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలల్లో తెలంగాణ రాకముందు నుంచి రాష్ట్ర గీతంగా పాడిస్తున్నారు. తెలంగాణ ప్రత్యేక ఉద్యమంలోనూ సమావేశాల్లో ఇదే గీతాన్ని పాడి కార్యక్రమాన్ని ప్రారంభించేవారు. కొన్ని నెలల క్రితం తెలంగాణ రాష్ట్ర గీతంగా రెండు, మూడు పేర్లు ప్రచారంలోకి వచ్చినా అధికారికంగా దేనినీ ప్రకటించలేదు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర గీతంను త్వరగా ప్రకటించాలని అందరూ కోరుతున్నారు.

డాక్టర్. ఎస్. విజయ భాస్కర్, 9290826988

అవనిలో సగం... సమానత్వంలో శూన్యం

రుద్రరాజు శ్రీనివాసరాజు

ప్రపంచ వ్యాప్తంగా లింగ అసమానతలు ప్రబలంగా ఉన్నాయి. అభివృద్ధి చెందిన దేశాల్లో కూడా ఈ వివక్ష తక్కువేం లేదు. ప్రత్యేకించి మన దేశంలో మరీ విపరీతం. ప్రపంచ ఆర్థిక వేదిక విడుదల చేసిన లింగ సమానత్వ తాజా నివేదికలో 146 దేశాలకు గాను మనదేశ ర్యాంక్ 135. మనకన్నా హీన స్థితిలో ఉన్నది 11 దేశాలే. వేదికలపై, చట్ట సభలలో మాత్రం అతివలు అవనిలో సగం, ఆకాశంలో సగం అని ఆవేశంగా ప్రసంగాలు చేస్తుంటారు. ఆచరణలో అంతా శూన్యమే. 2016 లింగ సమానత్వ సూచీలో భారత్ స్థానం 87 కాగా నేడు 135. మహిళా సాధికారతకు రాజీ లేని కృషి చేస్తున్నామనే నాయక గణం దీనికేం సమాధానం చెబుతారు. లింగ సమానత్వంలో ముందుకెళ్ళకపోగా దారుణంగా పడిపోవడం గమనించాల్సిన విషయం.

మహిళలకు రాజకీయ అవకాశాలు గురించి అసలు మాట్లాడనే అక్కర్లేదు. 2016లో రాజకీయ సాధికారతలో 9వ స్థానంలో నిలిచిన దేశం ఈనాడు 48 వ స్థానానికి దిగజారిపోవడం మన నాయకుల తిరోగమన ఆలోచనలకు నిలువుటద్దం పడుతోంది. లింగ సమానతలో అగ్ర భాగాన ఉన్న దేశాలు దీనిని ఎలా సాధించాయని ఆరా తీస్తే ఆయా దేశాలు మహిళల హక్కులను మానవ హక్కులుగా గుర్తించాయి, ఆచరణలో అమలుచేసి చూపిస్తున్నాయి. భారత రాజ్యాంగంలో కూడా ప్రాథమిక హక్కులు, విధులు, ఆదేశిక సూత్రాలలో సైతం స్త్రీ పురుష సమానత గురించి స్పష్టంగా నిర్వచించారు. అయితే దానిని సిద్ధాంతంగా ప్రవచిస్తున్నాం కానీ అమలు చేయడానికి ఎలాంటి సన్నద్ధత లేదన్నది విశ్వమెరిగిన సత్యం. ఆధునిక ప్రజాస్వామ్య పాలనలో ఉన్నామని చెప్పుకొంటున్న మనదేశంలో లింగ అసమానత్వం గతం కన్నా అధికం కావడం ఎంతైనా విచారించదగ్గ విషయం. స్త్రీలపై అన్నిరకాల వివక్షను అంతమొందించడానికి మేము కట్టుబడి ఉన్నాం అంటూ అంతర్జాతీయ ఒడంబడికలలో అట్టహాసంగా సంతకాలు మాత్రం చేస్తున్నాం. మహిళా సాధికారత కోసం రాజీ లేని పోరు చేస్తామని జాతీయ విధానాన్ని ఘనంగా ప్రకటించాం. వీటిలో ఏదీ అమలు మాత్రం కాదు. అందుకే, మహిళా సాధికారత విభిన్న సూచీలలో ఏటికేడు దిగజారుతూనే ఉన్నాం.

స్థానిక సంస్థల్లో మహిళలకు రిజర్వేషన్లు ప్రకటించడం ద్వారా స్థానిక ప్రభుత్వాలలో గణనీయంగా మహిళల భాగస్వామ్యం పెరిగింది. మరి వాస్తవంగా ఈ అధికారాలను నిర్వహిస్తున్నదెవరు? వారి భర్తలు, కుటుంబ సభ్యులు. మహిళాసాధికారత అంటే ఇదా? మహిళా రిజర్వేషన్ బిల్లుకు మద్దతునిస్తున్న రాజకీయ పక్షాలు ఎన్ని? అడ్డు చెబుతున్నవి ఎన్ని? ఈ రాజకీయమూ దేశ ప్రజలంతా ఏళ్ళకుఏళ్ళుగా చూస్తున్నారు.

బాల్య వివాహాలు తగ్గలేదు. పోషకాహార లోపంతో మరణించే స్త్రీల సంఖ్య అదుపులోకి రాలేదు. అంతకన్నా ముఖ్యంగా రోజురోజుకూ మహిళలపై దాడులు, అత్యాచారాలు నిత్యకృత్యమైపోయాయి. గృహ హింస గురించి చెప్పనవసరమే లేదు. ఆర్థిక భాగస్వామ్యం, అవకాశాల రంగాల్లో మెరుగైన పని తీరులో మనదేశం తాజా నివేదికలో గత ఏడాది కంటే ఐదు స్థానాలు మెరుగుపడినప్పటికీ, లింగ వివక్ష, ఆరోగ్యం విషయంలో అట్టడుగుకి పడిపోయింది. మగువల ఆర్థిక భాగస్వామ్యం విషయంలో గతం కంటే మెరుగుపడ్డాం కానీ ఇతర దేశాలతో పోల్చి చూస్తే ఇంకా అడుగు వరసలోనే ఉన్నాం. మహిళాభ్యున్నతి కోసం నిరంతరం తపిస్తున్నామంటూ ఆరంభించిన అనేక సంక్షేమ పథకాలు, ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికల ఘోర వైఫల్యాలను ఇది ఎత్తి చూపుతోంది. ఆరోగ్య సూచీలోనూ అట్టడుగు స్థానంలో ఉండడం ఆందోళన కలిగించే విషయం. ప్రాథమిక విద్య విషయంలో మాత్రమే లింగ సమానత్వ పరంగా అగ్ర స్థానంలో నిలిచినట్టు ఈ నివేదిక పేర్కొంది. ఇదొక్కటే మనం ఆనందించదగ్గ విషయం.

ఈ పరిశీలనలో ప్రపంచంలో అత్యంత లింగ సమానత్వం కలిగిన దేశంగా ఐస్‌లాండ్ మొదటి స్థానంలో నిలిచింది. తర్వాతి స్థానాల్లో ఫిన్‌లాండ్, నార్వే, న్యూజిలాండ్, స్వీడన్ ఉన్నాయి. స్త్రీ-పురుష సమానత్వంలో ఐస్‌లాండ్ వరసగా అగ్రస్థానాన్ని దక్కించుకుంటూనే ఉంది. ఇక్కడ సమానత్వ స్థాయి 90 శాతంగా ఉన్నది. అన్ని విషయాల్లో వెనుకబడిన దేశాల జాబితాలో ఉండే నమీబియా, రువాండా, లిథువేనియా వంటి దేశాలు ఈ నివేదికలో టాప్-10లో ఉండటం విశేషం. ప్రధానంగా శ్రామిక శక్తిలో పెరుగుతున్న లింగ అంతరంతో ప్రపంచవ్యాప్తంగా జీవన వ్యయ సంక్షోభం మహిళలను తీవ్రంగా దెబ్బతీస్తోందని డబ్ల్యూఈఎఫ్ హెచ్చరించింది. ఈ నివేదిక ప్రకారం రాజకీయ సాధికారత సాధించడానికి, లింగ అంతరాన్ని అధిగమించడానికి 155 ఏళ్ళు పడుతుంది. 29 దేశాలు సమానత్వాన్ని సాధించినప్పటికీ విద్యలో లింగ అంతరాన్ని పూడ్చడానికి ఇంకా 22 సంవత్సరాలు పడుతుందని నివేదిక వెల్లడించింది. లింగ అసమానతలు ఏ స్థాయిలో ఉన్నాయో ఈ గణాంకాలు వెల్లడిస్తున్నాయి.

ప్రపంచం మొత్తాన్ని గడగడ లాడించిన కొవిడ్ లింగ సమానత్వ సాధనకూ తీవ్ర విఘాతం కలిగించింది. తాజాగా రష్యా-ఉక్రెయిన్ యుద్ధం మహిళా హక్కులను హరిస్తోంది. ఇది లింగ సమానత్వాన్ని ఏకంగా ఒక తరం వెనక్కు నెట్టిందని ప్రపంచ ఆర్థిక నివేదిక ఆందోళన వెలిబుచ్చింది. కొవిడ్ తెచ్చిపెట్టిన లాక్‌డౌన్‌లు, డిజిటలీకరణల వల్ల మహిళా సిబ్బంది ఎక్కువగా కలిగిన రంగాల్లో వారి ఉద్యోగాలకు ఎసరు వచ్చింది. మహిళా సమానత్వ సాధనకు కొవిడ్ వల్ల కలిగిన నష్టాల్లో కొన్ని ఇంకా కొనసాగనూవచ్చు. ఈ పరిస్థితిని మార్చడానికి సత్వరం ప్రాధాన్యమివ్వాలని ప్రపంచ ఆర్థిక వేదిక పిలుపు ఇచ్చింది.

ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులలో పూర్తిగా అంతరాన్ని అంతమొందించాలంటే ఇంకా శతాబ్దిన్నర పైగా కాలం పడుతుందని నివేదిక తేల్చింది. అదే దక్షిణాసియాలో లింగ భేదం అంతరాన్ని పూడ్చాలంటే 197 ఏండ్లు పడుతుందని స్పష్టం చేసింది. పరిశీలనకు తీసుకున్న మొత్తం 146 దేశాల్లో ప్రతి ఐదింటిలో ఒక్క దేశం మాత్రమే లింగ భేదాన్ని కనీసం 1 శాతాన్ని తగ్గించిందని వివరించింది. మనదేశంలో లింగ అసమానతలకు రాజకీయ, సాంకేతిక రంగాల నాయకత్వ స్థానాల్లో మహిళా ప్రాతి నిధ్యం చాలా తక్కువ కావడమే ప్రధాన కారణంగా చెప్పవచ్చు. లింగ సమానత్వాన్ని ప్రాథమిక హక్కుగా పరిగణించి. అన్ని రంగాల్లోనూ మహిళలకు ప్రాధాన్యం ఇచ్చినప్పుడే ఈ అంతరం తొలగుతుంది. ఇందుకు అవసరమైన చట్టాలను పాలకులు రూపొందించాలి. వాటిని అమలు చేయాలి. ఇందుకు దృఢమైన రాజకీయ సంకల్పం అవసరం. ప్రబలంగా నాటుకుపోయిన మూఢ సంస్కృతులు, మనుషుల వైఖరిలో కూడా మార్పు రావాలి. చట్టాలు మహిళలను శక్తిమంతంగా మార్చే ఆయుధాలుగా మారినప్పుడే లింగ సమానతను సాధించగలుగుతాం. ఇందుకోసం ధీరలు నడుం కట్టాలి. ఈ అంతరాలు, అసమానతలు ఇంకెన్నాళ్ళు? అని మహిళాలోకం ఒక్కటై గళమెత్తి ప్రశ్నించాలి. తమపై వివక్షను ఎదుర్కొనేందుకు ఒకరికొకరై ఐక్యంగా నిలబడాలి.

వ్యాస రచయిత లెక్చరర్ 9441239578.

‘స్నేహితుల’ ప్రయోజనం కోసమే...

- అందుకే ‘బొగ్గు కలపడం’ తప్పనిసరి నిబంధన
- దిగుమతి కాంట్రాక్టు అదానీకే...
- కేంద్రంపై కాంగ్రెస్ ధ్వజం

న్యూఢిల్లీ : కేంద్రంలోని మోదీ ప్రభుత్వం తన ‘స్నేహితుల’కు ప్రయోజనం కల్పించేందుకు ఆరాట పడుతోందని కాంగ్రెస్ సోమవారం విమర్శించింది. దేశీయ విద్యుత్ ఉత్పత్తిదారులకు దిగుమతి చేసుకున్న బొగ్గును కలపడం తప్పనిసరి చేయడం ద్వారా ప్రభుత్వం తన ‘స్నేహితులకు’ ‘ప్రయోజనం’ కల్పిస్తోందని ఆరోపించింది. కాంగ్రెస్ అధికార ప్రతినిధి గౌరవ్ వల్లభ్ మాట్లాడుతూ ‘స్నేహితులకు’ ప్రయోజనం చేకూర్చేందుకే మోదీ ప్రభుత్వం ఈ నమూనాను రూపొందించిందని, ఇది సామాన్య ప్రజలను దెబ్బతీసే అధిక విద్యుత్ ఖర్చుకు దారి తీస్తుందని అన్నారు. ప్రభుత్వం మొదట దిగుమతి చేసుకున్న బొగ్గును కలపడం తప్పనిసరి చేసి, ఆ తర్వాత బొగ్గును దిగుమతి చేసుకునే కాంట్రాక్టును ‘స్నేహితులకు’ అప్పగించిందని, వారు ఇప్పుడు దిగుమతి చేసుకున్న బొగ్గును విద్యుత్ ఉత్పత్తిదారులకు దేశీయ బొగ్గు కంటే ఏడు నుంచి పది రెట్లు ఎక్కువ ధరకు విక్రయిస్తున్నారని, తద్వారా విపరీతమైన లాభాలు పొందుతున్నారని ఆయన ఆరోపించారు. ‘మోదీ ప్రభుత్వం అద్భుతమైన ఏర్పాటును అభివృద్ధి చేసింది. ఇది మూడు దశల స్నేహితుల ప్రయోజన నమూనా. దీని కింద అన్ని బొగ్గు ఆధారిత విద్యుత్ కేంద్రాల్లో 10 శాతం దిగుమతి చేసుకున్న బొగ్గును విద్యుత్ ఉత్పత్తికి కలపాలని ఆదేశించింది’ అని తెలిపారు. టన్నుకు రూ.16,700 చొప్పున దాదాపు 2.5 మిలియన్ టన్నులు... రూ.4,035 కోట్ల విలువైన బొగ్గును దిగుమతి చేసుకునే కాంట్రాక్టును అదానీ ఎంటర్‌ప్రైజెస్‌కు అప్పగించినట్లు వల్లభ్ తెలిపారు. ‘దీని ఫలితంగా, దేశంలోని బొగ్గు ఆధారిత విద్యుత్ ఉత్పత్తిదారులు ఈ దిగుమతి చేసుకున్న బొగ్గును టన్నుకు రూ.20 వేల చొప్పున కొనుగోలు చేయవలసి ఉంటుంది. తద్వారా దేశీయ బొగ్గు టన్నుకు రూ.1700 నుంచి రూ.2000 వరకు ఉండే సాధారణ ఖర్చుల కంటే ఏడు నుంచి 10 రెట్లు ఎక్కువ చెల్లించాలి’ అని అన్నారు. ‘ఫలితంగా గృహ, పారిశ్రామిక వినియోగానికి విద్యుత్ ఖర్చులు పెరుగుతాయి. తద్వారా సామాన్య ప్రజలు ఎక్కువగా నష్టపోతారు’ అని విమర్శించారు. ‘స్నేహిత ప్రయోజన విధానాన్ని సంస్థాగతీకరించడానికి ఇది త్రిముఖ వ్యూహం’ అని వల్లభ్ ఆరోపించారు.

అలహాబాద్ హైకోర్టు జడ్జిలుగా ఐదుగురు న్యాయవాదులు

సిఫార్సును పునరుద్ఘాటించిన సుప్రీం కొలీజియం

న్యూఢిల్లీ: అలహాబాద్ హైకోర్టులో ఐదుగురు న్యాయవాదులకు న్యాయమూర్తులుగా పదోన్నతి కల్పించాలని గతంలో చేసిన సిఫార్సును ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్.వి.రమణ నేతృత్వంలోని సుప్రీం కోర్టు కొలీజియం పునరుద్ఘాటించింది. న్యాయమూర్తులు యు.యు.లలిత్, ఎ.ఎం.ఖాన్విల్కర్‌లతో కూడిన కొలీజియం తాజాగా అలహాబాద్ హైకోర్టులో న్యాయమూర్తులుగా ఇద్దరు న్యాయవాదులు సౌరభ్ శ్రీవాస్తవ, ఓం ప్రకాష్ శుక్లా పేర్లను కూడా ప్రతిపాదించింది. అలహాబాద్ హైకోర్టులో న్యాయమూర్తుల కోసం న్యాయవాదులు శిశిర్ జైన్, మను ఖరే, రిషద్ ముర్తాజా, ధ్రువ్ మాథుర్, విమ్లెందు త్రిపాఠి పేర్లను పునరుద్ఘాటించింది. మరో నిర్ణయంలో ఛత్తీస్‌గఢ్ హైకోర్టులో జ్యుడీషియల్ అధికారి రాధాకిషన్ అగర్వాల్, న్యాయవాది రాకేష్ మోహన్ పాండేను న్యాయమూర్తులుగా నియమించే ప్రతిపాదనను కొలీజియం ఆమోదించింది. జమ్ముకశ్మీర్, లడఖ్ హైకోర్టులో న్యాయమూర్తిగా జ్యుడీషియల్ అధికారి రాజేష్ సెక్రీకి పదోన్నతి కల్పించే ప్రతిపాదనను కూడా ఆమోదించింది. ముగ్గురు సభ్యుల కొలీజియం జులై 14న జరిగిన సమావేశంలో ఈ నిర్ణయం తీసుకుంది. తీర్మానాన్ని సోమవారం సుప్రీం కోర్టు వెబ్‌సైట్‌లో ఉంచింది.

పెరగనున్న ఈపీఎఫ్ఓ ఈక్విటీ పెట్టుబడులు

న్యూఢిల్లీ: ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ(ఈపీఎఫ్ఓ) ఈక్విటీ పెట్టుబడులు పెరగనున్నాయి. పెట్టుబడి పెట్టదగిన డిపాజిట్లలో 20 శాతం వరకు తన పెట్టుబడులను పెంచే ప్రతిపాదనను ఈపీఎఫ్ఓ ఈ నెలలో ఆమోదించే అవకాశం ఉంది. ప్రస్తుతం ఇది 15శాతంగా ఉంది. జులై 29, 30 తేదీల్లో జరగనున్న ఈపీఎఫ్ఓట్రస్టీల సమావేశంలో ఈ ప్రతిపాదనను పరిశీలించి ఆమోదించాలని భావిస్తున్నారు. ప్రస్తుతం ఈపీఎఫ్ఓ, ఈక్విటీ లేదా ఈక్విటీ-సంబంధిత పథకాలకు సంబంధించి పెట్టుబడి పెట్టదగిన డిపాజిట్లలో 5 నుంచి15 శాతం వరకు పెట్టుబడి పెట్టవచ్చు. ఈ పరిమితిని 20 శాతానికి సవరించాలనే ప్రతిపాదనను ఈపీఎఫ్ఓ సలహా సంఘం ఆర్థిక ఆడిట్, పెట్టుబడి కమిటీ (ఎఫ్ఏఐసి) పరిశీలించి ఆమోదించింది. ఈక్విటీ పెట్టుబడులను 5 నుంచి 20శాతానికి పెంచాలన్న ఎఫ్ఏఐసీ సిఫార్సును ఆమోదించడానికి కేంద్ర కార్మికశాఖ మంత్రి అధ్యక్షతన ట్రస్టీల కేంద్ర బోర్డు (సీబీటీ) ఆమోదించే అవకాశం ఉంది.

రాజ్యసభకు వస్తాననుకోలేదు: విజయేంద్ర ప్రసాద్

న్యూఢిల్లీ : సినీ రచయిత, ప్రముఖ దర్శకుడు రాజమౌళి తండ్రి కేవీ విజయేంద్ర ప్రసాద్ రాజ్యసభ సభ్యునిగా సోమవారం ప్రమాణస్వీకారం చేశారు. ఆయన చేత రాజ్యసభ చైర్మన్ వెంకయ్య నాయుడు ప్రమాణం చేయించారు. రాష్ట్రపతి కోటాలో విజయేంద్ర రాజ్యసభకు నామినేట్ అయిన సంగతి తెలిసిందే. ప్రమాణస్వీకారం అనంతరం పార్లమెంట్ ఆవరణలో విజయేంద్ర ప్రసాద్ మీడియాతో మాట్లాడారు. రాష్ట్రపతి కోటాలో రాజ్యసభకు రావడం సంతోషంగా ఉందన్నారు. “రాజ్యసభకు వస్తానని నేను ఎప్పుడూ ఊహించలేదు. నా కథలే నన్ను రాజ్యసభకు తీసుకొచ్చాయి. రాజ్యసభకు నామినేట్ కావడం నా బాధ్యతను మరింత పెంచింది. ప్రజా సమస్యలను రాజ్యసభ దృష్టికి తీసుకెళ్తాను” అని విజయేంద్ర ప్రసాద్ తెలిపారు.

ఆగస్టు 9 నుంచి 15 వరకు పాదయాత్ర

మహారాష్ట్ర కాంగ్రెస్ నిర్ణయం

ముంబై : కేంద్రంలోని బీజేపీ పాలన లోపాలు, ప్రజా వ్యతిరేక నిర్ణయాలను ప్రజల్లోకి బలంగా తీసుకువెళ్లనున్నట్టు మహారాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నానా పటోలే తెలిపారు. ఈ క్రమంలో ఆగస్టు 9 నుంచి 15 వరకు రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో పాదయాత్ర చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. సోమవారం ఆయన ముంబైలో విలేకరులతో మాట్లాడుతూ...రాజ్యాంగాన్ని రక్షించండి- దేశాన్ని రక్షించండి అనే నినాదాలతో ప్రతి జిల్లాలోనూ 75 కిలోమీటర్లు మేర ఈ పాదయాత్రలు చేపట్టనున్నట్టు చెప్పారు. కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలు, నిత్యావసరధరల పెరుగుదల, ఆహార పదార్థాలపై జీఎస్‌టీకి వ్యతిరేకంగా. అగ్నిపథ్ పథకాన్ని రద్దు చేయాలనే తదితర ప్రజా సమస్యలపై దృష్టి కేంద్రీకరించి పోరాటం చేయనున్నట్టు తెలిపారు. వారం పాటు సాగనున్న ఈ యాత్రల్లో ప్రతి గ్రామాన్ని చైతన్య పరచనున్నట్టు వివరించారు.

హిందువులకు మైనారిటీ హోదా కావాలి

సుప్రీంలో పిటిషన్

న్యూఢిల్లీ: హిందువులకు మైనారిటీ హోదా కోసం సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. జాతీయ మైనారిటీల కమిషన్ చట్టం 1992లోని సెక్షన్ 2(సీ) ప్రకారం కేవలం ఆరు మతాలకు చెందిన ముస్లింలు, క్రైస్తవులు, బౌద్ధులు, పార్సీలు, సిక్కులు, జైనులను మైనారిటీలుగా ప్రకటించడాన్ని పిటిషనర్ సవాల్ చేశారు. జనాభా ప్రకారం జిల్లాల వారీగా మైనారిటీలను గుర్తించి, రాష్ట్రాల వారీగా ప్రజలకు ఆ హోదా కల్పించాలని విజ్ఞప్తి చేశారు. హిందూ ఆధ్యాత్మిక నేత దేవకినందన్ ఠాకూర్ ఈ మేరకు ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలు చేశారు. సుప్రీంకోర్టు ఈ పిటిషన్‌పై సోమవారం విచారణ జరిపింది. పిటిషనర్ తరపున సీనియర్ న్యాయవాది అరవింద్ దాతర్ వాదనలు వినిపించారు. మైనారిటీలను రాష్ట్రాలే నోటిఫై చేయాలని అనేక కోర్టు తీర్పులు చెబుతున్నాయన్నారు. ‘హిందువులకు మైనారిటీ హోదా నిరాకరించడంపై మేం మాట్లాడుతున్నాం. హిందువులు మైనారిటీలు కాకూడదన్నట్లుగా నమ్ముతున్నారు’ అని అన్నారు.

ఈ వాదనపై న్యాయమూర్తి లలిత్ స్పందించారు. కశ్మీర్ లేదా మిజోరాంలో హిందువులకు మైనారిటీ హోదాను నిరాకరించినట్లుగా నిర్దిష్టమైన కేసులు ఉంటే మాత్రమే ఈ పిటిషన్‌ను తాము పరిశీలిస్తామని తెలిపారు. మైనారిటీ హోదాపై ఉన్న అన్ని వివాదాలను రాష్ట్రాల వారీగా కోర్టు పరిశీలించదని చెప్పారు. హిందువులకు మైనారిటీ హోదాను రాష్ట్రాలు తిరస్కరించినట్లుగా ‘కచ్చితమైన ఉదాహరణలు’ కావాలన్నారు. జనాభా ప్రకారం రాష్ట్రాల వారీగా మైనారిటీ హోదా వివరాలను రెండు వారాల్లో సమర్పించాలని పిటిషనర్‌ను సుప్రీంకోర్టు కోరింది. తదుపరి విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది.

రాష్ట్రపతి ఎన్నికల ఓటింగ్

ముర్ము సొంతూరిలో సందడి

రాయ్‌రంగ్‌పూర్‌లో ప్రత్యేక ధ్యానం... ప్రార్థనలు... పూజలు

రాయరంగ్‌పూర్ (ఒడిశా) : దేశ 15వ రాష్ట్రపతిని ఎన్నుకునేందుకు దేశవ్యాప్తంగా సోమవారం ఓటింగ్ ప్రారంభమైనందున రాష్ట్రపతి అభ్యర్థి ద్రౌపది ముర్ము నివాసం ఉండే ఈ చిన్న ఉత్తర ఒడిశా పట్టణంలో ధ్యానం, ప్రార్థనలు, పూజలు జరిగాయి. వివిధ వార్తా ఛానళ్లు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులు కొత్త రాష్ట్రపతిని ఎన్నుకోవడానికి తమ ఓటు వేస్తున్నట్లు దేశంలోని వీవీఐపీలను చూపించడంతో స్థానికులు టీవీల వద్ద అతుక్కుపోయారు. దీంతో పట్టణంలో పండుగ వాతావరణం నెలకొంది. సాధారణంగా ఈ ఓటింగ్ చిన్న పట్టణంలో పెద్దగా గుర్తించబడదు. కానీ రాష్ట్రపతి ఎన్నికల్లో ఎన్‌డీఏ అభ్యర్థిగా ముర్ము పోటీ చేస్తుండటంతో ప్రజలు ఈసారి టీవీల్లో ఓటింగ్ దృశ్యాలను చూసేందుకు ఉత్సాహం కనబరిచారు. ముఖ్యంగా గిరిజనులలో ఒక మహిళ రైసినా హిల్స్‌ను ఆక్రమించుకుని దేశ చరిత్రలో తన పేరును సుస్థిరం చేసేందుకు సిద్ధమయింది. ఇక్కడి ‘ప్రజాపితా బ్రహ్మ కుమారీస్ ఈశ్వరీయ విశ్వ విద్యాలయ’ కేంద్రం సభ్యులు రాష్ట్రపతి ఎన్నికల ఓటింగ్ సందర్భంగా ప్రత్యేక ధ్యాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముర్ము 2009 నుంచి కేంద్రంలో క్రియాశీల సభ్యునిగా ఉన్నారు. ‘ఆమె గొప్ప విజయం సాధిస్తారు. మా ధ్యాన సమావేశాలు ప్రతిరోజూ ఉదయం 3.30 నుంచి ఉదయం 7 గంటల వరకు జరుగుతాయి. కానీ ఈరోజు మేము సమయాన్ని పొడిగించాము. ఓటింగ్ పూర్తయ్యే వరకు ఒక రోజంతా ధ్యానం చేశాము’ అని బ్రహ్మకుమారి సుప్రియ అన్నారు. తాను గెలిస్తే దిల్లీలో జరిగే తన ప్రమాణ స్వీకార కార్యక్రమానికి హాజరుకావాలని రాయ్‌రంగ్‌పూర్‌లోని బ్రహ్మకుమారీల ప్రతినిధి బృందాన్ని ముర్ము ఆహ్వానించినట్లు ఆమె తెలిపారు. ముర్ము 1994 నుంచి మూడు సంవత్సరాలు ఉపాధ్యాయునిగా పనిచేసిన పట్టణంలోని శ్రీ అరబిందో ఇంటిగ్రల్ స్కూల్‌లో ఇలాంటి దృశ్యం కనిపించింది. దాని విద్యార్థులు, మాజీ విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, పాఠశాల ఉపాధ్యాయులు, కొందరు ఆమె పూర్వ సహచరులు ప్రార్థనలకు హాజరయ్యారు.

విమానాల్లో భద్రతా పర్యవేక్షణ పెంచాలి: సింధియా

న్యూఢిల్లీ: విమానయాన శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా సోమవారం భారత విమానయాన సంస్థల చీఫ్‌లతో సమావేశాలు నిర్వహించారు. విమానాల్లో భద్రతా పర్యవేక్షణను పెంచాలని వారిని కోరినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. గతనెలలో భారతీయ విమానాలలో అనేక సాంకేతిక లోపాలు సంభవించిన నేపథ్యంలో భద్రతా పర్యవేక్షణను పెంచేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని సింధియా ప్రతి విమానయాన సంస్థకు చెప్పినట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. సింధియా ఆదివారం తన మంత్రిత్వ శాఖ, రెగ్యులేటర్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డిజిసిఎ) సీనియర్ అధికారులతో భద్రతా సమస్యలపై సమీక్ష నిర్వహించారు. గత నెల రోజులుగా జరిగిన సంఘటనల గురించి మంత్రి అధికారుల నుంచి సవివరమైన నివేదికను కోరారు. ప్రయాణీకుల భద్రతపై రాజీపడవద్దని వారికి చెప్పారు. ఒక ఇంజన్‌లో లోపాన్ని గమనించడంతో ఆదివారం ఇండిగోకు చెందిన షార్జా-హైదరాబాద్ విమానాన్ని పైలట్లు ముందు జాగ్రత్త చర్యగా కరాచీకి మళ్లించారు. శనివారం రాత్రి, ఎయిర్ ఇండియాకు చెందిన కాలికట్-దుబాయ్ విమానాన్ని మస్కట్‌కు మళ్లించాల్సి వచ్చింది. కేరళలోని కాలికట్ నుంచి దుబాయి వెళ్తున్న విమానంలో ఒక్కసారిగా క్యాబిన్‌లో కాలిన వాసన వచ్చింది. దీంతో వెంటనే విమానాన్ని దారి మళ్లించారు. అంతకుముందు రోజు ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ బహ్రెయిన్-కోచి విమానం కాక్‌పిట్‌లో సజీవంగా ఉన్న పిచ్చుక కనిపించింది. కాగా జూన్ 19నుంచి ఎనిమిదిసార్లు సాంకేతిక లోపాలు తలెత్తిన ఘటనలు చోటుచేసుకున్న నేపథ్యంలో స్పైస్‌జెట్ విమానయాన సంస్థకు జులై6న డీజీసీఏ షోకాజ్ నోటీసు జారీ చేసింది.

నేను నేరస్థుడిని కాదు...

సింగపూర్‌కు అనుమతి ఆలస్యానికి రాజకీయ కారణం: సీఎం కేజ్రీవాల్

న్యూఢిల్లీ : ‘నేను నేరస్థుడిని కాను’ అని దిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ సోమవారం అన్నారు. సింగపూర్‌లో శిఖరాగ్ర సమావేశానికి వెళ్లేందుకు తనకు అనుమతి ఇవ్వడంలో జాప్యం వెనుక ‘రాజకీయ కారణం’ ఉందని ఉద్ఘాటించారు. సింగపూర్‌లో జరిగే ప్రపంచ నగరాల సదస్సుకు తనను ఆ దేశ ప్రభుత్వం ప్రత్యేకంగా ఆహ్వానించిందని, అక్కడ ప్రపంచ నాయకుల ముందు దిల్లీ నమూనాను ప్రదర్శించి భారతదేశానికి ప్రశంసలు తెస్తానని కేజ్రీవాల్ చెప్పారు. పర్యటన కోసం కేంద్రం నుంచి అనుమతి రాకపోవడంపై విసిగిపోయిన కేజ్రీవాల్ ఆదివారం ప్రధాని నరేంద్ర మోదీకి లేఖ రాశారు. తాను నెల రోజులుగా వేచి చూస్తున్నట్లు తెలిపారు. ‘నేను నేరస్థుడిని కాదు. నేను ముఖ్యమంత్రిని, దేశానికి స్వేచ్ఛా పౌరుడిని. నేను సింగపూర్‌ను సందర్శించకుండా నిరోధించడానికి ఎటువంటి చట్టపరమైన ఆధారం లేనందున దీని వెనుక రాజకీయ కారణం ఉన్నట్లు కనిపిస్తోంది’ అని అన్నారు. ఆగస్టు మొదటి వారంలో జరిగే ప్రపంచ నగరాల సదస్సుకు సింగపూర్ హైకమిషనర్ సైమన్ వాంగ్ జూన్‌లో కేజ్రీవాల్‌ను ఆహ్వానించారు. తాను సాధారణంగా విదేశీ పర్యటనలకు వెళ్లనని, దేశ ప్రగతికి సంబంధించిన దృష్ట్యా సింగపూర్ సదస్సుకు వెళ్లాలని భావిస్తున్నట్లు ముఖ్యమంత్రి తెలిపారు.

నదిలోకి దూసుకెళ్లిన బస్సు

- 13 మంది ప్రయాణికుల దుర్మరణం
- మరికొంతమంది గల్లంతు
- మధ్యప్రదేశ్‌లో ఘోర రోడ్డు ప్రమాదం

భోపాల్: మధ్యప్రదేశ్‌లో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. బస్సు నదిలోకి దూసుకెళ్లిన దుర్ఘటనలో 13 మంది మృతి చెందారు. మరో 15 మందిని సహాయక సిబ్బంది రక్షించారు. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశముంది. ధార్ జిల్లా ఖల్‌ఘాట్ వద్ద ఉదయం 10 గంటలకు ఈ ఘటన జరిగింది. ఇండోర్ నుంచి మహారాష్ట్రలోని పూనే వెళ్తున్న బస్సు... వంతెనపై అదుపు తప్పి నర్మదా నదిలో పడిపోయింది. ఈ ప్రమాదంపై సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు, సహాయక సిబ్బంది అక్కడికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు.స్థానిక మత్స్యకారులు కూడా సహాయకచర్యల్లో అధికార యంత్రాగానికి సాయం చేశారు. క్రేన్ సాయంతో నదిలో పడిన బస్సును బయటకు తీసినట్లు అధికారులు వెల్లడించారు. గల్లంతైన వారి కోసం ముమ్మరంగా గాలిస్తున్నారు. ఖల్‌ఘాట్ వద్ద ఉన్న సంజయ్ వంతెనపైకి రాగానే బస్సు అదుపు తప్పినట్లు అధికారులు పేర్కొన్నారు. ఈ క్రమంలో వంతెన గోడను ఢీకొని సుమారు 20 అడుగుల ఎత్తు నుంచి బస్సు నదిలోకి పడిపోయినట్లు వివరించారు. ప్రమాదం అనంతరం కొంతమంది ప్రయాణికులు నీటిలో గల్లంతు కాగా, మరికొందరు బస్సులోనే ఇరుక్కుపోయి ప్రాణాలు విడిచారు. ప్రమాద ఘటనపై మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్, హోంమంత్రి నరోత్తమ్ మిశ్రా తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఘటనకు సంబంధించి మహారాష్ట్ర ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రితో మాట్లాడినట్లు సీఎం చౌహాన్ చెప్పారు. గాలింపు కోసం అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ప్రమాద ఘటనపై విచారణకు ఆదేశించినట్లు సీఎం వెల్లడించారు. ప్రమాద సమాచారం అందిన వెంటనే ఘటన స్థలానికి చేరుకోవాలని సీఎం చౌహాన్ అధికార యంత్రాంగానికి ఆదేశాలు జారీ చేశారు. సహాయక చర్యల నిమిత్తం ఎస్‌డీఆర్ఎఫ్‌ను ఘటన స్థలానికి పంపాలని ఆదేశించారు. దీంతో పాటు క్షతగాత్రులకు తగిన చికిత్స అందించాలని సూచించారు. ముఖ్యమంత్రి ఆదేశాలతో ఖర్గోన్, ధార్, ఇండోర్ జిల్లాల అధికార యంత్రాంగం సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ప్రమాదానికి గురైన బస్సు 10 ఏళ్లుగా సర్వీసులో ఉందని, ఫిట్‌నెస్ సర్టిఫికెట్ కూడా 10 రోజుల్లో ముగుస్తుందని మహారాష్ట్ర ఆర్టీఓ అధికారులు వెల్లడించారు. నాగ్‌పూర్ రూరల్ రీజనల్ ట్రాన్స్‌పోర్ట్ ఆఫీస్‌లో 2012, జూన్12న బస్సు రిజిస్ట్రేషన్ జరిగింది. వాహనం సక్రమంగా ప్రయాణించడానికి అనువుగా ఉందని సూచించే ఫిట్‌నెస్ సర్టిఫికెట్ గడువు ఈ నెల 27న ముగియనుందని ఆర్టీఓ పేర్కొంది. పొల్యూషన్ అండర్ కంట్రోల్ (పీయూసీ) సర్టిఫికెట్, ఇన్సూరెన్స్ చెల్లుబాటు అవుతాయని తెలిపింది. ప్రమాదానికి గురైన బస్సును చంద్రకాంత్ ఏక్‌నాథ్ పాటిల్ అనే డ్రైవర్ నడిపాడని, ప్రకాశ్ శ్రావణ్ చౌదరి కండక్టర్‌గా ఉన్నారని మహారాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ వెల్లడించింది. అయితే

ప్రమాద సమయంలో బస్సులో ఎంతమంది ఉన్నారనే విషయంలో స్పష్టత రావాల్సి ఉంది. బస్సు ప్రమాదంలో మృతిచెందిన వారి కుటుంబసభ్యులకు ప్రధానమంత్రి నరేంద్ర రూ.2లక్షల పరిహారాన్ని ప్రకటించారు. అలాగే గాయపడిన వారికి రూ.50వేలు అందజేయనున్నట్లు తెలిపారు.

చక్రాల కుర్చీలో పార్లమెంటుకు మన్మోహన్, ములాయం

న్యూఢిల్లీ: రాష్ట్రపతి ఎన్నికల్లో ఓటు వేసేందుకు మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్, సమాజ్‌వాదీ పార్టీ వ్యవస్థాకుడు ములాయంసింగ్ యాదవ్ చక్రాల కుర్చీలో పార్లమెంటుకు వచ్చారు. 89 ఏళ్ల మన్మోహన్ సింగ్... గత ఏడాది కోవిడ్ సోకినప్పటినుంచి అనారోగ్యంతో ఉన్నారు. అప్పటి నుంచి ఆయన నివాసానికే పరిమితమయ్యారు. గత ఏడాది అక్టోబరులో జ్వరం సోకడంతో మన్మోహన్... అఖిలభారత వైద్య విజ్ఞానసంస్థ (ఏఐఐఎంఎస్)లో చేరారు. ఇక సమాజ్‌వాదీ పార్టీ వ్యవస్థాపకుడు ములాయంసింగ్ యాదవ్ కూడా తన సోదరుడు రామ్ గోపాల్ యాదవ్‌తో కలిసి చక్రాల కుర్చీలో ఓటు వేయడానికి పార్లమెంటుకు వచ్చారు. 82 ఏళ్ల యాదవ్ కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఒడిశా అసెంబ్లీలో ప్రతిపక్ష నేత, బీజేపీ నాయకుడు ప్రదీప్త కుమార్ నాయక్ కూడా ఆసుపత్రి నుంచి నేరుగా ఆక్సిజన్ సిలిండర్‌తో చక్రాల కుర్చీపై పార్లమెంటుకు వచ్చారు. కోవిడ్ అనంతర ఆరోగ్య సమస్యలపై ఆయన దిల్లీలోని ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో చేరారు.

మనస్సాక్షితో ద్రౌపది ముర్ముకు ఓటు వేశాను

ఒడిశా కాంగ్రెస్ ఎమ్మెల్యే

భువనేశ్వర్ : తన మనస్సాక్షి మేరకు ఎన్‌డీఏ తరపున రాష్ట్రపతి అభ్యర్థిగా బరిలో నిలిచిన ద్రౌపది ముర్ముకు ఓటు వేసినట్టు ఒడిశా కాంగ్రెస్ ఎమ్మెల్యే మహమ్మద్ మొక్విమ్ వెల్లడించారు. ద్రౌపది ముర్ము ఒడిశా కుమార్తె అయినందునే తాను ఆమెకే అనుకూలంగా ఓటు వేసినట్లు ప్రకటించారు. రాష్ట్రానికి చెందిన ద్రౌపది ముర్ముకు మద్దతు ఇవ్వాలని విదేశాల్లో ఉన్నవారు సహా చాలా మంది ప్రముఖుల నుంచి తనకు ఫోన్లు వచ్చాయని తెలిపారు. ఈనేపథ్యంలో తాను తన మనస్సాక్షి ప్రకారం ముర్ముకు అనుకూలంగా ఓటు వేశాను. మనస్సాక్షి చెప్పినట్టు వినకుండా ఉండలేమని పేర్కొన్నారు. తన చర్యకు రాష్ట్ర ప్రజల మద్దతు ఉంటుందని భావిస్తున్నట్టు తెలిపారు. ముర్ము విజయం తనకు ఆనందాన్నిస్తుందని వ్యాఖ్యానించారు. పార్టీ నిర్ణయానికి భిన్నంగా ఓటు వేసిన మీరు ఒత్తిడికి లోనవుతున్నారా అని విలేకరులు అడిగిన ప్రశ్నకు స్పందించిన ఆయన ఇది పూర్తిగా తన వ్యక్తిగత నిర్ణయమని వేరే ఏ ఇతర కారణాలు లేవని స్పష్టం చేశారు. ఇదిలా ఉండగా మహమ్మద్ తొలుత విపక్షాల అభ్యర్థి యశ్వంత్ సిన్హాకు ఓటు వేయడానికి అంగీకరించారని కాంగ్రెస్ సభా పక్ష నేత నరసింగ మిశ్రా అన్నారు. ఆయనలో వచ్చిన మార్పును తప్పుబట్టారు. పార్టీ నిర్ణయానికి అందరూ కట్టుబడి ఉండాల్సిందేనని పేర్కొన్నారు. మహమ్మద్ ఎందుకు ఇలా చేశారో తెలియదని, ఆయన చర్యను పార్టీ అధిష్టానం దృషికి తీసుకెళ్లనున్నట్టు ఒడిశా కాంగ్రెస్ అధ్యక్షుడు శరత్ పట్నాయక్ తెలిపారు.

ఓటు వేయడంలో తడబాటు

ములాయం సహా బీజేపీ నేతకు మరో అవకాశం

న్యూఢిల్లీ : రాష్ట్రపతి ఎన్నికల్లో ఓటు వేయడంలో తడబాటుకు గురైన బీజేపీ ఎంపీ నిసిత్ ప్రమాణిక్, సమాజ్‌వాదీ పార్టీ వ్యవస్థాపక అధినేత ములాయం సింగ్ యాదవ్‌లకు మరో అవకాశం కల్పించారు. వీరు ఇద్దరూ ఓటు వేయడంలో తడబాటుకు గురైన క్రమంలో సరిగా ఓటు హక్కును వినియోగించుకోలేక పోవడంతో వారికి మరో అవకాశం కల్పించినట్టు సంబంధిత వర్గాలు తెలిపాయి. ములాయం సింగ్ యదవ్ ఓటు వేయడం కోసం వీల్ చైర్‌లో పార్లమెంటులోకి వచ్చారు. ఇటీవల తీవ్ర అనారోగ్యానికి గురైన మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ సైతం వీల్ చైర్‌లోనే పార్లమెంటులోకి ప్రవేశించగా ఆయనకు పోలింగ్ అధికారులు అన్ని విధాల సహకరించి ఓటు వేయించారు. ఇదిలా ఉండగా పార్లమెంటులో కాంగ్రెస్ పార్టీ తరపున గుజరాత్‌కు చెందిన కాంగ్రెస్ రాజ్యసభ ఎంపీ అమీ యాగ్నిక్, బీజేపీ తరపున సీనియర్ నేత గజేంద్ర సింగ్ షెకావత్ ఎన్నికల ఏజెంట్లుగా వ్యవహరించారు.

రాష్ట్రపతి ఎన్నికలను బహిష్కరించిన ఎస్ఏడీ ఎమ్మెల్యే మన్‌ప్రీత్ సింగ్

చండీగఢ్ : రాష్ట్రంలోని చాలా సమస్యలు ఇప్పటికీ పరిష్కారం కాకపోవడంతో తాను రాష్ట్రపతి ఎన్నికలను బహిష్కరించినట్టు పంజాబ్‌కు చెందిన శిరోమణి అకాలీదళ్ ఎమ్మెల్యే మన్‌ప్రీత్ సింగ్ అయాలీ తెలిపారు. ఈ మేరకు ఆయన ఒక వీడియో సందేశం విడుదల చేశారు. 117 మంది సభ్యులున్న రాష్ట్ర అసెంబ్లీలో ఆ పార్టీ తరపున ముగ్గురు ఎమ్మెల్యేలున్న విషయం తెలిసిందే. ముర్ము అభ్యర్థిత్వంపై తనకు ఎలాంటి వ్యతిరేకత లేదని, అదే తరుణంలో ఆమెకు మద్దతు ఇస్తున్నట్టు పార్టీ తనను సంప్రదించలేదని పేర్కొన్నారు. రాష్ట్రంలో అనేక సమస్యలు పెండిగులోనే ఉన్నాయని పేర్కొన్నారు. రాష్ట్రం పట్ల కేంద్రం వివక్ష చూపిస్తూనే ఉందని వాపోయారు. వివాదాస్పదంగా ఉన్న నదీ జలాల పంపిణీ సహా వివిధ సమస్యలను ప్రస్తావించారు. ఈ నేపథ్యంలోనే తాను ఎన్నికలను బహిష్కరించాలని నిర్ణయించుకున్నట్టు ఆ వీడియో సందేశంలో స్పష్టం చేశారు.

భావజాల పోరాటమే... వ్యక్తిగతం కాదు

రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి ఎన్నికలపై సీఎం గెహ్లాట్

జైపూర్ : రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి ఎన్నికలు భావజాల పోరాటమే తప్ప వ్యక్తిగతంగా అభ్యర్థులకు సంబంధించినది కాదని రాజస్థాన్ ముఖ్యమంత్రి అశోక్ గెహ్లాట్ సోమవారం అన్నారు. ఇక్కడ అధ్యక్ష ఎన్నికలకు తన ఓటు వేసిన తర్వాత గెహ్లాట్ మాట్లాడుతూ ఒక అభ్యర్థిని అతని సొంత రాష్ట్రంలో ప్రజలు స్వాగతించడం సహజమే అయినప్పటికీ, ఓటింగ్ భావజాలంపై ఆధారపడి ఉంటుందని తెలిపారు. ఎన్‌డీఏ ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా పశ్చిమ బెంగాల్ గవర్నర్ జగదీప్ ధన్కర్ రాజస్థాన్‌కు చెందినవారు. ఆ రాష్ట్ర మాజీ గవర్నర్‌గా పని చేసిన ఉమ్మడి ప్రతిపక్ష అభ్యర్థి మార్గరెట్ అల్వాపై పోటీ చేస్తున్నారు. ‘ఒకప్పుడు భైరాన్ సింగ్ షెకావత్ (ఉపరాష్ట్రపతి అభ్యర్థి) అయినట్లే ఆయన (ధన్కర్) రాజస్థాన్ నుంచి అభ్యర్థి అయ్యారు’ అని అన్నారు. రాజస్థాన్ నుంచి పార్లమెంట్ ఉభయ సభల చైర్మన్ కావడం యాదృచ్ఛికమని గెహ్లాట్ అన్నారు. లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా కూడా రాజస్థాన్‌కు చెందినవారే. సీఎం గెహ్లాట్ మాట్లాడుతూ రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి ఎన్నికలు రెండూ అభ్యర్థుల పోరు కాదని, భావజాల పోరాటమని, ఆ స్ఫూర్తితో తీసుకోవాలని సీఎం అన్నారు. రాష్ట్రపతి ఎన్నికలకు ప్రతిపక్ష పార్టీలు యశ్వంత్ సిన్హాను తమ అభ్యర్థిగా చేశాయన్నారు. ఎన్‌డీఏ ప్రభుత్వం, బీజేపీ కోరుకుంటే విపక్షాలను కలుపుకొని రాష్ట్రపతి అభ్యర్థిని ఏకగ్రీవంగా ప్రకటించే అవకాశం వచ్చేదని ఆయన అన్నారు. అయితే ఇది సాధారణంగా జరగదని, అందువల్ల చర్చనీయాంశం కాకూడదని తెలిపారు.

ద్రౌపది ముర్ముకు ఓటేసిన హర్యానా కాంగ్రెస్ ఎమ్మెల్యే

న్యూఢిల్లీ : హర్యానా కాంగ్రెస్ ఎమ్మెల్యే కుల్‌దీప్ విష్ణోయ్ రాష్ట్రపతి ఎన్నికల్లో ఎన్‌డీఏ అభ్యర్థి ద్రౌపది ముర్ముకు ఓటు వేశారు. ఈ విషయాన్ని ఆయనే స్వయంగా దిల్లీలో వెల్లడించారు. తాను ప్రతిపక్షాల యశ్వంత్ సిన్హాకు కాకుండా ఎన్డీయే అభ్యర్థి ద్రౌపది ముర్ముకు మద్దతిచ్చినట్టు తెలిపారు. తన మనసాక్షి ప్రకారం ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు. ఇటీవల జరిగిన రాజ్యసభ ఎన్నికల్లోనూ కాంగ్రెస్ అభ్యర్థికి కాకుండా క్రాస్ ఓటింగుకు పాల్పడడంతో ఆ పార్టీ నుంచి బరిలో నిలిచిన అభ్యర్థి ఓటమిపాలైన విషయం తెలిసిందే. హర్యానా మాజీ సీఎం భజన్ లాల్ చిన్న కుమారుడైన విష్ణోయ్ తొలుత పార్లమెంటులో ఓటు వేసేందుకు అవకాశం ఇవ్వమని కోరినా అనుమతి రాకపోవడంతో చండీగఢ్‌లోని అసెంబ్లీ కాంప్లెక్స్‌లో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇదిలా ఉండగా కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్ష పదవిని ఆశించి అవకాశం దక్కకపోవడంతో విష్ణోయ్ పార్టీ నిర్ణయాలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నట్టు తెలుస్తోంది.

మాట్లాడుతున్న రామకృష్ణ. వేదికపై ఓబులేసు, జగదీశ్, చంద్రానాయక్, జాఫర్, నారాయణస్వామి, వేమయ్య తదితరులు

సభకు హాజరైన సీపీఐ శ్రేణులు

జగన్ హయాంలో రాష్ట్రం దివాలా

- పాలన గాలికి...అభివృద్ధి శూన్యం
- మంత్రిమండలి అవినీతిమయం
- ప్రశ్నిస్తే వేధింపులు...కేసులు
- సీపీఐ అనంతపురం జిల్లా మహాసభలో రామకృష్ణ విమర్శ

విశాలాంధ్ర-కళ్యాణదుర్గం: మాట తప్పను-మడమ తిప్పను, నేను ఉన్నాను-నేను విన్నాను... అంటూ అధికారంలోకి వచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మూడేళ్ల కాలంలో రాష్ట్రాన్ని దివాలా తీయించారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ విమర్శించారు. రాష్ట్రంలో అభివృద్ధి మాటేలేదని, పరిపాలన గాలికి వదిలేశారని వ్యాఖ్యానించారు. అనంతపురం జిల్లా కళ్యాణదుర్గంలో సీపీఐ 24వ జిల్లా మహాసభలు సోమవారం నిర్వహించారు. నియోజకవర్గ కార్యదర్శి జి.గోపాల్ అధ్యక్షత వహించారు. రామకృష్ణతో పాటు సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఓబులేసు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జగదీశ్, ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షుడు చంద్రానాయక్, అనంతపురం జిల్లా కార్యదర్శి జాఫర్, సహాయ కార్యదర్శి నారాయణస్వామి, నాయకులు మల్లికార్జున, సంజీవప్ప, ఎంవీ రమణ హాజరయ్యారు. రామకృష్ణ మాట్లాడుతూ 2014 జూన్ నాటికి ఆంధ్ర ప్రదేశ్‌కు రూ.96 వేల కోట్లు అప్పులు ఉండగా జగన్ అధికారంలోకి వచ్చాక అవి రూ. లక్షల కోట్లకు చేరాయన్నారు. మరో రెండేళ్లలో అప్పులు రు.10 లక్షల కోట్లకు చేరతాయని రామకృష్ణ చెప్పారు. ఇంత అప్పు చేసినప్పటికీ రాష్ట్రంలో కొత్తగా కిలోమీటర్ రోడ్డు వేయలేదని, గంప మట్టి తీసి కాలువ తవ్వ లేదని, ఒక్క ప్రాజెక్టు కట్టలేదని ఆరోపించారు. పోలవరంలో 54 గ్రామాలు వరదకు మునిగిపోతున్నా పట్టించుకోలేదన్నారు. 2 లక్షల మంది కొండలపైనా, గుట్టలపైనా తలదాచుకుంటున్నారని, సీఎం హెలి కాప్టర్‌లో వెళ్లి వచ్చి...తన పని అయిపోయినట్లు

వ్యవహరిస్తున్నారని రామకృష్ణ విమర్శించారు. బాధితు లకు కనీసం ఆహారం అందించడం లేదన్నారు. కడపలో ఉక్కు ఫ్యాక్టరీ ఏమైందని ప్రశ్నించారు. అనంత జిల్లాలో చంద్రబాబు హయాంలో కియా ఫ్యాక్టరీ ఏర్పాటు చేయడం వల్ల కొంత ఉపశమనం కలిగిందని గుర్తు చేశారు. మంత్రిమండలి అంతా అవినీతిలో కూరుకుపోయిందన్నారు. డబ్బు సంపా దనలో మంత్రులు పోటీ పడుతున్నారని ఆరోపించారు. హైకోర్టు ఆదేశించిన పనికి సైతం నెల్లూరు జిల్లాలో ఓ తహసీల్దార్ రూ.50 లక్షల లంచం అడిగాడంటే అధికార యంత్రాంగం ఎంత బరితెగించిందో అర్థమవు తోందని అన్నారు. మండలస్థాయి అధికారే ఇలా ఉంటే మంత్రులు, ఎమ్మెల్యేల పరిస్థితిని అర్థం చేసుకోవచ్చని చెప్పారు. అవినీతి, అక్రమాలపై ప్రశ్నిస్తే పోలీసులతో బెదిరింపులకు పాల్పడుతున్నారని, అక్రమ కేసులు బనాయిస్తున్నారని మండిపడ్డారు. విశాఖలో డాక్టర్ సుధాకర్ ఆత్మహత్య, కాకినాడలో అధికార పార్టీ ఎమ్మెల్సీ అనంతబాబు వ్యవహారం తదితర అంశాలను గుర్తు చేశారు. మద్యనిషేధంపై జగన్ మాటతప్పారని విమర్శించారు. మద్యంపై ఇప్పటికే రూ.22 వేల కోట్లు సమకూర్చుకుంటున్న జగన్..తాజా నిర్ణయాలతో రూ.36 వేల కోట్లకు పెంచుకుంటున్నారని చెప్పారు. సొంత బ్రాండ్ల ద్వారా తన సొంత ఖజానాకు రూ.3 వేల కోట్లు సమకూర్చుకుంటున్నారన్నారు. ఇటీవల జరిగిన వైసీపీ ప్లీనరీని భజన కార్యక్రమంగా రామకృష్ణ అభివర్ణించారు. ప్రత్యేక హోదా, ప్రాజెక్టులు, ధరల పెరుగుదల, రైతుల గురించి ప్రస్తావనే లేదన్నారు. ఇలాంటి ప్రభుత్వాన్ని సాగనంపాలని పిలుపునిచ్చారు. ఎన్‌డీయే ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఎనిమి దేళ్లలో నిరుద్యోగ భారతాన్ని తెచ్చిపెట్టిందని, రూ.150 లక్షల కోట్లు అప్పుచేసి జనంపై అదరపు భారం మోపిందని రామకృష్ణ విమర్శించారు. పేదరికంలో భారత్ 101 స్థానంలో నిలిచిందన్నారు. ఏటా రెండు కోట్ల ఉద్యోగాలన్న ఎన్నికల వాగ్దానాన్ని మోదీ నెరవేర్చలేదని మండిపడ్డారు. రైతు ఆత్మహత్యల నివారణకు ప్రత్యామ్నాయ కార్యక్రమాలు చేపట్టని మోదీ, జగన్ ప్రభుత్వాలను గద్దె దింపాలని విజ్ఞప్తి చేశారు. ప్రజాసమస్యలపై సీపీఐ సమరశీల పోరాటాలు చేస్తోందని తెలిపారు. అక్టోబర్ 14-18 తేదీల్లో విజయవాడలో సీపీఐ జాతీయ మహాసభలు నిర్వహిస్తున్నామని తెలిపారు.

ఓబులేసు మాట్లాడుతూ మసీదులు పడకొట్టి దేవాలయాలు నిర్మించాలన్న మతోన్మాద బీజేపీ కుట్రలను బహిర్గతం చేయడంతో పాటు ఉద్యమాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. రాయలసీమకు నీళ్లు ఇవ్వకుండా..ఇక్కడి ప్రాజెక్టులను పూర్తి చేయకుండా రైతులను మరింత అప్పుల్లో కురుకుపోయేలా జగన్ ప్రభుత్వం వ్యవహరిస్తున్నదని ఆరోపించారు. కమ్యూనిస్టులు అధికారంలోకి రావడం ద్వారానే సమసమాజ స్థాపన సాధ్యమవుతుందని ఆయన అన్నారు. జాఫర్ మాట్లాడుతూ ప్రజల సమస్యలపై పోరాడుతున్న కమ్యూనిస్టులను అరెస్టు చేస్తూ...గృహనిర్బంధానికి రాష్ట్ర ప్రభుత్వం పాల్పడుతోందని విమర్శించారు. జిల్లాలో నష్టపోయిన రైతులకు పంటల బీమా అందించాలని డిమాండ్ చేశారు. బహిరంగ సభకు ముందు పట్టణంలోని సాయిబాబా దేవాలయం నుండి మసీదు సర్కిల్ మీదుగా సభ ప్రాంగణం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. పిల్లల కోలాటలు, ప్రజానాట్యమండలి కళాకారుల గీతాలాపన ఆసాంతం ఆకట్టుకున్నాయి. సీపీఐ పుట్టపర్తి జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రాజారెడ్డి, అమీనమ్మ, పద్మావతి, శకుంతలమ్మ, లింగమయ్య, కేశవరెడ్డి, జాన్సన్, రాజేశ్, రమణయ్య, నాగార్జున, బీమప్ప, మనోహర, విద్యార్థి సంఘం నాయకులు, స్థానిక సీపీఐ నాయకులు మహదేవ, వై.గోపాల, నరసింహులు. నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

దేశంలో మంకీఫాక్స్ రెండో కేసు

మళ్లీ కేరళలోనే నమోదు

తిరువనంతపురం: ప్రపంచ దేశాలను కలవర పెడుతున్న మంకీపాక్స్ భారత్‌ను ఆందోళనకు గురిచేస్తోంది. తాజాగా కేరళలో రెండో కేసు నమోదైంది. కన్నూరు జిల్లాలో ఈ కేసు వెలుగు చూసినట్టు కేరళ రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి వీణాజార్జ్ సోమవారం ప్రకటించారు. కన్నూరుకు చెందిన ఒకరికి వైరస్ పాజిటివ్‌గా తేలిందన్నారు. ఈ నెల 12న దేశంలో తొలి మంకీపాక్స్ కేరళలోనే నమోదైన విషయం తెలిసిందే. ఇటీవల షార్జా నుంచి వచ్చిన కొల్లాంకు చెందిన వ్యక్తికి వైరస్ పాజిటివ్‌గా తేలింది. ఆయన్ను వెంటనే ఆసుపత్రిలో చేర్పించి, చికిత్స అందిస్తున్నారు. మంకీపాక్స్ వ్యాప్తి చెందకుండా కేరళ ప్రభుత్వం నిఘాను పెంచింది. ఐదు జిల్లాలకు ప్రత్యేకంగా హెచ్చరికలు జారీ చేసింది. షార్జా-తిరువనంతపురం ఇండిగో విమానంలో మంకీపాక్స్ పాజిటివ్ వ్యక్తి ప్రయాణించాడు. ఆయనతో పాటు తిరువనంతపురం, కొల్లాం, పతనంతిట్ట, అలప్పూజ, కొట్టాయానికి చెందిన ప్రయాణికులు ఉన్నారు. ఈ నేపథ్యంలో ఐదు జిల్లాలకు ప్రత్యేక హెచ్చరికలు జారీ చేసినట్లు ఉన్నతస్థాయి సమావేశం అనంతరం వీణాజార్జ్ తెలిపారు. చికున్‌గున్యా, ఇతర లక్షణాలున్న వారికి మంకీపాక్స్ సోకకుండా ఉండేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. వైరస్ ఇంకా ఎవరికైనా సోకిందా? అనే విషయం తెలుసుకునేం దుకు నమూనాలను పరిశీలించనున్నట్లు చెప్పారు. విమానాశ్రయాల్లో పరీక్షలను ముమ్మరం చేస్తామని, ఈ మేరకు విమానాశ్రయ అధికారులతో ఆరోగ్యశాఖ చర్చలు జరుపుతోందన్నారు. ఎవరైనా లక్షణాలు కనిపిస్తే వారిని ఐసోలేట్ చేసి, ఆసుపత్రులకు తరలించేందుకు ప్రత్యేకంగా అంబులెన్స్ ఏర్పాటు చేసినట్లు ఒక ప్రకటనలో తెలిపారు. మంకీపాక్స్ నివారణకు సమగ్రంగా శిక్షణ ఇస్తున్నామని, ఇప్పటి వరకు 1200 మంది ఆరోగ్య కార్యకర్తలకు శిక్షణ ఇచ్చినట్లు వివరించారు. ఇంతకు ముందు వైరస్ సోకిన వ్యక్తి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని, ఆయన నుంచి ఎవరికీ వైరస్ సోకినట్లు నిర్ధారణ కాలేదన్నారు.

సీపీఐ జాతీయ మహాసభలకు తిరుపతి నగర సమితి రూ.2 లక్షల విరాళం

విశాలాంధ్ర-తిరుపతి: అక్టోబరు 14 నుంచి 18వ తేదీ వరకు విజయవాడలో జరగనున్న సీపీఐ 24వ జాతీయ మహాసభల విజయవంతానికి సీపీఐ తిరుపతి నగర సమితి 2 లక్షలు విరాళాన్ని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, కార్యదర్శి వర్గ సభ్యులు పి.హరినాథరెడ్డికి 2 లక్షల రూపాయలు అందజేసింది. ఈ కార్యక్రమంలో సీపీఐ తిరుపతి జిల్లా కార్యదర్శి పి మురళి, నగర కార్యదర్శి జె.విశ్వనాథ్, జిల్లా కార్యవర్గ సభ్యులు చిన్నం పెంచలయ్య , ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కె.శివారెడ్డి, జి.శశి కుమార్, ఏపీ బాల తదితరులు పాల్గొన్నారు.

బీజేపీకి మద్దతిచ్చి ప్రజలను అవమానిస్తారా?

- వైసీపీ, టీడీపీపై నేతల ఆగ్రహం
- హోదా సాధన సమితి అధ్వర్యాన ఆందోళన

విశాలాంధ్ర-విజయవాడ(గాంధీనగర్): ప్రత్యేక హోదా, విభజన హామీలు అమలు చేయకుండా రాష్ట్రాన్ని మోసం చేసిన బీజేపీకి రాష్ట్రపతి ఎన్నికల్లో వైసీపీ, టీడీపీ పోటీపడి మద్దతివ్వటం బాధాకరమని నాయకులు విమర్శించారు. ఇది రాష్ట్ర ప్రయోజనాలను తాకట్టు పెట్టడమే కాకుండా ప్రజలను మోసం చేసినట్లేనని ఆగ్రహం వెలిబుచ్చారు. రాష్ట్రపతి ఎన్నికల్లో ఎన్‌డీఏ అభ్యర్థి ద్రౌపది ముర్ముకు అధికార వైసీపీ, ప్రతిపక్ష టీడీపీ మద్దతివ్వటాన్ని నిరసిస్తూ హోదా సాధన సమితి నాయకత్వాన సోమవారం విజయవాడ ధర్నాచౌక్ వద్ద సీపీఐ, సీపీఎం, కాంగ్రెస్, ఆమ్‌ఆద్మీ పార్టీ నేతలు, ప్రజాసంఘాల ప్రతినిధులు చెవిలో పువ్వులతో ఆందోళన చేశారు. ప్రత్యేక హోదా సాధన సమితి అధ్యక్షుడు చలసాని శ్రీనివాస్, సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు అక్కినేని వనజ మాట్లాడుతూ వైసీపీ, టీడీపీ పూర్తిగా బీజేపీకి దాసోహమయ్యాయని విమర్శించారు. ఒక్క ఎమ్మెల్యే కానీ, ఒక్క ఎంపీ కానీ లేని బీజేపీకి మద్దతివ్వడమంటే...విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను అమ్మేయడానికి అనుమతించినట్లు కాదా అని ప్రశ్నించారు. బీజేపీకి మద్దతివ్వడం ద్వారా వైసీపీ, టీడీపీ ప్రత్యేక హోదాను వ్యతిరేకిస్తున్నట్లేనని వ్యాఖ్యానించారు. పోలవరంలో గిరిజనులను ముంచేసిన బీజేపీకి మద్దతివ్వడమేమిటని సూటిగా ప్రశ్నించారు. పోలవరానికి, అమరావతికి నిధులివ్వని బీజేపీని బలపరుస్తున్న వైసీపీతో పాటు టీడీపీ సైతం రాజధానికి వ్యతిరేకమనే భావిస్తున్నామన్నారు. స్వప్రయోజనాలు, అధికారం కోసం అధికార, ప్రతిపక్షాలు కాషాయపార్టీని అంటకాగుతున్నా యన్నారు. రానున్న కాలంలో వైసీపీ, టీడీపీకి ప్రజలే తగిన బుద్ధి చెబుతారన్నారు. రాష్ట్ర ప్రజలు ప్రతి ఎన్నికల్లోనూ బీజేపీని తిరస్కరించారన్నారు. అలాంటప్పుడు బీజేపీ అభ్యర్థికి ఓట్లెలా వేస్తారని ప్రశ్నించారు. ప్రజాస్వామ్యాన్ని, లౌకికతత్వాన్ని, సామాజిక న్యాయాన్ని మంట కలుపుతున్న బీజేపీని నిసిగ్గుగా ఈ పార్టీలు బలపరచడం శోచనీయమన్నారు. సామాజిక న్యాయం, గిరిజన మహిళ ముసుగులో కాషాయపార్టీని బలపరచడం దారుణమన్నారు. అటవీ హక్కుల చట్టాన్ని బీజేపీ నీరుగారుస్తూ అటవీ భూములను, సంపదను కార్పొరేట్లకు కట్టబెడుతూ గిరిజనులకు ద్రోహం చేసిందన్నారు. 25 మంది ఎంపీలను గెలిపిస్తే ప్రత్యేక హోదా తెస్తానని డాంబికాలు పలికిన సీఎం జగన్ మాటమార్చి మోదీకి దాసోహమవ్వటం సిగ్గచేటన్నారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సీహెచ్ బాబూరావు మాట్లాడుతూ మోదీ రాష్ట్రానికి చేసిన ద్రోహంపై ప్రజలు ఆగ్రహంతో ఉన్నారన్నారు. పార్లమెంటులో జాతీయ చిహ్నన్ని దళిత రాష్ట్రపతి లేకుండా ప్రధాని మోదీ ఒంటరిగా ప్రారంభం చేశారని, బీజేపీ ఇప్పుడు సామాజిక న్యాయం గురించి మాట్లాడటం హాస్యాస్పదమన్నారు. సామాజిక న్యాయం ముసుగులో బీజేపీని వైసీపీ, టీడీపీ బలపరచడం సిగ్గుచేటన్నారు.

కార్యక్రమంలో కాంగ్రెస్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు మస్తాన్ వలి, సీపీఐ విజయవాడ నగర కార్యదర్శి దోనేపూడి శంకర్, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు మంతెన సీతారాం, డీహెచ్‌పీఎస్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ బుట్టి రాయప్ప, సీపీఐ నగర కార్యవర్గ సభ్యులు తాడి పైడయ్య, సంగుల పేరయ్య, కొట్టు రమణారావు, డీవీ కృష్ణ, దోనేపూడి కాశీనాథ్, కాంగ్రెస్ నగర అధ్యక్షుడు నరహరిశెట్టి నరసింహారావు, ఆమ్‌ఆద్మీ పార్టీ నేత పోతిన వెంకట రామారావు, ఫణిరాజు, సుదర్శనరావు, ఎంవీ ఆంజనేయులు, పోతుల బాలకోటయ్య తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ బ్లాక్‌మెయిల్ రాజకీయం

- హైదరాబాదే రాజధాని అనుకుంటున్న వైసీపీ నేతలు
- అల్లూరి విగ్రహావిష్కరణ సభకు హీరో కృష్ణను పిలవకపోవడం దారుణం
- చిరంజీవిని పిలవడం విడ్డూరం
- సీపీఐ కార్యదర్శి నారాయణ

మాట్లాడుతున్న నారాయణ, పక్కన రామానాయుడు, మురళి, పెంచలయ్య, విశ్వనాథ్

విశాలాంధ్ర బ్యూరో-తిరుపతి: బీజేపీది బ్లాక్‌మెయిల్ రాజకీయమని, ఆంధ్ర ప్రదేశ్‌లో అధికార, ప్రతిపక్ష పార్టీలను బెదిరించి మోదీ తమకు అనుకూలంగా మలుచుకుంటు న్నారని సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె నారాయణ విమర్శించారు. సోమవారం ఉదయం తిరుపతిలోని సీపీఐ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ మోదీ బెదిరింపు రాజకీయాలకు భయపడి అధికార వైసీపీ, ప్రతిపక్ష టీడీపీ మోదీకి మోకరిల్లాయని అన్నారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి ఏమి చేసిందని ఓటు వేస్తున్నారని ప్రశ్నించారు. రాష్ట్రం విడిపోయినా ఇంకా హైదరాబాద్ రాజధాని అని వైసీపీ నేతలు అనుకుంటున్నారని చెప్పారు. రాజధాని కావాలన్న చిత్తశుద్ధి వైసీపీకి ఏ మాత్రం లేదన్నారు. ఉప రాష్ట్రపతి పదవిని తిరిగి వెంకయ్యనాయుడుకు ఇస్తారనుకున్నామని, చురుగ్గా ఉండే వ్యక్తులను బీజేపీ ఉన్నతస్థానంలో ఎక్కువరోజులు కొనసాగిం చదని అన్నారు. వెంకయ్యనాయుడును గవర్నర్ పదవికి పరిమితం చేసే అవకాశం ఉందనీ చెప్పారు. అల్లూరి సీతారామరాజు విగ్రహావిష్కరణ సమ యంలో నటుడు కృష్ణను సభా వేదికపైకి తీసుకు వచ్చి ఉంటే బాగుండేదన్నారు. ఊసరవెల్లి లాగా ప్రవర్తించే చిరంజీవిని సభావేదికపై తీసుకు రావడం సరైంది కాదన్నారు. పవన్ కల్యాణ్ మందు పాతర లాంటి వాడని ఎప్పుడు ఎక్కడ ఎలా పెలు తాడో తెలియదన్నారు. ఏపీలో రోడ్ల దుస్థితిపై జనసేన చేస్తున్న నిరసనలను స్వాగతిస్తున్నామని చెప్పారు. కుంభవృష్టి కురిస్తే దానికి క్లౌడ్ బరస్ట్ అని కేసీఆర్ కొత్త పేరు పెట్టారన్నారు. భారీ ప్రవా హాలది అంతర్జాతీయ కుట్ర అని కేసీఆర్ చెప్పడం సరైనది కాదన్నారు. రాష్ట్ర ప్రభుత్వ నిఘా వైఫ ల్యంతో ఏపీలో వరదలు బీభత్సం సృష్టించాయ న్నారు. వరదబాధితులను ఆదుకోవడంలో ప్రభు త్వం విఫలం అయిందని చెప్పారు. ముఖ్యమంత్రి ఏరియల్ సర్వేకే పరిమితం కాకుండా సర్వం కోల్పోయిన బాధితులకు ఇళ్లను నిర్మించి ఇవ్వాలని నారాయణ డిమాండ్ చేశారు. సింగపూర్ ఓపెన్ విజేతగా నిలిచిన పీవీ సింధూకి కమ్యూనిస్టు పార్టీ తరపున అభినందనలు తెలిపారు.

గిరిజనులను ఖాళీ చేసి అటవీ భూములను కార్పొరేట్ సంస్థలకు అప్పగిం చేందుకు ప్రభుత్వం సిద్ధపడుతోందని అన్నారు. గిరిజనులకు అండగా నిలబడతామని చెప్పారు. బీజేపీకి వ్యతిరేకంగా ఏర్పడే ఫ్రంట్‌ను బలపరుస్తా మనీ, రాష్ట్రంలో బీజేపీకి వ్యతిరేకంగా టీడీపీ, జనసేన లాంటి పార్టీలు కలిసి రావాల న్నారు. బీజేపీని వ్యతిరేకిస్తూ ఒంటరిగా పోరాడతా నని కేసీఆర్ చెప్పడం సరికాదని నారాయణ అన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామానాయుడు మాట్లాడుతూ జగన్ తన తండ్రి ఆశయమైన ఉచిత విద్యుత్ ను పక్కనపెట్టి, మోదీ ఆశయమైన వ్యవసాయ మోటార్లకు మీటర్లు బిగించే కార్యక్రమాన్ని భుజాన వేసుకున్నారని ఎద్దేవా చేశారు. జిల్లాలో మీటర్లు బిగించేందుకు అధికా రులు వస్తే అడ్డుకుంటామని హెచ్చరించారు. ఈ విలేకరుల సమావేశంలో సీపీఐ తిరుపతి జిల్లా కార్య దర్శి మురళి, కార్యవర్గ సభ్యులు చిన్నం పెంచ లయ్య, నగర కార్యదర్శి విశ్వనాథ్, మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి నదియా పాల్గొన్నారు.

రాష్ట్రపతి ఎన్నికల్లో డబ్బు పాత్ర: సిన్హా

న్యూఢిల్లీ: భారతదేశ దిశను రాష్ట్రపతి ఎన్నికలు నిర్ణయిస్తాయని విపక్షాల రాష్ట్రపతి అభ్యర్థి యశ్వంత్‌సిన్హా సోమవారం చెప్పారు. ప్రజా స్వామ్యం బతుకుతుందా లేదా తేలుస్తాయని వ్యాఖ్యానించారు. రాష్ట్రపతి ఎన్నికల్లో ఆత్మ ప్రబోధానుసారం ఓటు వేయాలని, తనకు మద్దతివ్వాలని ఓటర్లకు ఆయన విజ్ఞప్తి చేశారు. ఆత్మప్రబోధానుసారం ఓటేయాలని యశ్వంత్‌సిన్హా ఇప్పటికే పదేపదే విజ్ఞప్తి చేస్తూ వచ్చారు. ఎన్‌డీయే యేతర పార్టీలు కొన్ని ఇప్పటికే బీజేపీ అభ్యర్థి ద్రౌపది ముర్ముకు మద్దతిచ్చిన విషయం విదితమే. భారతదేశ మార్గాన్ని నిర్ణయించే అవకాశం ఉన్నందున రాష్ట్రపతి ఎన్నికలు అత్యంత కీలకమైనవని తాను పదేపదే చెబుతున్నానని, భారత్‌లో ప్రజాస్వామ్యం బతికిబట్ట కడు తుందా లేదా అనేది కూడా ఈ ఎన్నికలు నిర్ణయిస్తాయని సిన్హా పేర్కొన్నారు. ప్రజాస్వా మ్యానికి ముప్పు ఏర్పడే ప్రమాదం ఉందని, ఆ సంకేతాలు స్పష్టంగా కనిపిస్తున్నాయని సిన్హా ఇక్కడ విలేకరులతో అన్నారు. 'రాష్ట్రపతి ఎన్నికల్లో పార్టీ విప్ లేదు. ఇది రహస్య బ్యాలెట్ విధానం. మీ అంతరాత్మకు అనుగు ణంగా ఓటేయాలని ఎంపీలు, ఎమ్మెల్యేలకు విజ్ఞప్తి చేస్తున్నాను. ప్రజాస్వామ్యాన్ని కాపాడు కునేందుకు నన్ను గెలిపించండి' అని సిన్హా ఓటింగ్‌కు ముందు విన్నవించారు. తాను కేవలం రాజకీయ యుద్ధం మాత్రమే చేయ డం లేదని, ప్రభుత్వ సంస్థలపైనా పోరాటం చేస్తున్నానని యశ్వంత్‌సిన్హా తెలిపారు.

ప్రజాసమస్యలపై సీపీఐ పోరు

మాట్లాడుతున్న రావుల. వేదికపై దశరథరామయ్య, వినోదమ్మ, బాలకోటయ్య, మధు, ఆంజనేయులు తదితరులు

విశాలాంధ్ర బ్యూరో-నెల్లూరు: ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం చేసేది కమ్యూనిస్టు పార్టీ అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, అఖిల భారత కిసాన్ సభ అధ్యక్షులు రావుల వెంకయ్య అన్నారు. సోమవారం నెల్లూరు టౌన్ హాలులో జరిగిన సీపీఐ 25వ జిల్లా మహాసభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లా దారు. కమ్యూనిస్టులు ఏనాడూ పదవుల కోసం పాకులా డలేదని, ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం సాగిస్తారని అన్నారు. అటువంటి కమ్యూనిస్టు పార్టీకి మంచి భవిష్యత్తు ఉందని తెలిపారు. కేంద్రంలో మోదీ అధికారం చేపట్టిన నాటి నుంచి దేశ ఆర్థిక వ్యవస్థ పూర్తిగా దెబ్బతిందని, ప్రజలపై అధిక భారాలు మోపిందని మండిపడ్డారు. కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తూ సామాన్య ప్రజల నడ్డివిరిచేలా పాలన సాగిస్తోందని వెంకయ్య విమర్శించారు. మరో ముఖ్య అతిథి, సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పి.హరినాథరెడ్డి మాట్లా డుతూ జాతీయ స్థాయిలో దశదిశను నిర్దేశించే స్థాయి కాంగ్రెస్ పార్టీకి లేదని అన్నారు. ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో బీజేపీని ఎదుర్కోవడానికి ఇతర పార్టీలతో కలిసి వామపక్ష పార్టీలు ముందుకు వెళతాయని తెలి పారు. అక్టోబర్‌లో జరిగే జాతీయ మహాసభలో దీనిపై చర్చించి, భవిష్యత్ కార్యాచరణ రూపొంది స్తామని అన్నారు. తెలుగుదేశం, వైసీపీ ప్రజా సమస్య లను పట్టించుకోకుండా, రాష్ట్ర ప్రయోజనాలను తుంగలో తొక్కి వారి వ్యక్తిగత స్వార్థాల కోసమే రాష్ట్రపతి ఎన్నికలలో బీజేపీ అభ్యర్థికి ఓటు వేశాయని విమర్శించారు. ప్రజాసమస్యలపై పోరాటం చేసే కమ్యూనిస్టులపై అక్రమ కేసులు బనాయిస్తున్నారని ధ్వజమెత్తారు. భవిష్యత్తులో ప్రజలే వీరికి తగిన గుణపాఠం చెబుతారని అన్నారు. ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో పార్టీ బలోపేతానికి ప్రజా సంఘాలను గ్రామ స్థాయి నుంచి ఏర్పాటు చేయాలని కార్యకర్తలకు సూచించారు. మహాసభలకు అధ్యక్ష వర్గంగా వినోదమ్మ, బాలకోటయ్య, మధు వ్యవహరించగా తొలుత సీపీఐ జెండాను పార్టీ సీనియర్ నాయకులు పముజుల దశరథరామయ్య ఎగరవేశారు. అనంతరం జరిగిన మహాసభలో సంతాప తీర్మానాన్ని కె.ఆంజనే యులు ప్రవేశపెట్టగా ప్రతినిధులు రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళి అర్పించారు. జిల్లా కార్యదర్శి దామా అంకయ్య కార్యదర్శి నివేదికను ప్రవేశపెట్టారు.

జిల్లా కార్యదర్శిగా దామా అంకయ్య



సీపీఐ జిల్లా కార్యదర్శిగా దామా అంకయ్య ఏకగ్రీ వంగా ఎన్నికయ్యారు. 41 మందితో నూతన సమితిని మహాసభ ఎన్నుకుంది. సమితి సమావేశమై 15 మందితో కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కార్యవర్గ సభ్యులుగా దామా అంకయ్య, అరిగెల నాగేంద్ర సాయి, దేగ సత్యనారాయణ, యాట సీనయ్య, సురేష్, చిన్న అంకయ్య, మధు, నందయ్య, ఎస్‌డీ సిరాజ్, రమణయ్య, మున్వర్, షాన్ వాజ్, లత ఎన్నికయ్యారు. ఆహ్వానితులుగా కందుకూరుకు చెందిన మాలకొండయ్యని ఎన్నుకున్నారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.

మంగళవారం
19-07-2022
విజయవాడ ప్రచురణ
సంపుటి : 71, సంచిక : 28
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

స్థాపితం 1952 విశాలాంధ్ర 70

రాష్ట్రపతి ఎన్నికల్లో 99.18 శాతం పోలింగ్

- 10 రాష్ట్రాలు... ఒక కేంద్ర పాలిత ప్రాంతంలో 100 శాతం
- అనేక రాష్ట్రాల్లో క్రాస్ ఓటింగ్
- బ్యాలెట్ బాక్సులు పార్లమెంట్ భవనంలోని స్ట్రాంగ్ రూమ్‌కి తరలింపు
- 21న ఓట్ల లెక్కింపు

న్యూదిల్లీ: భారతదేశ 15వ రాష్ట్రపతిని ఎన్నుకునేందుకు దేశవ్యాప్తంగా ఉన్న ఎంపీలు, ఎమ్మెల్యేలు సోమవారం ఓటు వేశారు. రాష్ట్రపతి భవన్‌కు జరిగే పోరులో విజయం సాధించడానికి ప్రతిపక్షాల ఉమ్మడి అభ్యర్థి యశ్వంత్ సిన్హా ఎన్‌డీఏ అభ్యర్థి ద్రౌపది ముర్ము మధ్య ఎన్నిక జరిగింది. పార్లమెంట్

- మిగతా 2 లో

కోవిడ్ నిధులు మళ్లించేస్తారా?

జగన్ సర్కార్‌పై సుప్రీం ఆగ్రహం

రెండు వారాల్లో ఎస్డీఆర్ఎఫ్ ఖాతాలో జమ చేయాలని ఆదేశం

విశాలాంధ్ర బ్యూరో‌– అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో కోవిడ్ నిధులు పక్కదారి పట్టించిన వ్యవహారంపై సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. ఈ కేసుకు సంబంధించి సుప్రీంకోర్టులో ఏపీ ప్రభుత్వానికి మరోసారి చుక్కెదురైంది. పీడీ ఖాతాలకు మళ్లించిన కోవిడ్ నిధులను తిరిగి రెండు వారాల్లో ఎస్డీఆర్ఎఫ్ ఖాతాలో జమ చేయాలని ఏపీ ప్రభుత్వాన్ని జస్టిస్ ఎంఆర్ షా ధర్మాసనం ఆదేశించింది. పీడీ ఖాతాల్లోకి మళ్లించిన రూ.1100 కోట్లను ఎస్‌డీఆర్ఎఫ్ ఖాతాలోకి జమ చేయాలని స్పష్టంచేసింది. కరోనా పరిహారం అందలేదని ఎవరైనా ఫిర్యాదు చేస్తే నాలుగు వారాల్లో దానిని పరిష్కరించాలని సూచించింది. ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న రాష్ట్ర ప్రభుత్వం వివిధ శాఖలకు చెందిన నిధుల తరహాలోనే ఎస్డీఆర్ఎఫ్ నిధులను మళ్లించిన సంగతి తెలిసిందే. కోవిడ్‌తో మృతిచెందిన కుటుంబాలకు పరిహారంగా ఇవ్వడానికి మాత్రమే ఈ నిధులు ఉపయోగించాల్సి ఉంటుంది. కేంద్రం వీటిని విడుదల చేస్తుంది. అయితే రాష్ట్ర ప్రభుత్వాలు తమ వ్యక్తిగత అవసరాలకు వీటిని వాడకూడదు. కానీ ఏపీ ప్రభుత్వం పీడీ ఖాతాలకు ఈ నగదును మళ్లించడంతో కోవిడ్ వల్ల మరణించిన బాధిత కుటుంబ సభ్యులు కొందరు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. తాజాగా జస్టిస్ ఎంఆర్ షా ధర్మాసనం రెండు వారాల్లోగా ఎస్డీఆర్ఎఫ్ ఖాతాకు మళ్లించాలని ఆదేశించింది.

మానవత్వం లేని జగన్ పాలనకు నిదర్శనం: చంద్రబాబు

నిబంధనలకు విరుద్ధంగా ఏపీ ప్రభుత్వం రూ.1100 కోట్ల కోవిడ్ విపత్తు నిధులను దారి మళ్లించడం మానవత్వం లేని జగన్ పాలనకు నిదర్శనమని ప్రతిపక్ష నేత చంద్రబాబు విమర్శించారు. సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలు జగన్‌రెడ్డి ఇష్టానుసార పాలనకు చెంపపెట్టులాంటిదని పేర్కొన్నారు.

ఇంకా వరద గుప్పిట్లోనే...

లంక గ్రామాలకు అందని ప్రభుత్వ సాయం

కూడు, గూడు లేక అలమటిస్తున్న బాధితులు

సర్వం కోల్పోయిన రైతులు

విశాలాంధ్ర–కాకినాడ: మహోగ్ర రూపం దాల్చిన గోదావరి శాంతించింది. విరుచుకుపడిన వరద ఉధృతి తగ్గినప్పటికీ తీరం వెంబడి ప్రజలు ఇంకా వరద గుప్పిట్లోనే మగ్గుతున్నారు. లంక గ్రామాలు, విలీన మండలాల్లోని ప్రజల పరిస్థితి అత్యంత దయనీయంగానే ఉంది. ఉండటానికి గూడు లేక, తినడానికి తిండిలేక తీవ్ర అవస్థలు పడుతున్నారు. చిన్నారులకు పాలు కూడా అందించలేని దుస్థితి నెలకొంది. అధికారులు అందించే అరకొర సాయం చాలక పెద్దలు, పిల్లలు ఆకలితో అలమటిస్తున్నామని వాపోతున్నారు. తూర్పుగోదావరి జిల్లా, కాకినాడ జిల్లా, అంబేద్కర్ కోనసీమ జిల్లాలను గోదావరి వరదలు ఊహించని విధంగా దెబ్బతీశాయి. మూడు జిల్లాల్లోని 200 గ్రామాల వరకు ముంపుబారిన పడ్డాయి. కోనసీమ జిల్లాలోని 22 మండలాల్లో 75 గ్రామాలు

- మిగతా 2 లో

శ్రీశైలం ప్రాజెక్టుకు పెరుగుతున్న వరద

విశాలాంధ్ర బ్యూరో‌–కర్నూలు: కృష్ణా పరీవాహక ప్రాంతంలో కురుస్తున్న భారీ వర్షాల వల్ల శ్రీశైలం ప్రాజెక్టుకు వరద కొనసాగుతోంది. శ్రీశైలం ప్రాజెక్టుకు ఎగువ నుంచి 3,37,254 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. జూరాల నుంచి 1,37,477 క్యూసెక్కులు, సుంకేసుల నుంచి 1,65,122 క్యూసెక్కులు, జూరాల విద్యుత్ ప్రాజెక్టు ద్వారా 34,655 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుండగా, ప్రాజెక్టు నుంచి తెలంగాణా విద్యుత్ ఉత్పత్తికి 31,784 క్యూసెక్కులు, మహాత్మాగాంధీ కల్వకుర్తి ఎత్తిపోతల పథకానికి 2400 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. శ్రీశైలం ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం 215 టీఎంసీలు కాగా ప్రస్తుతం 131.8508 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ప్రాజెక్టు పూర్తి నీటినిల్వ సామర్థ్యం 885 అడుగులు కాగా ప్రస్తుతం ప్రాజెక్టులో 867.50 అడుగుల ఎత్తున నీటి నిల్వ ఉంది.

భజన కళాకారులూ కార్మికులే

- వారి సేవలు గుర్తిస్తేనే టీటీడీకి ఔన్నత్యం
- సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ

తిరుమల తిరుపతి దేవస్థానంలో భజన కళాకారులను కార్మికులుగా గుర్తించాలని, వారి సేవలను కొనసాగించాలని సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ డిమాండ్ చేశారు.

2లో

వాయిదాలతో సరి

- ధరల పెరుగుదల, అగ్నిపథ్‌పై విపక్షాల నిలదీత
- లోక్‌సభ, రాజ్యసభ నేటికి వాయిదా

న్యూదిల్లీ: పార్లమెంటు ఉభయసభలు ప్రారంభమైన మొదటిరోజే దద్దరిల్లాయి. ధరల పెరుగుదల నుంచి అగ్నిపథ్ పథకం వరకు అనేక అంశాలపై చర్చించాలని ప్రతిపక్షాలు పెద్దఎత్తున డిమాండ్ చేశాయి. ప్రత్యేకించి అన్ని అంశాలను పక్కనపెట్టి యువత జీవితాన్ని ఇబ్బందుల్లోకి నెట్టిన అగ్నిపథ్‌పై తక్షణమే చర్చించాలని పట్టుబట్టాయి. దీంతో ఉభయసభలు పదేపదే వాయిదా పడ్డాయి. సభ నిర్వహణకు సహకరించాల్సిందిగా లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, రాజ్యసభ ఛైర్మన్ ఎం.వెంకయ్యనాయుడు ఎన్నిసార్లు విన్నవించినా విపక్షాలు శాంతించలేదు. పార్లమెంటు వర్షాకాల సమావేశాలు సోమవారం ప్రారంభమయ్యాయి. ప్రతిపక్షాలు కొన్ని సమస్యలను లేవనెత్తడానికి ప్రయత్నించినప్పటికీ రాష్ట్రపతి ఎన్నికల్లో ఓటేయడానికి సభ్యులకు అవకాశం కల్పిస్తూ లోక్‌సభ ఉదయం కార్యకలాపాలను స్పీకర్ వాయిదా వేశారు. ఛైర్మన్ వెంకయ్యనాయుడు అధ్యక్ష స్థానంలో కూర్చోగానే కాంగ్రెస్ సభ్యులు వెల్‌లోకి దూసుకెళ్లి ప్రభుత్వానికి వ్యతిరేకంగా

- మిగతా 2 లో

విశాలాంధ్ర దినపత్రికకు 70వ వార్షికోత్సవ శుభాకాంక్షలు

అద్దంకి పట్టణములో చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమములు

1. రూ. 7.00 కోట్ల రూపాయలతో 14వ ఆర్థిక సంఘం నిధులతో 1 నుండి 20 వార్డుల యందు రోడ్లు, డ్రైన్లు మరియు మంచి నీటి పైపు లైన్ల నిర్మాణము.
2. రూ. 83.00 కోట్లతో పట్టణములో సమగ్ర మంచి నీటి పథకము నిర్మాణము.
3. రూ. 1.60 కోట్లతో గొరకాయపాలెం మరియు గరటయ్య కాలనీ నందు 10 పడకల అర్బన్ హెల్త్ సెంటర్లు నిర్మాణము.
4. యన్.ఏ.యం. హైవే నందు సెంటర్ లైటింగ్ ఏర్పాటు.
5. రూ. 75.00 లక్షలతో బంగ్లారోడ్ నందు ఇరువైపులా సైడు కాలువలు, సిమెంట్ రోడ్ వెడల్పు చేయుట. సెంట్రల్ లైటింగ్ మరియు బ్యూటిఫికేషన్.
6. రూ. 46.00 లక్షలతో మునిసిపల్ ఆఫీసు రోడ్ సెంట్రల్ డివైడర్, సెంట్రల్ లైటింగ్ మరియు బ్యూటిఫికేషన్.
7. రూ. 25.00 లక్షలతో ఓపెన్ జిమ్ మరియు చిన్నపిల్లల పార్క్ ఏర్పాటు.
8. రూ. 20.00 లక్షలతో కౌన్సిల్ హాల్ నిర్మాణము.
9. రూ. 7.00లక్షలతో ఓపెన్ ఆడిటోరియమ్ నిర్మాణము.
10. మునిసిపల్ కార్యాలయం వద్ద పే & యూజ్ టాయిలెట్స్ నిర్మాణము.
11. రూ. 98.00 లక్షలతో గొరకాయపాలెం మరియు గరటయ్య కాలనీ వద్ద జి.టి.యస్. నిర్మాణము చేపట్టుట.
12. రూ. 80.00 లక్షలతో నామ్ హైవే నందు ఫుట్‌పాత్ మరియు బి.టి. రోడ్ నిర్మాణము చేపట్టుట.



శ్రీ బాచిన క్రిష్ణచైతన్య గారు
రాష్ట్ర శాప్‌నెట్ ఛైర్మన్
అద్దంకి నియోజకవర్గ ఇన్‌ఛార్జి

శ్రీ దేసు పద్మేష్
వైస్ ఛైర్మన్, అద్దంకి నగరపంచాయితి

శ్రీమతి కె. అనంతలక్ష్మి
వైస్ ఛైర్మన్-2, అద్దంకి నగరపంచాయితి

శ్రీమతి. లక్కనబోయిన ఎస్తేరమ్మ
ఛైర్‌పర్సన్, అద్దంకి నగరపంచాయితి

కమీషనర్
నగర పంచాయితీ
అద్దంకి